సంగీత మేరు శిఖరాలు
రూ.120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 184 | గురువారం | 04-06-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


ఎరువుల ధరలను తగ్గించాలని 6, 8 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం నిరసనలు

రాష్ట్రంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక 'టెట్' 03

## రాష్ట్రంలో భూముల విలువలు సవరణ

### రేపటి నుంచి అమలులోకి



- బహిరంగ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలు నిర్ణయించాం
- ఆ రెండింటి మధ్య భారీ అంతరం ఉండటంతో భూ లావాదేవీలలో అనేక సమస్యలు
- క్షేత్రస్థాయిలో మార్కెట్ ధరలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు
- అధిక మార్కెట్ విలువలున్న ప్రాంతాల్లో పెంపు లేదు
- క్యూర్ పరిధి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లు నిర్ణయించాం
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువ ఈ నెల 5వ తేదీ నుంచి అమలులోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులు ఉన్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకే భూముల విలువలు సవరించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎటువంటి సమగ్ర కసరత్తు చేయకుండానే అశాస్త్రీయ పద్ధతుల్లో 2021 22 సంవత్సరాల్లో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండు సార్లు భూముల ధరలను పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని ఆయన గుర్తు చేశారు. గతంలో క్షేత్రస్థాయి అధ్యయనం లేకుండా కేవలం శాతం గణనల ఆధారంగా, పట్టికల ప్రకారం గత ప్రభుత్వం సవరించడంతో కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువలు నిర్ణయించారన్నారు. వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటంతో భూ లావాదేవీలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల (ఎస్‌ఆర్‌ఓ) పరిధిలో మార్కెట్ విలువల సవరణ చేపట్టామని మంత్రి పొంగులేటి వివరించారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు తరువాయి 8లో



### టిఎంసి శాసనసభాపక్షంలో

## 60 మంది తిరుగుబాటు

- ప్రతిపక్షనాయకునిగా సొంత అభ్యర్థి; స్పీకర్ గుర్తింపు
- మమతాబెనర్జీకి మిగిలింది 20 మంది ఎమ్మెల్యేలు
- మహారాష్ట్ర తరహాలో చీలికదిశలో తృణమూల్ కాంగ్రెస్

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో చీలిక వచ్చింది. తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందానికి నేతృత్వం వహిస్తున్న రీటాబ్రత బెనర్జీ, టిఎంసిలో 'ఏక్‌నాథ్ షిండే'గా మారారు. ఆ పార్టీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో 58 మంది సభ్యుల మద్దతు తనకు ఉన్నదని పేర్కొన్నారు. తమ తిరుగుబాటు వర్గాన్ని పార్టీ శాసనసభా విభాగంగా గుర్తించాలన్న అభ్యర్థనను పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ అంగీకరించారని, దానికి ముఖ్య సలహాదారుగా పనిచేయాలని మమతా బెనర్జీని కోరారని తెలిపారు. టిఎంసి నుంచి బహిష్కరించబడిన శాసనసభ్యుడు రీటాబ్రత బెనర్జీని శాసనసభాపక్ష నాయకుడిగా 58 మంది అసమ్మతి ఎమ్మెల్యేలు సమర్థించి, తమ నిర్ణయాన్ని అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు తెలియజేసిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ తాజా పరిణామంతో టిఎంసి శాసనసభాపక్ష నియంత్రణ అసమ్మతివాదుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ నాయకత్వ అధికారానికి ఇది అత్యంత తీవ్రమైన సవాలుగా నిలిచింది. స్పీకర్‌తో సమావేశమైన అనంతరం అసెంబ్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రీటాబ్రత బెనర్జీ మాట్లాడుతూ టిఎంసి గుర్తుపై ఎన్నికైన 58 మంది ఎమ్మెల్యేల సంతకాలను తమ వర్గం సమర్పించిందని, తమ అభ్యర్థనను తరువాయి 12లో

### పరస్పర సహకారం

## మరింత విస్తరించుకుందాం

- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే బృందంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సమావేశం
- దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని ముఖ్యమంత్రి వెల్లడి
- భారత్‌తో సౌత్ ఆఫ్రికాది చారిత్రక బంధం: పాల్ మషాటిలే



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపించే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షులు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో సిఎం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఇరు పక్షాలు చర్చించాయి. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో జరిగిన సమావేశంలో సిఎం ఎ.రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు వివరించారు. ఐటి, ఫార్మా, రక్షణ, ఏరో స్పేస్ వంటి అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అనేక ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్500 కంపెనీలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు హైదరాబాద్‌ను తరువాయి 8లో

### నేడు, రేపు పాలమూరులో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన

పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను పరిశీలన

5న రాత్రి 6.30 గంటలకు ఉదండాపూర్‌లో బహిరంగ సభ 03



### నటుడిగా అభిమానిస్తాం

## పెత్తనం ఒప్పుకోం

- పవన్ కళ్యాణ్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు
- నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన నేల ఇది
- ఇక్కడ కమ్యూనిస్టులు కదం తొక్కారు
- మీట్ ది ప్రెస్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదని, తెలంగాణ నేల ఆనాడు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన నేల అని, కమ్యూనిస్టులు కదంతొక్కిన నేల అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు గుర్తు చేశారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'మీట్ ది ప్రెస్'లో జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు కెటిఆర్ తరువాయి 12లో

### పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు

## ప్రజాద్రోహం

**రాజకీయ ప్రయోజనాల కోసం తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టే యత్నం**

- కమ్యూనిజం చచ్చిపోయిందని వ్యాఖ్యానించడం వెనుక ఆయన ఉద్దేశమేమిటో చెప్పాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజా ద్రోహమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అపరిచితుడు' అనే పేరు పవన్ కళ్యాణ్‌కు సరిగ్గా సరిపోతుందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలుగు ప్రజల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించే విధంగా ఉన్నాయని, తెలంగాణ అవతరణ దినోత్సవం రోజునే వచ్చి తరువాయి 8లో



### కర్నాటక సిఎంగా

## డికె శివకుమార్ ప్రమాణం

- మంత్రులుగా మరో 13 మంది సీనియర్ సభ్యులు ప్రమాణ స్వీకారం :
- ఉప ముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర

**బెంగళూరు :** కర్నాటక నూతన ముఖ్యమంత్రిగా 64 ఏళ్ల దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్ (డి.కె. శివకుమార్) బుధవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డికె, మరో 13 మంది సీనియర్ శాసనసభ్యులతో కలిసి కర్ణాటకలోని లోక్ భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. పరమేశ్వర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. వందలాది మంది అతిథుల సమక్షంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వీరితో పదవీ, గోప్యతా ప్రమాణాలు చేయించారు. శివకుమార్ 'వీర గంగాధర అజ్జయ్య' పేరు మీద ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం చేయడానికి ముందు, తరువాయి 12లో

## బలమైన వామపక్షాన్ని పునర్నిర్మిద్దాం



- ఈ వారంలో ఢిల్లీలో సమావేశమవుదాం
- వామపక్ష ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించి, కార్యాచరణ రూపకల్పన చేద్దాం
- వామపక్ష ప్రధాన పార్టీలకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా లేఖ

**న్యూఢిల్లీ :** దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి, వామపక్షాలను ఒక బలమైన శక్తిగా పునర్నిర్మించేందుకు సమష్టిగా ఒక వ్యూహాన్ని రూపొందించుకోవడానికి వామపక్ష నాయకులందరూ ఏకతాటిపైకి రావాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా పిలుపునిచ్చారు. వామపక్ష ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించి, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు వీలైనంత త్వరగా న్యూఢిల్లీలో సమావేశం కావాలని కోరుతూ ప్రధాన వామపక్ష పార్టీల నాయకులకు డి. రాజా లేఖ రాసినట్లు బుధవారం పిటిఐ పేర్కొంది. ఈమేరకు వామపక్ష పార్టీల ప్రధాన కార్యదర్శులైన సిపిఐ(ఎం)కు చెందిన ఎం.ఎ. బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన జి. దేవరాజన్, ఆర్‌ఎస్‌పికి చెందిన మనోజ్ భట్టాచార్యలకు లేఖ రాశారు. సమావేశపు తేదీని త్వరలోనే ఖరారు చేయనున్నారు. అంతకు ముందు సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుల మధ్య ఒక అనధికారిక సమావేశం కూడా జరిగే అవకాశం ఉంది. జూన్ మొదటి వారంలో ఢిల్లీలో వామపక్ష నాయకుల సమావేశం నిర్వహించాలని తరువాయి 12లో

### ఫోన్ ట్యాప్ కేసులో నిందితుడు

## భుజంగరావు ఇంటిపై ఎసిబి దాడులు

- రూ.5.92 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- కిలో బంగారం, రూ.3.83 లక్షల నగదు స్వాధీనం
- సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూములు



ప్రజాపక్షం/హైదరాబాద్

అవినీతి ఆరోపణలతో ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో సస్పెన్షన్‌లో ఉన్న తెలంగాణ అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నాయిని భుజంగరావుపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) భారీ అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. ఎసిబి డిజి చారుసిన్హా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన ఎసిబి అధికారులు బుధవారం ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలు, అనుచరులకు చెందిన 15 ప్రాంతాల్లో తరువాయి 12లో

### ఢిల్లీలోని హోటల్‌లో

## ఘోర అగ్నిప్రమాదం

**21 మంది సజీవ దహనం**

- మరికొంత మందికి గాయాలు
- కొందరు పరిస్థితి విషమం
- దక్షిణ ఢిల్లీ మాల్వీయా నగర్‌లోని ఓ హోటల్‌లో ఘటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని మాల్వీయా నగర్ ప్రాంతంలో రద్దీగా ఉండే ఒక సందులోని హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. మృతులలో విదేశీయులు కూడా ఉన్నారు. వారి బంధువులు అనారోగ్యంతో సమీపంలోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. మాల్వీయా నగర్‌లోని హౌజ్ రాణిలో ఉన్న ఫ్లోరిష్ స్టే బి అండ్ బిలో ఉదయం 8.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగి, వేగంగా వ్యాపించాయి. ఐదు అంతస్తుల ఇరుకైన భవనంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడానికి స్థానికులతో తరువాయి 8లో

## గల్ఫ్ దేశాలపై మళ్ళీ ఇరాన్ డ్రోన్ దాడులు



- కువైట్ విమానాశ్రయంపై దాడిలో భారతీయుడు మృతి
- అనేక డ్రోన్లు,రెండు క్షిపణులు కూల్చివేసిన సెంట్‌కామ్
- మధ్యవర్తి ద్వారా సంప్రదింపులు ఆపేశాం : ఇరాన్
- దౌత్యమార్గం క్రియాశీలంగా ఉంది : ట్రంప్

**దుబాయ్:** ఇరాన్–అమెరికా మధ్య బుధవారం కూడా దాడులు కొనసాగాయి. ఒకవైపు దాడులు జరుగుతుంటే మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు చర్చల ప్రక్రియ గురించి రెండు దేశాల నుండి భిన్న ప్రకటనలు వెలువడ్డాయి. ఈ పరస్పర దాడులు రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు ఒక విషమ పరీక్షగా మారాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు ప్రారంభించింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ చేసిన డ్రోన్ దాడులలో ఒక భారతీయుడు మరణించాడు. విమానాశ్రయం కూడా బాగా ధ్వంసమైంది. గల్ఫ్ దేశాలపై దాడుల తర్వాత ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారుడు మొహ్సెన్ రెజాయీ ఎక్స్‌వేదికగా ప్రకటన చేస్తూ అమెరికా గనుక మళ్ళీ దాడులు కొనసాగిస్తే క్షిపణి,డ్రోన్ దాడులను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చర్చల్లో,కాల్పుల విరమణ ప్రక్రియలో అమెరికా హద్దులు దాటితే క్షమించబోమన్నారు. కాగా, కువైట్ విమానాశ్రయంలో జరిగిన దాడిలో భారతీయుడు మరణించినట్లు మన దౌత్యకార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టింది. తన తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. మరణించిన భారతీయుడి కుటుంబంతోనూ, కువైట్ దౌత్యకార్యాలయ తరువాయి 8లో

# టిఎంసిని చీల్చిన బిజెపి చాణక్యం

పశ్చిమ బెంగాల్‌లో అనుమానిస్తున్నదే జరిగింది. బిజెపి మహారాష్ట్ర మోడల్ అమలు చేసింది. మహారాష్ట్రలో శివసేన శాసనసభాపక్షాన్ని చీల్చినట్లు ప.బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని ముక్కలు చేసింది. ఎన్నికల ఫలితాలు (మే 4) వెలువడిన నెల రోజుల్లోనే ఇది ఊహించని పరిణామం. ఒకవైపు ఎన్నికల అనంతర హింస ప్రధానంగా టిఎంసి కార్యకర్తలపై సాగుతోంది. దానికి తారాస్థాయిగా టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ (మమత మేనల్లుడు)పై కొద్ది రోజుల క్రితం దాడి జరిగింది. మరో ఎంపిపై కూడా దాడి జరిగింది. రెండోవైపున, ఎన్నికల ఓటమితో సంక్షోభంలో ఉన్నప్పుడే టిఎంసిని (మమతా బెనర్జీని) దెబ్బతీసే వ్యూహంతో బిజెపి పోలీసులను ఉపయోగించి ఎంఎల్‌ఏలను బెదిరించి లొంగదీసుకునే వ్యూహం తెరమాటున ప్రయోగించింది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునికి గుర్తింపు ఇచ్చే సందర్భాన్ని అవకాశంగా ఉపయోగించుకుంది. బిజెపి ప్రమేయం, ప్రోత్సాహం లేకుండా టిఎంసిలో ఈ ఆకస్మిక పరిణామం సంభవమని బెంగాల్ రాజకీయాలను గమనిస్తున్న ఎవరూ ఊహించలేదు.

ఎన్నికల్లో బిజెపి 294 అసెంబ్లీ సీట్లలో 208 గెలిచినప్పటికీ, 80 సీట్లతో తృణమూల్ కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. శోభనదేవ్ చట్టోపాధ్యాయను ప్రతిపక్ష నాయకునిగా మే 6న టిఎంసి శాసనసభాపక్షం ఎన్నుకుంది. ఆ విషయాన్ని స్పీకర్‌కు తెలియజేస్తూ, చట్టోపాధ్యాయను సభలో ప్రతిపక్ష నాయకునిగా గుర్తించాలని కోరుతూ అభిషేక్ బెనర్జీ మే 9న స్పీకర్ రతీంద్ర బోస్‌కు లేఖ రాశారు. ఆ తీర్మానం ప్రతి పంపాల్సిందిగా అసెంబ్లీ ప్రిన్సిపల్ కార్యదర్శి పదిరోజుల తర్వాత మే 18న అభిషేక్ బెనర్జీని కోరారు. ఇంత వ్యవధి తీసుకోవటంలోనే కుట్రను శంకించవచ్చు. మే 20న అభిషేక్ 70మంది టిఎంసి ఎంఎల్‌ఏల సంతకాలతో కూడిన తీర్మానాన్ని సమర్పించాడు. ఈలోపు ఇద్దరు టిఎంసి ఎంఎల్‌ఏలు – రితబ్రత బందోపాధ్యాయ, సందీపన్ సాహా మే 6 సమావేశంలో అటువంటి తీర్మానం చేయలేదని ఫిర్యాదు చేశారు. దాని ప్రాతిపదికపై బిజెపి స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఇద్దరు ఎంఎల్‌ఏలను టిఎంసి బహిష్కరించటంతో తృణమూల్ ఎంఎల్‌ఏల సంఖ్య 78కి తగ్గింది. ఇదిలావుండగా, మొన్న అధినాయకురాలు పిలిచిన సమావేశానికీ, బిజెపి హింసకు వ్యతిరేకంగా ఎన్నడూ జరగని విధంగా ఆమె బహు తక్కువమందితో నిర్వహించిన ధర్నాకు 20మంది ఎంఎల్‌ఏలే హాజరైనారు. కాగా బుధవారం (జూన్ 3) సుమారు 60 మంది (లేదా 58మంది) టిఎంసి ఎంఎల్‌ఏలు అసెంబ్లీలో ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి, టిఎంసి బహిష్కరించిన రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నాయకునిగా ఎన్నుకున్నట్లు, ఆయన్ను గుర్తించాలని కోరుతూ స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. స్పీకర్ ఎక్కువ సమయం తీసుకోకుండానే రితబ్రతను ప్రతిపక్ష నాయకునిగా గుర్తిస్తూ ప్రకటన జారీ చేశారు. దీనివెనుక ముందస్తు అవగాహన లేదని భావించగలమా!

టిఎంసి చీలికను తుది దశకు చేర్చినట్లుగా కనిపిస్తున్న ఈ దెబ్బ మమతా బెనర్జీకి బుల్‌డోజర్ దెబ్బ. తన మాటే శాసనంగా 15 సంవత్సరాలపాటు పార్టీపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన మమతా బెనర్జీ రాజకీయంగా బిజెపి పన్నాగాలపై ఒంటి కాలిపై పోరాడింది. కాని ఎన్నికల్లో పార్టీ ఒక్క దెబ్బతినగానే ఆ పార్టీ కకావికలైంది. ఇది పెద్ద అంతర్గత సంక్షోభం. పార్టీ చీలిక ఖరారైతే ఆమెకు 20 మంది ఎంఎల్‌ఏలే మిగులుతారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఉండదు. ఎందరు ఎంపిలు ఆమెతోనే ఉంటారో చెప్పలేము. ఈ సంక్షోభాన్ని మమతా బెనర్జీ ఎలా గట్టెక్కుతారో చూడాలి.

పార్టీకి కూడా వివిధ స్థాయిల నుంచి రాజీనామాలు అందుతున్నాయి. పార్టీ అధికార ప్రతినిధుల నుంచి టిఎంసి నడుపుతున్న కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఇన్ కౌన్సిల్ సభ్యుల వరకు వారిలో ఉన్నారు. అందరూ నింద వ్రేలును మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ వైపు చూపుతున్నారు. తిరుగుబాటుదారులు అధినాయకురాలిని ధిక్కరించి ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ప్రతిపక్ష నాయకునిగా తమ సొంత మనిషిని ప్రతిపాదించారంటే వారు పార్టీని చీల్చటానికే నిర్ణయించుకున్నారని విదితమవుతున్నది. ఈ పరిణామాలను బట్టి చూస్తే వారు తమదే అసలు టిఎంసి అని వాదిస్తూ పార్టీ పేరును, గుర్తును క్లెయిం చేసే రోజులు ఎంతో దూరంలో లేవని భావించవచ్చు. ఇది ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీకి పరీక్షా సమయం.



## టిఎంసి కార్యకర్తల్లారా.. కాంగ్రెస్‌లోకి రండి

**ఒకప్పుడు మమతా బెనర్జీ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి, కాంగ్రెస్‌ను పతనావస్థ అంచులకు నెట్టివేసారు. నేడు ఆమె కూడా అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. బెంగాల్‌లో ఇప్పుడు 'ఏక్నాథ్ షిండే మోడల్' అమలు అవుతోంది. ఏదైనా చేయాలనే తపన ఉన్న అన్ని పార్టీల కార్యకర్తలు, ముఖ్యంగా టిఎంసికి చెందిన సాధారణ కార్యకర్తలందరినీ కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా నేను ఆహ్వానిస్తున్నాను. మిమ్మల్ని సాదరంగా ఆహ్వానించడానికి మేము సిద్ధంగా ఉన్నాము. అవినీతిపరులైన టిఎంసి ప్రజాప్రతినిధులందరూ పరోక్షంగా బిజెపిలో చేరడం ఒక రకంగా మంచిదే అయ్యింది.**

– అధీర్ రంజన్ చౌధురి,
పశ్చిమబెంగాల్ మాజీ పిసిసి అధ్యక్షుడు




# యుద్ధాల విధ్వంసంలో విలవిల్లాడుతున్న చిన్నారులు!

యుద్ధాలు, సంక్షోభాల విష వలయంలో ప్రపంచ మానవాళి చిక్కుకొని సతమతం అవుతున్నది. యుద్ధాలతో అందమైన సహజ ప్రకృతి క్షణాల్లో శ్మశాన వాటికలుగా మారుతున్నాయి. యుద్ధాలు, సంక్షోభాలతో ప్రపంచ మానవాళి గాయపడడం, ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టాలు, ఆర్థికంగా చితికిపోవడం, పర్యావరణ కాలుష్య కోరల్లో చిక్కుకొనిపోవడం, అమాయక పిల్లలు సహితం ప్రాణాలు కోల్పోవడం లేదా గాయపడడం, పాఠశాలలు మూతపడడం, ఆరోగ్య సంరక్షణకు విఘాతం కలగటం జరుగుతోంది. 2023లో ప్రపంచ నలుమూలల జరిగిన లాండ్‌మైన్స్, విస్ఫోట ఆయుధాలు పేలడంతో 11,649 మంది పిల్లలు చనిపోవడం లేదా అంగవైకల్యాన్ని పొందడం జరిగింది. కాంగో, సొమాలియా, నైజీరియా లాంటి దేశాల్లో 8,655మంది పిల్లలు సంక్షోభ వ్యవస్థలో వినియోగించబడడం, 4,356 మంది పిల్లలు బలవంతంగా అపహరించబడడం జరిగింది.

అఫ్ఘానిస్థాన్, మియన్మార్, సూడాన్ లాంటి దేశాల సంక్షోభాల్లో 1,470 మంది పిల్లలు లైంగిక వేధింపులకు గురికావడం, 5,205 మంది మానవీయ సేవలకు దూరం కావడం జరిగింది. 2021–23 మధ్య వివిధ సంక్షోభాల్లో 1,650 పాఠశాలలు/ఆరోగ్య కేంద్రాలు ధ్వంసం కావడం జరిగి పిల్లలు చదువులకు దూరం కావడంతో పాటు అనారోగ్యాలను మోయడం జరిగింది. 28 ఫిబ్రవరి 2026 రోజు ప్రారంభమైన అమెరికా/ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఇప్పటివరకు 200లకు పైగా పిల్లలు ప్రాణాలు కోల్పోగా, వేలమంది చిన్నారులు గాయపడడం జరిగింది.

1982లో లెబనాన్–పాలస్తీనా యుద్ధంలో అమాయక పిల్లలు ఆహుతి కావడాన్ని తీవ్రంగా భావించిన ఐరాస ప్రతి ఏట 04 జూన్‌న దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఇన్నోసెంట్ చిల్డ్రన్ విక్టిమ్స్ ఆఫ్ అగ్రెషన్ పాటించాలని సభ్య దేశాలకు సూచించడం జరిగింది. పాకిస్థాన్, ఈజిప్ట్, మొజాంబిక్, వియత్నాం, అర్జెంటీనా, రష్యా, నైజీరియా, ఇండోనేషియా లాంటి దేశాల్లో పిల్లల భవిష్యత్తు అగమ్యగోచర దుస్థితికి చేరింది. దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం సందర్భంగా శారీరక, మానసిక, భావోద్వేగ వేధింపుల బాధిత పిల్లల బాధను అర్థం చేసుకోవడం మనందరి కర్తవ్యం అని తెలుసుకోవాలి.

**యుద్ధ మంటల్లో ...**

24 ఫిబ్రవరి 2022న ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఏళ్ల తరబడి కొనసాగుతూ నేటికీ భీకర స్థాయిలో కొనసాగుతున్నది. ఈ యుద్ధంలో రష్యాలో 2,23,000 మంది గాయపడడంతో పాటు అందులో 43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ పక్షాన 1,31,000 గాయపడడంతో పాటు అందులో 17,500 మంది మరణించడం జరిగింది. ఈ యుద్ధంలో 2,520 మంది పిల్లలు గాయపడడంతో పాటు అందులో 669 మంది మరణించారు. దీనికి తోడుగా ఉక్రెయిన్‌లో 1,600పాఠశాలలు, 786 వైద్య కేంద్రాలు ధ్వంసం అయ్యాయి. దాదాపు 44 శాతం మంది పిల్లలు చదువులకు దూరంగా, ఆకలి చావుల మధ్య తాత్కాలిక శరణార్థి శిబిరాల్లో కాలం గడుపుతున్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడుల్లో దాదాపు 50,000 మంది పిల్లలు గాయపడడం లేదా మరణించడం జరిగింది. నేడు ఉక్రెయిన్, పాలస్తీనాల్లో ప్రజలు, ముఖ్యంగా పిల్లలు చావు నోటిలో తలపెట్టి కాలం గడపడం చూస్తున్నాం.

యుద్ధ ప్రదేశాలు, సంక్షోభ ప్రాంతాల్లో మానవ హక్కులు మంటగలవడంతో పాటు పిల్లల నిండు నూరేళ్ల జీవితాలు చిన్నతనంలోనే చితికి పోతున్నాయి. పాఠశాలలు, ధ్వంసం కావడంతో పిల్లల చదువులకు విఘాతం కలగడం, ఆరోగ్య కేంద్రాలు కొరవడడంతో రోగాల పాలు అవుతున్నారు. ఈ ప్రదేశాల పిల్లలను కాపాడడం, విద్య అవకాశాలు కొనసాగించడం, మరణాలకు అడ్డుకట్ట వేయడం, అంగవైకల్యం పొందడాన్ని నిరోధించడం, లైంగిక హింసకు దూరంగా ఉంచే తగు చర్యలు తీసుకోవడం, వారి ఆరోగ్యవంతంగా ఉండటానికి చర్యలు తీసుకోవడం, అపహరించడాన్ని నిరోధించడంలాంటి చర్యలను తీసుకోవాలి. లేత పిల్లల భవిష్యత్తుకు ఉజ్వల బాటలు వేయాలి.



డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి

# త్యాగాలు 'అనంతం'... ఐక్యత ఒక్కటే..



రాజేందర్ దామెర(దారా)
సీనియర్ జర్నలిస్ట్

తెలుగునాట విప్లవోద్యమ చరిత్రలో గత ఏడెనిమిది నెలలుగా జరుగుతున్న పరిణామాలు కేవలం ముఖ్యాంశాలు కావు. అవి ఐదు దశాబ్దాల సుదీర్ఘ సాయుధ పోరాట రూపాంతరానికి సజీవ సాక్ష్యాలు. మావోయిస్టు అగ్రనేతలు సోను, దేవ్జీ, సంగ్రాం, ఆశన్న, చంద్రన్న వంటి వారు వందలాది మంది దళ సభ్యులతో కలిసి అజ్ఞాతాన్ని వీడి బహిరంగ ప్రజా జీవితంలోకి అడుగు పెట్టడం కేవలం ఒక తాత్కాలిక రాజకీయ చలనం కాదు; ఇది ఒక సుదీర్ఘ పోరాట తాత్విక మలుపు. ఈ పరిణామాల నేపథ్యంలో, సీనియర్ వామపక్ష నేత జి. రాములు రాసిన బహిరంగ లేఖను విశ్లేషిస్తూ 2026 మే 30న సిరికొండ రవీంద్రనాథ్ రాసిన 'వామపక్షాల ఐక్యత అవశ్యం' అనే వ్యాసం ప్రస్తుత రాజకీయ సమీకరణాలపై ఒక చర్చను రేకెత్తించింది. తుపాకీ పట్టిన చేతులు జనం మధ్యకు రావడం అంటే విప్లవ ముగింపు కాదు, సరికొత్త ప్రజాస్వామ్య వ్యూహానికి ఆరంభం అనే సత్యాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

సమాజ గమనాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తే, ఏ సిద్ధాంతమైనా కాలంతో పాటు మారకపోతే అది జనం నుంచి వేరుపడిపోతుందనేది చారిత్రక సత్యం. కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన గతి తార్కిక భౌతికవాదం ప్రకారం, సమాజంలోని భౌతిక పరిస్థితులు మారినప్పుడు పోరాట రూపాలు కూడా మారాలి. 1970, 80ల నాటి గ్రామీణ భూస్వామ్య నిర్బంధ కాలపు తెలంగాణ వేరు, నేటి డిజిటల్, సాంకేతికయుగపు ఆధునిక దోపిడీ కాలపు తెలంగాణ వేరు. నేడు గ్లోబలైజేషన్, టెక్నాలజీ క్షేత్రస్థాయికి విస్తరించి, సమాజ నిర్మాణంలో మార్పులు వచ్చాయి. యువత తమ మనుగడను కొత్త కోణంలో వెతుక్కుంటున్న ఈ కాలంలో, సాయుధ పంథా కంటే చట్టబద్ధమైన ప్రజాపోరాటాలే అత్యంత కీలకం.

నిజానికి, దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' తీవ్రస్థాయిలో సాగుతున్న తరుణంలోనే, 'మావోయిస్టులు తమ మార్గం మార్చుకొని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా సాయుధ మార్గం వీడి జనారణ్యంలోకి రావాలి' అని ఫిబ్రవరి 18, 2025 లోనే నేను వ్యాసం రాశాను. శాంతి చర్చలను కాంక్షిస్తూ శాంతికాముకుల విశ్లేషణతో 'ఆపరేషన్ కగార్' పుస్తకాన్ని కూడా తీసుకురావటం జరిగింది. అందులోనూ జి.రాములు చాలా విలువైన విశ్లేషణ వ్యాసాలు పొందుపరిచి ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే విప్లవ శక్తులు సాయుధ పంథాను మార్చుకుని ప్రజా క్షేత్రంలోకి అడుగుపెట్టడం శుభపరిణామంగానే చూడాలి. ఇది ఎవరికి నచ్చినా నచ్చకపోయినా కొందరు భిన్నాభిప్రాయాలు కలిగినప్పటికీ ఈ చారిత్రక పరిణామ క్రమాన్ని స్వాగతించాల్సిన అవసరం ఉంది.

అయితే అరణ్యం దాటి జనం మధ్యకు వచ్చిన ఈ మహోద్యమ శక్తుల ముందు ఇప్పుడు ఒక పెద్ద తాత్విక వైరుధ్యం నిలిచింది. జి.రాములు తన లేఖలో ఎత్తిచూపినట్లు కమ్యూనిస్టులు ప్రజలకోసం ప్రాణాలనైనా త్యాగం చేయగలరు కానీ, తమ 'ఇగో'(అహంభావం)లను మాత్రం ఎందుకు త్యాగం చేయలేకపోతున్నారు..? బహిరంగ జీవితంలోకి వచ్చిన నేతల మధ్య చిన్న చిన్న అపార్థాలు, భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు వచ్చిన, వస్తున్న వార్తలు శ్రేణులను, ప్రజలను ఆందోళనకు, గందరగోళానికి గురిచేస్తున్నాయి.

ద్వంద్వాల పోరాటంలో అంతర్గత వైరుధ్యాలు ఎప్పుడూ శత్రువుకే లాభం చేకూరుస్తాయి. పరిపక్వత లేని విమర్శకులు, శత్రు శక్తులు ఈ విభేదాలను భూతద్దంలో చూపిస్తూ, వారి అసమాన త్యాగాలను మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తాయి, చూస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలను పరిశీలిస్తే 'ఈగో' లను పక్కనపెట్టి ప్రజల్లో నిలబడినప్పుడే ఉద్యమాలకు మనుగడ సాధ్యమని స్పష్టమవుతోంది. ఐక్యత లేని చోట త్యాగాలు ఎంత అనంతంగా ఉన్నా, ఫలితం మాత్రం శూన్యమే అవుతుంది.

బహిరంగ జీవితంలోకి వచ్చిన మావోయిస్టుల ముందు కేవలం సిద్ధాంతాలు లేవు. అనేక భౌతిక సవాళ్లు ఉన్నాయి. జైళ్లలో ఉన్న వందలాది మంది సహచరుల విడుదల, చట్టపరమైన పోరాటం ఒకవైపైతే.. దశాబ్దాల పాటు అడవికే పరిమితమైన వారికి పునరావాసం, ఆర్థిక, కుటుంబ రక్షణ కల్పించడం మరోవైపు సవాలుగా ఉంది. అలాగే వారు ఒకచోట సమావేశం కూడా కాలేని పరిస్థితి లేకపోలేదు. ఈ ఆంక్షలు, నిర్బంధాలు కొనసాగుతున్నాయని సెంట్రల్ కమిటీ సభ్యుడు ఆశన్న (తక్కెళ్లపల్లి వాసుదేవరావు) పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ సవాళ్లను ఒంటరిగా ఎదుర్కోవడం ఏ ఒక్క శ్రేణికి సాధ్యం కాదు. బయటకు వచ్చిన వారంతా ఒకే శక్తిగా నిలబడితేనే చట్టబద్ధమైన రక్షణ, ప్రజాదరణ లభిస్తాయి. పోలిట్ బ్యూరో సభ్యుడు దేవ్జీ (తిప్పిరి తిరుపతి) అన్నట్లు, అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో 'మావోయిస్టు' పేరుతోనే ఎన్నికల బరిలోకి వెళ్లడం లేదా ఒక విస్తృతమైన ఉమ్మడి వేదికను నిర్మించడం సమాజంలో వారి ఉనికిని శాసించేలా చేస్తుంది. ఈ చారిత్రక తరుణంలో, రాములు లేఖపై స్పందిస్తూ ప్రధాన వామపక్షాలైన సిపిఐ, సిపిఎం నేతలు గుజ్జుల ఈశ్వరయ్య, జగ్గులు జాన్ వెస్లీలు 'మావోయిస్టులతో కలిసి పనిచేయడానికి సిద్ధం' అని ప్రకటించడం ఒక సానుకూల పరిణామం.

బూర్జువా పార్టీల వైపు వెళ్లకుండా, దశాబ్దాల విప్లవ త్యాగాలు వృథా కాకుండా ఉండాలంటే వామపక్షాల ఐక్యత ఏకైక మార్గం. ఇప్పటికైనా వామపక్ష నాయకత్వాలు పాత సిద్ధాంత విభేదాలను, ఇగోలను పక్కనపెట్టి ఒక 'కనీస ఉమ్మడి ప్రణాళిక'తోనైనా ముందుకు రావాలి.

భారత రాజ్యాంగాన్నే మార్చాలనే శక్తులు, హక్కులను కాలరాసే ధోరణులు పొంచి ఉన్న ఈ తరుణంలో పాత విభేదాలను వీడి ఎర్రజెండాలన్నీ ఒకే తాటిపైకి వస్తేనే, దేశ రాజకీయాల్లో ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తి ఆవిర్భవిస్తుంది.

*rajenderdamera@mail.com*



# ప్రజలు మరచిపోయిన పొదుపు సంపద ₹1లక్ష కోట్లు!



డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశం గర్వంగా చెప్పుకుంటోంది. ఆర్థిక సమగ్రత, జనధన్ ఖాతాలు, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ విప్లవాల గురించి ప్రభుత్వం నిరంతరం ప్రచారం చేస్తోంది. అయితే ఈ అభివృద్ధి వెనుక ఒక అసౌకర్యకరమైన, ఆందోళన కలిగించే వాస్తవం దాగి ఉంది. సాధారణ ప్రజలకు చెందిన ₹1లక్ష కోట్లకు పైగా డబ్బు బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్లు, డివిడెండ్ ఖాతాల్లో క్లెయిమ్ కాకుండా పడి ఉంది. ఇది కేవలం సాంకేతిక బ్యాంకింగ్ సమస్య మాత్రమే కాదు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలోని సామాజిక, పరిపాలన, నైతిక వైఫల్యానికి నిదర్శనం. తాజా గణాంకాల ప్రకారం, భారతీయ బ్యాంకుల్లోనే క్లెయిమ్ కాకుండా ఉన్న డిపాజిట్లు ₹74,580కోట్లను దాటాయి. ఇందులో దాదాపు 87% ప్రభుత్వరంగ బ్యాంకుల వద్ద ఉన్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక్కటే సుమారు ₹19,329 కోట్లను కలిగి ఉంది. మొత్తంలో దాదాపు మూడో వంతు. దీనికితోడు క్లెయిమ్ కాని బీమా చెల్లింపు లు, నిర్వీర్యమైన మ్యూచువల్ ఫండ్లు, మరచిపోయిన డివిడెండ్లు కలిపితే మొత్తం ₹1 లక్ష కోట్లను దాటుతోంది. సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది: ప్రజల డబ్బు అంతా ఎలా ప్రజల జ్ఞాపకాల నుంచి మాయమవుతోంది?

ఈ ప్రశ్నకు సమాధానం భారత బ్యాంకింగ్ సంస్కృతిలోని నిర్మాణాత్మక బలహీనతలను బయటపెడుతోంది.

దశాబ్దాలుగా బ్యాంకులు భారీగా ఖాతాలు తెరిచినా, వినియోగదారులతో దీర్ఘకాలిక సంబంధాలను కొనసాగించే వ్యవస్థలను సరిగా అభివృద్ధి చేయలేదు. ఉద్యోగ మార్పుల వల్ల లక్షలాది జీత ఖాతాలు నిర్వీర్య మయ్యాయి. దశాబ్దాల క్రితం తెరిచిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరచిపోయాయి. వృద్ధులు కుటుంబాలకు తెలియజేయకుండానే మరణించారు.వలస కార్మికులు, ఎన్‌ఆర్‌ఐలు పాత ఖాతాలను మర్చిపోయారు. ఇళ్ల మార్పుల సమయంలో పాస్‌బుక్కు, సర్టిఫికెట్లు, రికార్డులు పోయాయి. అనేక సందర్భాల్లో నామినీలు కూడా నమోదు కాలేదు.

ఇంత జరుగుతున్నా బ్యాంకింగ్ వ్యవస్థ మాత్రం నిర్లక్ష్యంగానే కొనసాగింది.

ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం నిర్వీర్య ఖాతాదారులను బ్యాంకులు సంప్రదించాలి. కానీ వాస్తవ పరిస్థితి అంత సంతృప్తికరంగా లేదు. చాలా మంది ఖాతాదారులకు అప్పుడప్పుడు నోటీసులు పంపడం తప్ప సరైన ఫాలో అప్ ఉండదు. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఇప్పటికీ పాత రికార్డు నిర్వహణ, బలహీన వినియోగదారుల సేవలు, క్లిష్టమైన క్లెయిమ్ విధానాలతో ఇబ్బంది పడుతున్నాయి. అత్యంత ఆందోళనకరమైన విషయం కేవలం ఈ నిధుల పరిమాణం మాత్రమే కాదు; నిర్వీర్య ఖాతాల సంఖ్య వేగంగా పెరుగుతుండటమే. ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌కు బదిలీ అవుతున్న నిధులు ఇటీవలి సంవత్సరాల్లో భారీగా పెరిగాయి. 2022కు ముందు సంవత్సరానికి సుమారు ₹4,500 కోట్లు బదిలీ, 2022–23 ఆర్థిక సంవత్సరం లో అది ₹12,000 కోట్లకు పైగా పెరిగింది. తర్వాత కూడా ఇదే స్థాయిలో కొనసాగుతోంది. నేటి భారతీయులు అనేక బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ వాలెట్లు, ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, బీమా పాలసీలు, ఆన్‌లైన్ ఆర్థిక ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారు. కానీ పౌరులు లేదా వారి వారసుల కోసం సమగ్ర జాతీయ ఆర్థిక ఆస్తుల ట్రాకింగ్ వ్యవస్థ ఇంకా లేదు. ఆర్థిక అవగాహన సమానంగా లేని దేశంలో సాధారణ కుటుంబాలు దశాబ్దాల పాత ఖాతాలను అన్ని సంస్థల్లో వెతకడం అసాధ్యమే.

ప్రజల డిపాజిట్లతో బ్యాంకులు లాభాలు ఆర్జిస్తున్నాయి. కానీ అదే ప్రజల డబ్బు సంవత్సరాల పాటు నిరుపయోగంగా పడి ఉంటుంది. డబ్బు




డిఇఎ ఫండ్ లేదా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అయినప్పటికీ, ఎప్పుడైనా తిరిగి క్లెయిమ్ చేసుకునే హక్కు తమకుందని చాలా మందికి తెలియదు. ఉద్గామ్ పోర్టల్, యువర్ మనీ యువర్ రైట్, 100 డేస్ 100పేస్ వంటి కార్యక్రమాలను ప్రారంభించినందుకు ప్రభు త్వం, ఆర్‌బిఐ ప్రశంసలకు అర్హులు. వీటిద్వారా లక్షలాది మంది తమ మరచిపోయిన డిపాజిట్లను గుర్తించారు. కానీ ఇవి సమస్యను ముందుగానే నివారించే చర్యలు కాకుండా, తర్వాత స్పందించే చర్యలు గానే మిగిలిపోయాయి.

మరణించిన భర్త ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను తిరిగి పొందేందుకు ప్రయత్నించే వృద్ధ మహిళ అనేక పత్రాలు, బ్యాంక్ చుట్టూ తిరగడం, నామినీ వివాదాలు, కెవైసి సమస్యలు, విధానపరమైన ఆలస్యాలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో చాలా కుటుంబాలకు ఇలాంటి నిధులు ఉన్నాయన్న విషయం కూడా తెలియదు.

ఇది మరింత లోతైన నైతిక ప్రశ్నను లేవనెత్తుతోంది: ఇప్పటికే తమదైన డబ్బును తిరిగి పొందేందుకు ప్రజలు ఎందుకు ఇంత కష్టపడాలి?

బ్యాంకుల వద్ద ఆధార్, పాన్, మొబైల్ నంబర్లు, నామినీ వివరాలు ఉన్నప్పటికీ ఆటోమేటెడ్ ట్రేసింగ్ వ్యవస్థలు ఎందుకు బలహీనంగా ఉన్నాయి? నిర్వీర్య ఖాతాలపై కుటుంబాలకు, నామినీలను ప్రతి సంవత్సరం తప్పనిసరి అలర్ట్ ఎందుకు పంపకూడదు?చట్టబద్ధ వారసులకు భద్రంగా అందుబాటులో ఉండే జాతీయ ఆర్థిక ఆస్తుల రిజిస్ట్రీ ఎందుకు ఉండకూడదు?

సాంకేతికత ఉంది. కానీ సమస్య సంస్థాగత నిర్లక్ష్యంలో ఉంది.

క్లెయిమ్ కాని డిపాజిట్లలో అధిక భాగాన్ని కలిగి ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా బాధ్యత వహించాలి. వారి బలహీన వినియోగదారుల సేవలు, పాత రికార్డు వ్యవస్థలు, నెమ్మదైన క్లెయిమ్ ప్రక్రియలు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఆర్థిక సమగ్రత అంటే కేవలం ఖాతాలు తెరవడం కాదు; ప్రజల పొదుపులపై వారి హక్కులను రక్షించడం కూడా కావాలి. ఇందులో ఆర్థిక కోణం కూడా ఆందోళన కలిగిస్తోంది. క్లెయిమ్ కాని డిపాజిట్లు నిర్వీర్య మూలధనంగా మారుతున్నాయి. ఆరోగ్య ఖర్చులు, నిరుద్యోగం, విద్యా వ్యయాలతో కోట్లాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న సమయంలో వేల కోట్ల రూపాయలు సంస్థల మధ్య నిలిచిపోవడం బాధాకరం. చాలా కుటుంబాలకు పాత ఖాతా నుంచి ₹50,000 కూడా తిరిగి రావడం జీవితాన్ని మార్చే అంశమవుతుంది. బీమా క్లెయిమ్‌ల పరిస్థితి కూడా అంతే ఆందోళనకరం. ఎల్‌ఐసి వద్ద మాత్రమే దాదాపు 16లక్షల క్లెయిమ్ కాని పాలసీలు ఉండి, వాటి విలువ ₹3,727 కోట్లకు చేరిందని సమాచారం. ఇవి కేవలం గణాంకా లు కావు; ప్రజా సంస్థలపై విశ్వాసంతో పొదుపు చేసిన కుటుంబాల ఆశలు.

భారత ఆర్థిక వ్యవస్థ కేవలం అవగాహన కార్యక్రమాల వద్ద ఆగకుండా నిర్మాణాత్మక సంస్కరణల దిశగా ముందుకు సాగాలి. ప్రతి బ్యాంకు, ఆర్థిక సంస్థ నామినీలకు వార్షిక నోటిఫికేషన్లు పంపడం, వారసత్వ క్లెయిమ్ విధానాలను సరళీకరించడం, నిర్వీర్య ఆస్తులను డిజిటల్‌గా ఏకీకృతం చేయడం, ఆధార్–పాన్ సమన్వయాన్ని బాధ్యతాయుతంగా వినియోగించడం,ప్రజలు స్వయంగా రావడానికి ఎదురుచూడకుండా ముందుగానే సంప్రదించడం చట్టబద్ధ బాధ్యతగా మారాలి.

అత్యంత ముఖ్యంగా, ఆర్థిక అవగాహన కార్యక్రమాలు ప్రజా విధానంలో భాగం కావాలి. ప్రజలు తమ నామినీ వివరాలను నవీకరించడం, ఖాతాలను సమీకరించడం, కుటుంబ సభ్యుల కోసం ఆర్థిక ఆస్తుల వివరాలను స్పష్టంగా నమోదు చేయడం అలవాటు చేసుకోవాలి. రోజురోజుకూ పెరుగుతున్న క్లెయిమ్ కాని డబ్బు కేవలం లెక్కల లోపం కాదు. ప్రజల సంపదను రక్షించాల్సిన సంస్థలు మరియు పౌరుల మధ్య పెరుగుతున్న దూరానికి ఇది నిదర్శనం. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ప్రజల జీవితకాల పొదుపులు అధికార యంత్రాంగ నిశ్శబ్దంలో మాయమవ్వకూడదు. బ్యాంకులు ఆర్థిక సంస్థల్లో నిలిచిపోయిన డబ్బు ఎవరూ లేని సంపద కాదు. అది కార్మికులది, పెన్షనర్లది, తల్లిదండ్రులది, వితంతువులది, వలస కార్మికులది, కుటుంబాలది. అది ప్రజలదే. దాన్ని తిరిగి ఇవ్వడం ఉపకారం కాదు — బాధ్యత.

# రబీ ధాన్యం కొనుగోళ్లలో కొత్త రికార్డు దిశగా తెలంగాణ

## పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రబీ ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం మరో సరికొత్త రికార్డు సృష్టించబోతోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 70.06 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటి) ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు పురోగతిపై బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు.గత ఏడాది రబీ సీజన్‌లో నమోదైన 74.2 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు రికార్డును ఈసారి అధిగమించే అవకాశాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇప్పటికే 70.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా మరో 4.95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వీటికి తోడు వచ్చే వారం పొలాల నుంచి మరింత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుండడంతో మొత్తం కొనుగోళ్లు 75 లక్షల మెట్రిక్ టన్నులు దాటే అవకాశం మంత్రి వెల్లడించారు. కొనుగోళ్లు కొనసాగుతున్న జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ముమ్మరమయ్యేలోపు కొనుగోళ్లను పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా నిజామాబాద్, నిర్మల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లో మరో పది రోజుల పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నడడంతో అక్కడ కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కొనుగోళ్లు ఒకటి లేదా రెండు రోజుల్లో పూర్తయ్యే దశకు చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ధాన్యం నిల్వ ఏర్పాట్లపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించిన మంత్రి నిల్వ స్థలాల కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే అదనపు గిడ్డంగుల ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎంఆర్) రవాణా, నిల్వ ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### హమాలీలకు మెరుగైన సంక్షేమం

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్లు, ఇతర సిబ్బందికి వేతనాలను పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 170 సరఫరా నియంత్రణ కేంద్రాల్లో సుమారు 3 వేల మందికి పైగా హమాలీలు, స్వీపర్లు పనిచేస్తున్నారని తెలిపారు.వారికి మెరుగైన సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా, సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించే అంశాలను పరిశీలించాలని సూచించారు. అలాగే అర్హులైన హమాలీలు, స్వీపర్లను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రాధాన్యంగా లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా కొనసాగేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న కొనుగోలు సిబ్బంది, రవాణా కార్మికులు, హమాలీల సేవలను మంత్రి అభినందించారు.

# నేడు, రేపు పాలమూరులో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన



- పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను పరిశీలన
- 5న రాత్రి 6.30 గంటలకు ఉదండాపూర్‌లో బహిరంగ సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి పాలమూరు జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 4, 5 తేదీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లను పరిశీలించడంతో పాటు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్ హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. అనంతరం 3 నుంచి 3:30 గంటల వరకు మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కెఎల్‌ఐఎస్), భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతిని అధికారులు సిఎంకు వివరిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3.40 నుంచి 4 గంటల వరకు మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 4.10 గంటలకు మక్తల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 4.10 గంటలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, కృష్ణాభీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. సాయంత్రం 4.50 గంటలకు జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి హెలిప్యాడ్‌కు చేరుకుని స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం సాయంత్రం 4.55 గంటల నుంచి 5.30 గంటల వరకు గూడెందొడ్డి రిజర్వాయర్, జెఎన్‌ఎల్‌ఐఎస్ స్టేజ్1 పంప్‌హౌస్‌ను పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు సోమశిల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.45 గంటల నుంచి రాత్రి 8.45 గంటల వరకు మృగవాణి రిసార్ట్ రివర్‌ఫ్రంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 10.40 గంటల నుంచి 11.40 గంటల వరకు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పిఆర్‌ఎల్‌ఐఎస్) ప్యాకేజీ3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ 2 నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ1 డెలివరీ సిస్టర్న్, ఎంజికెఎల్‌ఐఎస్ లిఫ్ట్1 పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు. ఉదయం 11.50 గంటలకు నార్లాపూర్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి పిఆర్‌ఎల్‌ఐఎస్ ప్యాకేజీ3 కాలువ పనులు, ఏదుల రిజర్వాయర్, పంప్‌హౌస్ పనులను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు కుమ్మెర హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పిఆర్‌ఎల్‌ఐఎస్ ప్యాకేజీ8 స్టేజ్3 పంప్‌హౌస్, వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీ 9, 10,11 పనులను పరిశీలిస్తారు. మధ్యా హ్నం 2 గం టలకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తూర్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటల నుంచి 2.30 గంటల వరకు పిఆర్‌ఎల్‌ఐఎస్‌కు చెందిన కరివేన రిజర్వాయర్ ప్యాకేజీ 14, 15 పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3.30 గంట ల నుంచి 4.30 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం సాయంత్రం 5 గంటలకు జడ్చర్ల మండలం ఉదండాపూర్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయం త్రం 5.10 గంటల నుంచి 5.40 గంటల వరకు పి ఆర్‌ఎల్‌ఐఎస్‌కు చెందిన ఉదండాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీలు 17, 18 పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఉదండాపూర్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు.

# సి.ఆర్. ఫౌండేషన్‌కు చావా వాసుదేవరావు ఎకరం భూమి విరాళం

పేదలకు సేవ చేయడమే
సి.ఆర్. ఫౌండేషన్ లక్ష్యం: కె. నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్‌కు ఎకరం భూమిని అందజేసిన చావా వాసుదేవరావు దాతృత్వం అభినందనీయమని సి.ఆర్. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ అన్నారు. చిల్లకూరు మండలం పారిచెర్లవారి పాలెంకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త చావా వాసుదేవరావు తన ఎకరం భూమిని బుధవారం గూడూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సి.ఆర్. ఫౌండేషన్ పేరా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఫౌండేషన్ పేదలు, వృద్ధులు, అనాథల సంక్షేమం కోసం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ప్రస్తుతం 150 మంది వృద్ధులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, సి.ఆర్. పాలీక్లినిక్, ఎన్.ఆర్.ఆర్. రీసెర్చ్ సెంటర్, విశాలమైన గ్రంథాలయం విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గుంటూరులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఓల్డ్ ఏజ్ హోమ్, అనాథ బాలల గృహం నిర్మాణం చేపడుతున్నామని, కడపలో మూడు ఎకరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గూడూరులో చావా వాసుదేవరావు, ఆయన సతీమణి, కుమారుడు చావా హర్షవర్ధన్ పేరుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కె. నారాయణ, సి.ఆర్. ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు చావా వాసుదేవరావు కుటుంబ సభ్యుల దాతృత్వాన్ని అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. రామానాయుడు, బికెఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.హెచ్. ప్రభాకర్, చావా హర్షవర్ధన్, అమరావతి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మల, సిపిఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, నగర కన్వీనర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## లైన్‌మెన్ కుటుంబానికి రూ.1 కోటి బీమా చెక్కు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధి నిర్వహణలో మృతి చెందిన ఎన్‌పిడిసిఎల్ లైన్‌మెన్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.1కోటి ప్రమాద బీమా చెక్కును బుధవారం ప్రజాభవన్‌లో మృతుడి భార్య స్వప్నకు అందజేశారు.ఎన్‌పిడిసిఎల్–యూనియన్ బ్యాంక్ ఒప్పందం ప్రకారం ఉద్యోగులకు కల్పించిన వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద ఈ మొత్తం చెల్లించారు. 2025 మార్చిలో విధి నిర్వహణలో ప్రమాదంలో మరణించిన ప్రమోద్ కుమార్ కుటుంబానికి బీమా క్లెయిమ్‌ను త్వరిగతిన పరిష్కరించి, మే 30న రూ.1 కోటి జమ చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌పిడిసిఎల్, యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సచివాలయం వద్ద దంపతుల ఆత్మహత్యాయత్నం

- భూ వివాదంపై అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ .. ఒంటిపై పెట్రోల్ పోసుకున్న భార్యాభర్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పరిపాలనా కేంద్రంగా ఉన్న హైదరాబాద్ సచివాలయం సమీపంలో బుధవారం ఉద్రిక్త ప రిస్థితులు నెలకొన్నాయి. తమ భూ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ దంపతులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే స్పందించి వారిని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.పోలీసుల వివరాల ప్రకారం, సిద్ధిపేట జిల్లా కొండపోచమ్మపల్లికి చెందిన కృష్ణయ్య, సాయమ్మ దంపతులు తమ భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారులను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన



వ్యక్తం చేశారు. ఈ నేపథ్యం లో సచివాలయం వద్దకు చేరుకున్న వారు నిరసనగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయ త్నం చేశారు.దంపతుల చర్యను గమనించిన భద్రతా సిబ్బంది, పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని ప్రమాదాన్ని ని వారించారు. అనంతరం వారిని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. భూ వివాదానికి సంబంధించిన పూర్తి వివరా లు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత భద్రత కలిగిన ప్రాంతంగా భావించే సచివాలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇలాంటి తీవ్ర చర్యలకు దిగాల్సిన పరిస్థితులు రాకుండా అధికారులు సత్వర స్పందన చూపాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# గోదావరి పుష్కరాలకు రూ.100 కోట్లు

గతంలో ఆగమేఘాల మీద పనులు
ప్రజా ప్రభుత్వం ఏడాది ముందే పనులు
ప్రారంభం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/ఎండపెల్లి :**2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు తొలి విడత విడుదల చేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.వెల్గటూర్ నుండి రాజక్క పల్లె వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు. అదే విధంగా వెల్గటూర్‌లో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా బోటింగ్ సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు. కోటిలింగాల నుండి పాసిగాం వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ధర్మపురి పట్టణంలో మంగళ్ ఘాట్ నుండి బ్రాహ్మణ సంఘం, పోచమ్మ గుడి మీదుగా దమ్మన్నపేట రోడ్డుకు కలిసే విధంగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గత ప్రభుత్వ కాలంలో ఆగమేఘాల మీద పనులు ప్రారంభించి నాణ్యతకు త్రిలోధకాలు ఇచ్చారని మంత్రి అన్నారు. పుష్కరాల సమయంలో పనులు నడవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తుల ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఏడాది ముందే పనులు ప్రారంభించి 2027 మార్చి వరకు పుష్కరాల పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.ట్రాఫిక్ సమస్యలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ధర్మపురి నియోజకవర్గానికి పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తానని ఇచ్చిన మాట ప్రకారం పుష్కరాలకు ప్రత్యేక నిధులు తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

### పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు

నోరు ఉందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హితవు పలికారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్ శాఖ అధికారులతో పుష్కరాల పనులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. తెలంగాణ మీ జాగీర అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. నోరు ఉందని పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ సభకు అనుమతిపై ప్రభుత్వా నిబంధనల ప్రకారం సభ నిర్వహణకు అనుమతి ఇస్తారని మంత్రి తెలిపారు. పవన్ కళ్యాణ్‌ను హీ రోగా అందరూ అభిమానిస్తారని మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరోమారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# సంగారెడ్డి పారిశ్రామికాభివృద్ధికి మరో మైలు రాయి

బోరపట్ల శివారులలో తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభంచిన మంత్రులు శ్రీధర్ బాబు , దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెరానామ్ బయోలాజిక్ యూనిట్ ప్రారంభం ద్వా రా తెలంగాణ బయోఫార్మా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఇది నూతన ఊతాన్ని అందిస్తుందని మంత్రులు శ్రీదర్ బా బు ,దామోదర్‌రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల శివారులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన తెరనిమ్ బయోలాజిక్స్ తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు , రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీదర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ,పారదర్శక విదానాలు,నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతో ప్రపంచ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. బయోటెక్నాలజీ ఔషధ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రగామిగ నిలిచిందని ఔషధ రంగంలో ఆధునిక సాంకేతికతతో కూడిన తెరానిమ్ బయోలాజిక్స్ వంటి సంస్థల రాకతో రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృధికి కూడా దోహదం చేస్తుందని అ న్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని చెప్పా రు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు ,పరిశోదనలకు ఇలాంటి సంస్థలు బలాన్ని చేకూరుస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ఔషద బయోటెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతొందని పరిశ్రమలు అభివృద్ధి చెందడం తో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను కూడా సమర్థవంతం గా నిర్వహించాలని సంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి ,సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ‘టెట్’

**ఏడాదికి రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ ఉత్తర్వులు జారీ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ‘టెట్’ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్ నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ బుధవారం ఉత్తరులు జారీ చేశారు. ప్రత్యేక టెట్ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో విద్యాశాఖ డైరక్టర్‌కు సూచించారు. కాగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని వరంగల్ , ఖమ్మం, నల్లగొండ ఎంఎల్‌సి పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎస్‌టియు టిఎస్ అధ్యక్షుడు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్‌తో పాటు టిఆర్‌టిఎఫ్, పిఆర్‌టియు టిఎస్ విజ్ఞప్తి చేసినట్టు విద్యాశాఖ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా గత సాధారణ టెట్ 2025లోనే ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా పరీక్ష నిర్వహించారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండు సార్లు ప్రత్యేక టెట్ నిర్వహిచండం పట్ల పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

### ప్రత్యేక టెట్ నిర్వహించడం పట్ల ఎస్‌టియు టిఎస్ హర్షం

పాఠశాల విద్యాశాఖలో ప్రతి సంవత్సరం షెడ్యూల్ ప్రకారం నిర్వహించే రెండు సాధారణ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్షలకు (టెట్ ) అదనంగా, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రెండు ప్రత్యేక టెట్ నిర్వహించేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్ హర్షం వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్రం తరహా తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలని ఇది వరకే సంఘం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక టెట్ నిర్వహిచండం పట్ల వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, విద్యా శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### స్పెషల్ టెట్ పట్ల టిఎస్ యుటిఎఫ్ హర్షం

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రెండు సార్లు అదనంగా ప్రత్యేక టెట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షలో పేపర్ 2 సిలబస్‌ను సబ్జెక్ట్ వారీగా నిర్వహిస్తేనే ఉపయోగమని వారు అభిప్రాయపడ్డారు. టెట్ అర్హత మార్కులు తగ్గించాలని లేదా చేసి న సర్వీసుకు 5 నుండి 20 వెయిటేజ్ మార్కులు ఇవ్వాల ని, సబ్జెక్ట్‌ల వారీగా ప్రత్యేక టెట్ నిర్వహించాలని ప్రభుత్వానికి టిఎస్ యుటిఎఫ్ ప్రతిపాదించిందని వారు పేర్కొన్నారు.

## పెంచిన ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలి

**ఎరువుల ధరలను నిరసిస్తూ ఈనెల 6, 8తేదీల్లో నిరసనలు**
**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎరువుల ధరలను భారీగా పెంచడం వల్ల రైతులపై అదనపు భారం పడుతోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6, 8 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. కాంప్లెక్స్, యూరియా, ఎంటీపీ తదితర ఎరువుల ధరలు ఒక్కో బస్తాపై రూ.100 నుంచి రూ.450 వరకు పెరిగాయని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం యూరియా యాప్‌ను రద్దు చేయాలని, రైతు భరోసా నిధులను సాగు సీజ న్ ప్రారంభంలోనే ఒకేసారి విడుదల చేయడంతోపాటు, నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. అలాగే నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయించే వారిపై పిడియాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని, రూ.2 లక్షల లోపు పం ట రుణాలను మాఫీ చేయాలని, రాష్ట్ర స్థాయి పంటల బీమా పథకాన్ని అమలు తో పాటు భూ సమగ్ర సర్వే నిర్వహించి భూభారతి చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ-నైజీరియా వ్యవసాయ భాగస్వామ్యం మరింత బలోపేతం : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విత్తన రంగంలో సాధించిన అనుభవం నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువతకు ఉపయోగపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహించిన అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుక లో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణ దేశంలో విత్తన రంగానికి కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఆ అనుభవాన్ని టరాబా రాష్ట్ర యువతతో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. శిక్షణ ద్వారా యువత విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ తదితర అంశాల్లో ప్రాయోగిక పరిజ్ఞానం పొందారని తెలిపారు. టరాబా ప్రభుత్వం యువతకు అంతర్జాతీయ స్థా యి శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. వ్యవసాయం, విత్తన సాంకేతికత, రైతు శిక్షణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి రం గాల్లో తెలంగాణటరాబా రాష్ట్రాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ‘సిస్టర్ స్టేట్’ భాగస్వామ్యంపై చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.కార్యక్రమంలో అన్వేష్ రెడ్డి, డాక్టర్ అగ్బు కెఫాస్, విత్తన సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు శిక్షణ పూర్తి చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, పెబ్బేరు మున్సిపాలిటీ.**
**వనపర్తి జిల్లా (టిఎస్)**

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్**

'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ వేదికపై ఒక పనికి సంబంధించిన టెండర్లు ఆహ్వానించబడ్డాయి. **బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ:** 05.06.2026, ఉదయం 11:00 గంటలు; **బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ:** 11.06.2026, సాయంత్రం 5:00 గంటలు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. **బిడ్లను ఆహ్వానిస్తున్న కార్యాలయం:** కమిషనర్, పెబ్బేరు మున్సిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 9177513032, 7330690290.

సం/- కమిషనర్,
పెబ్బేరు మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 3492-PP/CL/ADVT/2026-27, Date: 03-06-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

షార్ట్ టెండర్ 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ NIT నెం. 04/EE/Divn.41/SBZ/GHMC/2026-27, తేది:03-06-2026

| క్ర. సం. | NIT NO. | పని పేరు | అంచనా మొత్తం | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా & సెల్ నెం. |
|---|---|---|---|---|---|
| 1 | NIT No. 04/ EE/ Dvin-41/ SBZ/ GHMC/ 2026-27, తేది: 03.06. 2026 | 4 సివిల్ పనులు | 51.80 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04.06.2026 మ.03.00గం.లకు. డౌన్‌లోడ్ ఆఖరి తేది: 08.06.2026 మ.03.00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - ముషీరాబాద్ సర్కిల్ - 41, జిహెచ్ఎంసి. సెల్ నెం. 7995007437 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
ముషీరాబాద్ సర్కిల్-41,
ఎస్‌జెడ్‌బి, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 3523-PP/CL/ADVT/2026-27, Date: 03-06-2026

## చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

**ప్రజాపక్షం/కోదాడ:** చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ కోదాడ కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. కోర్టు వివరాల ప్రకారం 2016 సంవత్సరంలో కోదాడ పట్టణానికి చెందిన కర్నాటి అశోక్ వద్ద నుంచి ఎలగందుల శ్రీనివాసరావు రూ.11 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ మొత్తానికి అశోక్‌కు చెక్ ఇచ్చాడు. అయితే ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో తగినంత సొమ్ము లేకపోవడంతో బౌన్స్ అయింది. దీనిపై బాధితుడు అశోక్ కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాసరావుకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు చెక్ మొత్తమైన రూ.11 లక్షలను బాధితుడికి చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. ఈ మొత్తాన్ని నెలరోజుల్లోగా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయం స్థానం స్పష్టం చేసింది. బాధితుడి తరుపున న్యాయవాది కంచర్ల శరత్‌కుమార్ కోర్టులో వాదనలు వినిపించారు.

## ఫీజులు ఇవ్వకుంటే తగు మూల్యం చెల్లించుకోక తప్పదు



**ప్రజాపక్షం/పాలకవీడు:** ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక పోతే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పాలకవీడు మండల కేంద్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బిసిల అభివృద్ధి కోసం సంక్షేమ కోసం బడ్జెట్‌లో 2500 కోట్ల రూపాయల ప్రత్యేక నిధి కేటాయించాలని, అలాగే బిసి సబ్ ప్లాన్ పకడ్బందిగా అమలు చేయాలని, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని లేని పక్షంలో తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల నాయకులు చిలకరాజు శ్రీను, కొండా శ్రీనివాసగౌడ్, కొమ్రరాజు వెంకట్, బత్తిని శ్రీనివాసగౌడ్, శ్రీనివాసచారి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలి

ఎఐఎస్ఎఫ్, విజెఎస్ తహసీల్దార్‌కు వినతి




**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : గురజాల నుండి జానకిపురం వరకు శంకుస్థాపన చేసి వదిలివేసిన బిటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్, విజెఎస్ ఆధ్వర్యంలో మానాయికుంట ఎక్స్ రోడ్ నుండి అడ్డగూడూరు తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక తహసిల్దార్ శేషగిరిరావుకి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ నిలిచిన రోడ్డు పనులు ప్రారంభించాలని మే 20వ తేదీన మానాయకుంట ఎక్స్ రోడ్లో ధర్నా నిర్వహించిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పుడైనా స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ఎంపీ స్పందించి రోడ్లు భవనాలు శాఖ మాత్యుల సహకారంతో ఈ రోడ్డుపైన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మూడు జిల్లాలను అనుసంధానం చేసే ఈ రహదారి పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజిఎస్ ఓయూ అధ్యక్షులు చెరుకు శివరాజ్ మాట్లాడుతూ ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయకపోతే విడతల వారీగా వెల్దేవి గట్టు సింగారం మానాయికుంట గ్రామాల ప్రజలను ఏకం చేసి ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఉప్పుల కర్ణాకర్, వంశీ, నిఖిల్, మురళి విజెఎస్ నాయకులు లక్ష్మీ సాయి, సంజు, ముఖేష్, లోకేష్ బిఆర్ఎస్వి నాయకులు అఖిల్ పాల్గొన్నారు.

## నల్లగొండలో జింకల కలకలం

ఒకటి మృతి..మరొకటి పరార్



**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లా కేంద్రంలో మంగళవారం జింకలు ప్రత్యక్షమై కలకలం రేపాయి.ఐటీ టవర్ ఎదురుగా ఉన్న ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం వద్ద రెండు జింకలు కనిపించాయి.మునుగోడు అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చి ఉంటాయని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. భయంతో పరుగులు తీసిన జింకల్లో ఒకటి తీవ్ర గాయాలతో కుప్పకూలగా,మరొకటి తప్పించుకొని పారిపోయింది. గాయపడిన జింకకు చికిత్స అందించినా ఫలితం లేక మృతి చెందింది.అటవీ శాఖ అధికారులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేశారు. మృత జింక కళేబరాన్ని ఖననం చేయనున్నారు.సంఘటనా స్థలాన్ని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవీందర్ గౌడ్,రేంజ్ అధికారి వీరేంద్ర బాబు, వన్యప్రాణుల సంరక్షణ సిబ్బంది పరిశీలించారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో యువకుడు మృతి

**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని చొప్పరివారిగూడెంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణం బలిఅయ్యింది. గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చండూరు మండలం చొప్పరివారి గూడెం గ్రామానికి చెందిన చొప్పరి చందు (20) విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కొన్ని రోజుల నుండి క్రిందికి వేలాడుతున్న వైర్లు ను సరిచేయాలని విద్యుత్ అధికారులకు గ్రామ ప్రజలు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోకపోవడంతో ఓ నిండు ప్రాణం బలి కావలసివచ్చింది. చందు ఆ వైర్లను గమనించకపోవడంతో అటువైపుగా వెళ్లడంతో క్రిందికి వేలాడుతున్న వైర్లను గమనించకపోడంతో విద్యుత్ వైర్లు తాకి మరణించాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే చందు చనిపోయాడని గ్రామ ప్రజలు ఆరోపించారు. వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేతికి అందివచ్చిన కొడుకు తమ కళ్ళ ముందే చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాకారం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి** : తెలంగాణ రాష్ట్రం కేవలం కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నిర్ణయం వల్లే సాకారమైందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి జాతీయ నేత నితిన్ నబీన్‌కు తెలంగాణ ఉద్యమ చరిత్రపై కనీస అవగాహన లేదని, ఆయన కొత్తగా రావడం వల్లే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'తెలంగాణ ఏ విధంగా ఏర్పడిందో తెలుసుకోవాలంటే ఏ గూగుల్లో వెతికినా కాంగ్రెస్ పార్టీ పేరే కనిపిస్తుంది' అని కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్రకు చెందిన 25 మంది ఎంపీలు ఉన్నప్పటికీ, సోనియా గాంధీని ఒప్పించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్ సైతం తెలంగాణ వస్తుందని ఊహించలేదని, కేవలం టైంపాస్ రాజకీయాల కోసమే ఆయన ప్రయత్నించారని ఎద్దేవా చేశారు.

**కిషన్ రెడ్డి ఏం చేశారు?**

గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఏం చేశారని ఎంపీ ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం నుండి కిషన్ రెడ్డి ఎన్ని నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని, కేవలం 38 శాతం ధాన్యాన్ని మాత్రమే ఎందుకు సేకరించారని నిలదీశారు. తెలంగాణ రైతుల పట్ల కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావులకు బాధ్యత లేదా అని ప్రశ్నించారు.

**కాళేశ్వరం కాదు... 'కూళేశ్వరం'**

తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును పక్కనబెట్టి, కేసీఆర్ తన స్వార్థం కోసం కాళేశ్వరం నిర్మించారని, అది కాస్తా ఇప్పుడు 'కూలేశ్వరం'గా మారిందని విమర్శించారు. అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారం కోసం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ అడిగితే, ఇక్కడి బీజేపీ నేతలు ఎందుకు ఇప్పించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే చొరవ తెలంగాణ బీజేపీ నేతలకు లేదా అని నిలదీశారు.

**నిధుల కేటాయింపుల్లో కేంద్రం వివక్ష**

హైదరాబాద్ మెట్రో ఫేజ్2 విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని 15 శాతం నిధులు అడిగితే రూపాయి ఇవ్వడం లేదని, అదే తమిళనాడు మెట్రో ప్రాజెక్టుకు మాత్రం కేంద్రం 60 శాతం నిధులు ఎలా కేటాయించిందని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వివక్షను ఎండగట్టారు. మూసీ నది ప్రక్షాళనకు కేంద్రం నుండి నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. 'మూసీ అభివృద్ధి కావడం కిషన్ రెడ్డికి ఇష్టం లేదు. అందుకే ఆయన మూసీ నది పరివాహక ప్రాంతంలో పడుకొని రాజకీయం చేస్తూ డ్రామాలు ఆడుతున్నారు' అని విమర్శించారు. తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టే ధోరణిని బీజేపీ నేతలు వీడాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన హితవు పలికారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి, 200 గొర్రెలు,మేకలు మృత్యువాత



**ప్రజాపక్షం/నల్లగొండ/ డిండి** :జిల్లాలోని డిండి మండలం ఎర్రగుంటపల్లి శివారులోని కల్వకుర్తి కోదాడ హైవేపై మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరుకు చెందిన చిట్టికొండ ఎల్లయ్య (35) తన భార్య పద్మ, కుమారుడు మల్లేష్‌తో కలిసి టిజి06టి3043 డీసీఎంలో గొర్రెలను తరలిస్తున్నారు. ఎపి29వి3666 డిసిఎం టైరు పంచర్ కావడంతో హైవేపై నిలిపి మరమ్మతులు చేస్తున్నారు.వెలుతురు కోసం ఎపి10డబ్ల్యూ9197 డీసీఎంను కూడా వెనుక నిలిపారు.ఈ రెండు వాహనాల్లోనూ మేకలు,గొర్రెలు ఉన్నా యి. అదే సమయంలో ఎల్లయ్య డిసిఎం అక్కడికి చేరుకొని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.భార్య పద్మ,కుమారుడు మల్లేష్‌కు గాయాలయ్యాయి. సుమారు 200 మేకలు,గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి.సమాచారం అందుకున్న డిండి పోలీసులు ఘటనా స్థలానికి చేరి సహాయక చర్యలు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతి చెందిన మేకలు, గొర్రెలకు వెటర్నరీ వైద్యులతో పోస్టుమార్టం చేయిస్తున్నారు. ఫిర్యాదు మేరకు డిండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, వాహనాల పాత్రపై విచారణ కొనసాగుతోంది.



**ప్రమాద స్థలం వద్ద ఎంఎల్‌ఏ, ప్రభుత్వ విప్, కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య**

డిండి మండలం బ్రహ్మణపల్లి గ్రామ శివారులో జరిగిన విషాదకర ఘటన విషయం తెలుసుకున్న వెంటనే ఎంఎల్‌ఏ బాలునాయక్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య, గొర్రెలు,మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య,కార్పొరేషన్ డైరెక్టర్ క్యామ మల్లేష్‌లు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితుల స్వస్థలం ఎంఎల్‌ఏ, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతుడు ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి తక్షణ సహాయంగా యాదవ సంఘం తరుపున రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు.

## ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ** : ప్రభుత్వ భూములు,చెరువుల శిఖం భూములను అక్రమంగా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డీఓలు,తహసీల్దార్లతో సాదా బైనామా,భూభారతి,ల్యాండ్ సర్వే అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు త్వరగా న్యాయం చేయాలన్నారు. సాదా బైనామా పరిష్కారంలో డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములు,చెరువుల శిఖం భూములు,ఇతర ప్రజా ప్రయోజన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూభారతి కేసులను వేగంగా పరిష్కరించాలని సూచించారు.డివిజన్ స్థాయి ప్రజావాణిలో వచ్చిన సమస్యలు జిల్లా స్థాయికి రావడం సరికాదని, స్థానికంగానే పరిష్కరించాలన్నారు. ఇకపై తాను డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.అదేవిధంగా అటవీ, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన భూముల సర్వేను వేగవంతం చేసి, భూ రికార్డులను సమగ్రంగా రూపొందిచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్,ల్యాండ్ సర్వే ఏడి ధీరజ్,ఆర్‌డీఓలు,తహసీల్దారులు , ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వసతులే లక్ష్యం

మిర్యాలగూడ బత్తుల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు, పరిశుభ్రమన వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధమ కర్తవ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పబ్లిక్ హెల్త్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి పట్టణంలో శరవేగంగా జరుగుతున్న చిన్నచెరువు కట్ట ఆధునీకరణ పనులు, మురుగునీటి శుద్ధి కేంద్రం ఎస్‌టీపీ ప్లాన్ నిర్మాణ ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రగతిని నిశితంగా పరిశీలించి అధికారులు, గుత్తేదారులకు పలు కీలక సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకోని చిన్నచెరువు కట్ట నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కట్టపై ప్రజల కోసం వాకింగ్ ట్రాక్, లైటింగ్, పచ్చదనం పెంపొందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిరూపయోగంగా ఉన్న ఎస్‌టీపీ ప్లాంట్ సామర్థ్యం, మురుగునీటి శుద్ధి ప్రక్రియ సాంకేతికతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎక్కడ నాణ్యత లోపించకూడదని గుత్తేదారును, అధికారులను హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్నికి ముప్పు వాటిల్లకుండా పబ్లిక్ హెల్త్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్దేశిత కాల పరిధిలోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఎస్సీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరు బాలకృష్ణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## సమర్థవంతంగా పనిచేయాలి : ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేట** : వివాదాలకు తావులేకుండా ప్రజలకు పోలీసు సేవలు అందించడంలో సిబ్బంది చట్టపరిధిలో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న 77 మంది హెడ్ కానిస్టేబుళ్లకు, 25 మంది కానిస్టేబుళ్లకు పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కోరుకున్న పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశామని, తమ అనుభవాన్ని ఉపయోగించి పోలీసు సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నందు పనిచేస్తూ సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన అనుభవం ఉందని, కష్టమైన పరిస్థితుల్లో కూడా ఉద్యోగం నిర్వహించి ఈ స్థాయికి వచ్చారన్నారు. మీ యొక్క పూర్తిస్థాయి అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌజ్ అధికారికి, జూనియర్స్‌కు, తోటి సిబ్బందికి పనిలో కలుపుకొని కష్టపడి పని చేస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యం, మెళకువలు చూపాలి, కొత్త చట్టాల ప్రకారం హెడ్ కానిస్టేబుల్ స్టేషన్ ఇంచార్జి అధికారిగా పోలీస్ స్టేషన్‌లో అన్ని విధులను, పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. సమస్యలు, ఫిర్యాదులను పై అధికారుల దృష్టికి తీసుకవెళ్లాలని చెప్పారు. అధికారులతో మంచి సమన్వయం కలిగి ఉండాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ బాధ్యతగా ఉండకపోతే స్టేషన్‌లో ఉన్న కిందిస్థాయి సిబ్బంది పనిలో నైపుణ్యం సాధించలేరన్నారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ సబితారాణి, సిసి సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల ముఠా అరెస్టు



**ప్రజాపక్షం/తిరుమలగిరి (సాగర్)** : తిరుమలగిరి మండలం చింతలపాలెం గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం డబ్బులు బెట్టింగ్‌గా పెట్టి పేకాట ఆడుతున్న ముఠాపై పోలీసులు దాడి చేశారు.స్థానిక ఎస్ఐ వీరశేఖర్ కు అందిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకోగా, ఏడుగురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన ముగ్గురు పారిపోగా, మిగిలిన నలు గురిని అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.4,030 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




## టియూడబ్ల్యుజె(ఐజెయు) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా గార్లపాటి కృష్ణారెడ్డి ,ప్రధాన కార్యదర్శిగా మహేందర్

**ప్రజాపక్షం/నకిరేకల్** : టియూడబ్ల్యుజె(ఐజేయు) జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నకిరేకల్‌లోని వినాయక బ్యాంక్వెట్ హాలులో జరిగిన జిల్లా మహాసభలో ఈ ఎన్నిక జరిగింది.రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.ప్రభాకర్ రెడ్డి నూతన బాధ్యులను ప్రకటించారు.జిల్లా అధ్యక్షుడిగా గార్లపాటి కృష్ణారెడ్డి ,ప్రధాన కార్యదర్శిగా పులిమామిడి మహేందర్ రెడ్డి ఎన్నికైన్నారు.

## ఎంజియు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా అరుణప్రియ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకురాలు డాక్టర్ కె అరుణప్రియ బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ గా ఆచార్య కే అంజిరెడ్డి నుండి బాధ్యతలు స్వీకరించారు.



# ఘనంగా టియుడబ్ల్యుజె(ఐజెయు) నల్లగొండ జిల్లా మహాసభలు

నకిరేకల్ పట్టణంలో జర్నలిస్టులు భారీ ర్యాలీ

జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టియుడబ్ల్యుజె (ఐజెయు): రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ




**ప్రజాపక్షం/నకిరేకల్** : పోరాటాల పురిటి గడ్డ నాటి తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని మల్లి దశ తెలంగాణ ఉద్యమం వరకు నల్లగొండ జిల్లా నకిరేకల్ కు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉన్నది అలాంటి గడ్డపై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యుజె)(ఐజెయు) నల్లగొండ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా నకిరేకల్ పట్టణ కేంద్రంలో జర్నలిస్టులు కదం తొక్కారు. జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు.మహాసభల ప్రారంభానికి ముందు నకిరేకల్ ప్రధాన కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి సభా వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.జర్నలిస్టుల ఐక్యతను చాటుతూ నినాదాలు చేసారు.అనంతరం వినాయక బంకేట్ హాల్లో మహాసభలను నిర్వహించారు.అమరులైన జర్నలిస్టులకు నివాళులర్పించారు.అట్టహాసంగా జరిగాయి. జర్నలిస్టుల సమస్యలపై చర్చలు, భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు, సంఘ బలోపేతంపై నాయకుల పిలుపులతో మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.సందర్భంగా ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ,రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభాకర్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా ఉద్యమాలకు, పోరాటాలకు పురిటిగడ్డగా నిలిచిందని పేర్కొన్నారు.అలాంటి చైతన్యవంతమైన నకిరేకల్ గడ్డపై జిల్లా మహాసభలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టియుడబ్ల్యుజె (ఐజెయు) నిరంతరం పనిచేస్తోందని,రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం టియుడబ్ల్యుజె (ఐజెయు) అని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇళ్ల స్థలాల కేటాయింపు,అక్రిడేషన్ కార్డుల జారీ,హెల్త్ కార్డుల పంపిణీలో జరుగుతున్న జాప్యం, సంక్షేమ పథకాల అమలులో ఉన్న ఇబ్బందులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) బలమైన జర్నలిస్టు సంఘంగా ఎదుగుతోందని ఆయన తెలిపారు.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 14 వేలకుపైగా సభ్యత్వాలు నమోదయ్యాయని, జర్నలిస్టుల సమస్యలపై 24 గంటలూ సంఘం పని చేస్తోందని చెప్పారు. వృత్తిపరమైన ఇబ్బందులతో పాటు సంక్షేమ అంశాల్లోనూ జర్నలిస్టులకు అండగా నిలుస్తోందన్నారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై సంఘం నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సంఘ బలోపేతమే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి బలమైన ఆయుధమన్నారు.జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.మహాసభల సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలియజేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. నాగయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సాంబశివారెడ్డి,పులిమామిడి మహేందర్,మదనాచారి,నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెరుకు సతీష్,గౌరవాధ్యక్షుడు రేపాల సతీష్, నియోజకవర్గ నాయకులు బయన్న,శీను,కందగట్ల శ్రీధర్,బుడిగ శ్రీనివాస్, సైదులు,పరమేష్ రాంబాబు, రాములు,రాము,శ్రీనివాసరెడ్డి,బెల్లి సాయి గడగోజు రవీంద్రాచారి,మోహన్,సైదులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రత్యేక గ్రామ సభలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** 4,6,8,10 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ గాలి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాటాడుతూ.. గ్రామ సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామసభల ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సభలలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని ఎంపిడిఒ యాదయ్య కోరారు.

## బడిబాట కార్యక్రమం విజయవంతం



**ప్రజాపక్షం/ కృష్ణ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులు " బాడి బాట" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కృష్ణ మండలం కున్సి గ్రామంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడి ఈడు గల ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించాల్సిన ఆవశ్యకతను, ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్య, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, 2 జతల దుస్తువులు, టై, బెల్ట్, షూస్, బ్యాగ్ తదితర అంశాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. అలాగే 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6వ తరగతిలో తప్పనిసరిగా చేర్పించి వారి విద్యాభ్యాసం నిరంతరంగా కొనసాగించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ మ్యాకలి సురేష్, ఉప సర్పంచ్ ఉప్పరి రమేష్, గ్రామ పంచాయితీ కార్యదర్శి స్వామినాథ్, గ్రామ పంచాయితీ అధికారి గీత, వార్డు సభ్యులు నాగప్ప, పాఠశాలల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు ఉప్పరి హనుమంతు, రాము, నర్సప్ప, బీరప్ప, కురుమూర్తి , సాయిబన్న తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ దామరగిద్ద :** దామరగిద్ద మండల పరిధిలోని క్యాతన్‌పల్లి గ్రామంలోని పదవ వార్డులో బుధవారం రోజు గ్రామ సర్పంచ్ కావలి గోవిందు నూతన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సీత, వార్డు సభ్యులు రమేష్, బాలప్ప, చిన్నప్ప, నారాయణ, నర్సప్ప వివిధ పార్టీల గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ చిన్నంబావి:** అమ్మాయిపల్లి గ్రామంలో వీపన గండ్ల రోడ్ ప్రైమరీ స్కూల్ సిసి రోడ్డు నుండి బస్టాండ్ వరకు ఉన్నటువంటి ఆవరణలో వర్షాలకు నీరు చుట్టుపక్కల ఇళ్లకు ఇబ్బందికరంగా ఉంటుందని సమస్యను పరిష్కరించాలని స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. స్పందించిన మంత్రి సహాయ సహకారాలతో బుధవారం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత, మహేశ్వరమ్మ సత్యారెడ్డి, దుర్గయ్య స్వేరో, పావని కవిందర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పబ్బు విష్ణువర్ధన్ గౌడ్, వెంకటేష్ నాయుడు, శ్యామ్ నాయుడు, సుకుమార్, బిట్టు, గ్రామ పెద్దలు పాల్గొని పనులు ప్రారంభించారు.

## విద్యా సంస్థల అభివృద్ధికి కృషి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** విద్యా సంస్థల అభివృద్ధికి కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్‌యాదవ్ హామీఇచ్చారు. బోరబండ సైట్3లోని తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ (బాలురు, బాలికలు) విద్యాసంస్థలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ప్రాంగణాలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న విద్య, సదుపాయాలు, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు.

## గ్రంథాలయ సంస్థలో ప్రమోషన్ల జాతర



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగులకు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారని.. ఈ మేరకు జిఓ 317 అమలుకు అనుమతి ఇచ్చి ఉద్యోగుల కేటాయింపులను పూర్తి చేయడంతో పాటు అన్ని కేడర్లలో పెద్ద ఎత్తున ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం నేతలు శాగంటి అయోధ్య (అధ్యక్షుడు) వరప్రసాద్ సుకేష్ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణాకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనుమతి లభించడం ద్వారా జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.ఎండి. రియాజ్ ఉద్యోగుల సంక్షేమం, ప్రమోషన్ల అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ స్థాయిలో కృషి చేయడం ద్వారా ఈ ప్రక్రియ వేగవంతం కావడానికి దోహదపడ్డారని ప్రశంసించారు.

# 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం

మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/ మక్తల్ :** రేపు జరగనున్న సిఎం పర్యటన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల దశ దిశ ను మార్చివేస్తుందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బిసి వెల్ఫేర్ స్కూల్ గ్రౌండ్‌లో సిఎం పర్యటనపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ..... రేపు మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో మక్తల్‌లోని బిసి వెల్ఫేర్ స్కూల్ మైదాన ప్రాంగణానికి చేరుకున్న అనంతరం మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. కృష్ణా, భీమా నదులపై బ్రిడ్జి కం బ్యారేజ్ లను నిర్మించాలని గత కొన్ని రోజుల నుండి కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజుతో పలు దఫాలుగా చర్చించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఇరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి కొత్తగా కట్టబోయే ప్రాజెక్ట్ లకు ప్రయోజనకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. అటు కర్ణాటక రాష్ట్రంలో అడుగడుగునా బ్రిడ్జి కం బ్యారేజ్ లు ఉన్నాయని, ఇక్కడ మన రాష్ట్రంలో కూడా సాగు, తాగు నీటి అవసరాల కోసం బ్యారేజ్‌లు కట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యారేజ్‌లు కట్టుకోవడం ద్వారా వర్షాకాలంలో వృథాగా పోతున్న వందల టీఎంసీల నీటిని కాపాడుకోవచ్చని మంత్రి తెలిపారు. గత పాలకులు బ్యారేజ్‌ల నిర్మాణాన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఇక్కడి ప్రాంత రైతాంగాన్ని, ప్రజలను దృష్టిలో ఉంచుకొని సాగు, తాగు నీటిని శాశ్వతం పరిష్కారం దిశగా రేపు ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్ట్‌లపై ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. మక్తల్ ప్రాంతం లో కృష్ణా, భీమా నదుల పై నిర్మించ తలపెట్టిన ప్రతిపాదిత బ్రిడ్జి కం బ్యారేజ్ లకు ఇరు రాష్ట్రల ముఖ్యమంత్రులు ఒప్పుకున్నారని తెలియజేశారు. అదేవిధంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ గూడ బల్లూర్ నుండి తంగిడి మీదుగా హైవే లను కలుపుతూ భీమా నదిపై వంతెనను నిర్మిస్తే ఇరు రాష్ట్రాలకు కనెక్టివిటీ పెరిగి ప్రజలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ వంతెన నిర్మాణంపై రేపు సిఎంకు ఏరియల్ సర్వే ద్వారా వివరించనున్నట్లు మంత్రి తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న భూత్పూర్ నేరేడుగామ్ ముంపు గ్రామాల ప్రజలకు సరైన పరిహారం ప్రకటించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. అగమ్యగోచరంగా ఉన్న ముంపు గ్రామాల ప్రజల కష్టాలను రేపు ముఖ్యమంత్రికి వివరించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ముంపు గ్రామాల ప్రజలకు 1500 కోట్ల రూపాయలు నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించిన సిఎం రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మక్తల్ , నారాయణపేట్– కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా 99 శాతం రైతులను ఒప్పించి భూ నిర్వాసితులకు ఎకరానికి 20 లక్షల రూపాయలు ఇచ్చిన ఘనత సిఎం రేవంత్ రెడ్డిదేనన్నారు. భూత్పూర్ రిజర్వాయర్లో 15 టీఎంసీ ల నీటిని నిలుపుకోవడానికి అవకాశం కల్పించేలా రేపు జరగబోయే ఏరియల్ సర్వే ద్వారా సిఎంకు వివరిస్తానని మంత్రి తెలిపారు. భూత్పూర్ రిజర్వాయర్లో 15 టీఎంసీల నీటిని నిలుపుకోగలిగితే ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందని మంత్రి వెల్లడించారు. రేపు జరగబోయే సిఎం పర్యటనను విజయవంతం చేయాలని రైతులకు ప్రజలకు మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/అలంపూర్:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర నియోజకవర్గం రాజోలి, వడ్డేపల్లి, పచ్చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.3,699 మద్దతు ధరను ప్రకటించింది. మార్కెట్‌లో ఉన్న అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయించిన ఈ ధర రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరగడానికి రైతులు కింది మార్గదర్శకాలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. రైతు సమగ్ర సమాచార సర్వే లో నమోదైన రైతులు మాత్రమే తమ పంటను విక్రయించేందుకు అర్హులు. ఒక్కో రైతుకు ఎకరాకు గరిష్టంగా 10 క్వింటాళ్ల వరకు మాత్రమే పంటను సేకరిస్తారు. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే జొన్నలు నాణ్యంగా ఉండాలని, ప్రభుత్వం సూచించిన తేమ శాతం మరియు తాలు లేకుండా చూసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు వచ్చేటప్పుడు, కింది పత్రాల జిరాక్స్ కాపీలను పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు , బ్యాంక్ ఖాతా పుస్తకం (డబ్బులు నేరుగా ఖాతాలో జమ అయ్యేందుకు) తప్పనిసరి, ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రేపు జడ్చర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్‌రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** రేపు జడ్చర్ల పట్టణ పర్యటనకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతంగా నిర్వహించేందుకు గాను గంగాపూర్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సభా స్థలాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని సూచించారు. జడ్చర్లకు ముఖ్యమంత్రి రాక నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే అవకాశంగా ఈ పర్యటన నిలుస్తుందని ఎమ్మెల్యే జానంపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ జానకి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/ గద్వాల రూరల్ :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం ఐడిఒసి కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం భూమి, నీరు, జీవ వైవిధ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలైన గుడ్డ సంచులు, స్టీల్ బాటిళ్లు, గాజు సీసాలు, వెదురు ఉత్పత్తులు, ఆకు పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. " తగ్గిదాం తిరిగి వాడుదాం పునర్వినియోగం చేద్దాం " అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి చర్యల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. " మన భూమి మన బాధ్యత " అనే భావనతో ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించి నప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీపీఓ పాపయ్య, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త డా॥ విద్యులత పాల్గొన్నారు.

**సజావుగా గ్రామ, వార్డు సభలు**

గ్రామ, వార్డు సభల్లో ప్రభుత్వం సూచించిన అంశాలన్నింటినీ ప్రస్తావిస్తూ సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి 4,6,8,10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించు సభలపై కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. సభల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసి దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంఏఓలు నోడల్ అధికారులుగా ఆయా గ్రామ, వార్డు సభలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో రెండు వార్డులకు కలిపి ఒక చోట సభను నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సభల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వర్షపు నీరు హార్వెస్టింగ్, తదితర అంశాలపై పిపిటి ద్వారా తెలియజేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ల మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నల్లమట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రచారం



**ప్రజాపక్షం/ మక్తల్ :** నల్లమట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ఖానాపురం, కర్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించారు. రైతులను కలిసి 5వ తేదీన జరిగే ధర్నాలో పాల్గొనాలని కరపత్రాలు పంచి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతుల దగ్గర అనేక విషయాలపై చర్చించారు. వాటన్నిటికీ ప్రజా సంఘాల ప్రతినిధులు పరిష్కార అంశాలను తెలియజేశారు. కర్ని గ్రామంలో కరపత్రాలతో ఇంటింట ప్రచారం చేసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలించడం తప్పుడు పద్ధతి అని, ఒండ్రుమట్టిలో సూక్ష్మ పోషకాలు ఎక్కువ ఉంటాయి కనుక రైతుల భూములకు పనికొస్తాయని, పంటలు అధిక దిగుబడి వస్తుందని రైతాంగానికి తెలియజేశారు. మన ఊరు చెరువుని మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నల్లమట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలో రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, బీసీ రాష్ట్ర ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు గౌడ్, ఖానాపురం గ్రామ బీసీ ఐక్యవేదిక నాయకులు సురేష్, రవికుమార్ మండల నాయకులు మండల రవికుమార్, కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షులు డి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వృక్ష సంపద రోజురోజుకు అంతరించి పోతుండడంతో ప్రకృతి వైపరీత్యాలు పెరిగే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వాలు అడవుల సంరక్షణకు, విస్తరణకు ప్రత్యేక పథకాలు చేపట్టి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కలను నాటిస్తుంటే, మరోవైపు అక్రమార్కులు చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో భారీ వృక్షాలను అక్రమంగా నరికివేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్ల సంరక్షణ బాధ్యతలు వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఈ అక్రమాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు అక్రమార్కులు నుంచి లంచాలు స్వీకరించి కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజు రాత్రి వేళల్లో చెట్లను నరికి, కలపను రహస్యంగా తరలిస్తూ అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు సమాచారం. అనంతరం ఆ కలపను సమీప పట్టణాలైన పెబ్బేరు, ఎర్రవల్లి, కర్నూలు, కొత్తకోట, గద్వాల్ ప్రాంతంలోని కట్టెల కోత యంత్ర కేంద్రాలకు తరలించి విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండా చెట్లను నరికివేసి లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వాలు హరితహారం వంటి పథకాల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి పెంచుతున్న అడవులు, ఈ విధంగా నాశనం కావడంతో లక్ష్యాలు నీరుగారుతున్నాయి. దీనిపై అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా జరుగుతున్న చెట్ల నరికివేత, కలప రవాణాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అడవుల సంరక్షణలో కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమార్కులపై కఠిన శిక్షలు విధించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. లేకపోతే భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపద అందకపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## రెండో రోజు కొనసాగిన ప్రజాపాలన బస్సుయాత్ర



**ప్రజాపక్షం/అలంపూర్:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఎంపి మల్లురవి చేపట్టిన ప్రజాపాలన బస్సు యాత్ర రెండవ రోజు అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలంలో ఉదయం కొనసాగింది. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేవు అయినప్పటికీ ప్రజలను కలవడానికి ఎర్రటి ఎండలను సైతం లెక్క చేయకుండా ప్రజాక్షేత్రంలో ప్రజల నియోజకవర్గ ప్రాంత సమస్యలు తెలుసుకోవడం కొరకు ప్రతి మండలాన్ని బస్సు పర్యటన ద్వారా పర్యటిస్తున్నామన్నారు. అలంపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంపీ మల్లురవి ని కాంగ్రెస్ పార్టీని బలపరచి గెలిపించినందుకు గానీ అలంపూర్ నియోజకవర్గానికి ఎంపీ నిధుల నుంచి ఎక్కువ మొత్తాన్ని కేటాయించడంతో పాటు అలంపూర్ ప్రాంత అభివృద్ధి కొరకు మరింత ఎక్కువ. కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి పరిపాలనలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం నిర్వహిస్తూ, బస్సు యాత్ర ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా డిసిసి అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జి మధు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, అలంపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుమార్, మానవపాడు మండల అధ్యక్షులు జగన్‌మోహన్ నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా ముందుకుసాగని గద్వాల చేనేత పార్క్

శంకుస్థాపనలకే పరిమితమైన వైనం

సిఎం రాకతోనైనా పనుల కొలిక్కి వచ్చేనా..?



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్:** దశాబ్దాలుగా గద్వాల చేనేత పార్క్ నిర్మాణం ముందుకు సాగడం లేదు. జోగులాంబ గద్వాల జిల్లా చేనేత కళకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. గద్వాల చీరలకు దేశ విదేశాల్లో పేరు ఉన్నప్పటికీ , చేనేత కార్మికుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి విస్తరణ కోసం ప్రతిపాదించిన గద్వాల చేనేత పార్క్ మాత్రం ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2007 లో గద్వాల ఎర్రవల్లి చౌరస్తా ప్రధాన రహదారి పక్కన జిల్లా కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుటాన్‌పల్లి స్టేజి సమీపంలో 47.25 ఎకరాల భూమిని చేనేత పార్క్ కోసం కేటాయించారు. అనంతరం 2008 అక్టోబర్ 5న ముఖ్యమంత్రి హోదాలో ఆయన శంకుస్థాపన చేసి, సుమారు రూ.50 లక్షలతో స్థలానికి బౌండరీస్ హద్దులు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర విభజన అనంతరం ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. 2018 జనవరి 31న అప్పటి చేనేత, జౌళి శాఖ మంత్రి కేటీఆర్ గద్వాలలో పర్యటించి మరోసారి చేనేత పార్క్‌కు శంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా 10 ఎకరాల్లో రూ.14.98 కోట్ల అంచనాతో పార్క్ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్రం రూ.4 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 6 కోట్లు, చేనేత కార్మికులు మాస్టర్ వివర్స్‌గా ఏర్పడి రూ. 4 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. మాస్టర్ వివర్స్ ఖర్చు చేసేందుకు ముందుకొచ్చినా 10 ఎకరాల స్థలాన్ని ఎస్‌పీవీ కి ఇవ్వాలని మెలిక పెట్టారు. ప్రభుత్వం లైజుకి ఇచ్చేందుకు సిద్ధమైంది. పార్క్ నిర్వహణ, మౌలిక సదుపాయాల ఏర్పాట కోసం లీజుపై బ్యాంకులు రుణాలు ఇవ్వమనేది వ్యాపారుల వాదన. అందుకు ప్రభుత్వం అంగీకరించక పోవడంతో పార్క్, ఏర్పాటు అర్ధాంతరంగా ఆగిపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో సిఎఫ్సిని నిర్మించి నామ మాత్రపు అద్దెకు లీజుకి ఇవ్వాలని ఆలోచనతో ప్రభుత్వాలు ఉన్నట్లు తెలుస్తోంది. లేదా కామన్ ఫెసీలిటీ సెంటర్లు నిర్మించి బహిరంగ వేలం ద్వారా పార్కు నిర్మించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం రూ.52 కోట్లు అంచనాతో ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

**సిఎం రాకతోనైనా కొలిక్కి వచ్చేనా...?**

ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గద్వాలకు వస్తున్న సందర్భంగా గద్వాల చేనేత పార్కు నిర్మాణం ఓ కొలిక్కి వస్తుందని నమ్మకంతో కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేనేత రంగ పునరుద్ధరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గద్వాల చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి, పెండింగులో ఉన్న చేనేత పార్క్ నిర్మాణానికి ప్రత్యేక నిధులో కేటాయించాలని కార్మికులు కోరుతున్నారు. శంకుస్థాపనలతో కాదు.. నిర్మాణాలతోనే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని, గద్వాల చేనేతకు తగిన గౌరవం దక్కాలంటే చేనేత పార్కును వెంటనే కార్యరూపం దాల్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన ఆదర్శజీవి ఊషయ్య



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకూ కట్టుబడి పనిచేసిన గొప్ప నాయకుడు బొడ్డుపల్లి ఊషయ్య అని సిపిఐ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ కొనియాడారు. బుధవారం నాగోల్‌లోని ఎస్‌ఏ డాంగే భవనంలో ఊషయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ సిపిఐ బలోపేతం కోసం బొడ్డుపల్లి ఊషయ్య తన జీవితాన్ని అంకితం చేశారని, ఎంతోమంది నాయకులను తయారు చేసిన గొప్ప నాయకుడని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రజా సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉడతల మల్లేష్ గౌడ్, పరిపూర్ణచారి, కృష్ణ, లక్ష్మి , నరేందర్, రమేష్ పాల్గొన్నారు.

## ఆదర్శ మండలంగా అభివృద్ధి

కొందుర్గు ఎంపిడిఒ శ్రీరాములు



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఆదర్శ మండలంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజాప్రతినిధులు సహకరించేందుకు కృషి చేయాలని కొందుర్గు ఎంపిడిఒ శ్రీరాములు కోరారు. బుధవారం కొందుర్గు ఎంపిడిఒ కార్యాలయంలో శ్రీరాములును సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గతంలో కొందుర్గు ఎంపిడివోగా విధులు నిర్వహించిన లక్ష్మి అనురాధ ప్రమోషన్ నిమిత్తం బదిలీకాగా ఆమె స్థానంలో శ్రీరాములు ఎంపిడిఒగా వచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాల్‌నాయక్, చిన్న ఎల్కిచర్ల సర్పంచ్ రాజు, శ్రీరంగాపూర్ సర్పంచ్ రమేష్, పర్వతాపూర్ సర్పంచ్ అశోక్‌లు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/కొందుర్గు:** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కమిటి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం కొందుర్గు మండలం రామచంద్రాపూర్ నుండి రేగడి చిల్కమర్రి గ్రామం వరకు కొనసాగుతున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కాకముందే బ్రిడ్జి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ఆస్తులు కోల్పోతే పరిహారం చెల్లిస్తాం

షాద్‌నగర్ ఆర్‌డిఒ ఎన్.ఆర్.సరిత




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ఆస్తులు కొల్పోతున్న యాజమానులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఆర్‌డిఒ ఎన్.ఆర్.సరిత వివరించారు. బుధవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో యాజమానులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ సరిత మాట్లాడుతూ చటాన్‌పల్లి రైల్వే గేట్ నంబర్ ఎల్‌సి నం 27వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టేందుకు భూ సేకరణ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ముందుకు అక్కడ ఉన్న యాజమానులతో గ్రామసభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ఆస్తులు కొల్పోతున్న యాజమానులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని, ఇందుకు యాజమానులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ నాగయ్య, భూసేకరణ అధికారులు, రైల్వే అధికారులు, రెవిన్యూ సిబ్బంది, భూ యజమానులు పాల్గొన్నారు.

## బృందావన్ మెడోస్ కాలనీ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ శివారు కాలనీ అయిన బృందావన్ మెడోస్ కాలనీ డ్రైనేజీ పనుల కోసం రూ.24.50 లక్షలు మంజూరు అయ్యాయని కాలనీ అధ్యక్షులు అధ్యక్షులు పొణుగుపాటి శశికాంత్ తెలిపారు. బుధవారం కాలనీ వాసులతో కలిసి పనులు ప్రారంభించుకున్నారు. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్‌బి నగర్ ఇంచార్జి, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్ సహకారంతో నిధులు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వేణు, రవితేజ, సందీప్, జయచంద్ర, అరుణ్, బాషా, రమేష్, వేగష్, రాఘవేంద్ర, రాజు, లక్ష్మి నారాయణ, శివశంకర్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

పచ్చదనం పెంచేందుకు కృషి

వర్షాకాలానికి ముందస్తు చర్యలు

త్వరగా పూర్తి చేయాలి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. అల్వాల్, బొల్లారం పరిధిలోని ఓల్డ్ అల్వాల్ రోడ్, కందాడి ఎన్‌క్లేవ్ , సరస్వతి కాలనీ, మచ్చ బొల్లారం, విజయ్ విహార్ ఎన్‌క్లేవ్ , రైల్వే ఎంప్లాయిస్ కాలనీ ఫేజ్1 తదితర ప్రాంతాలలో అధికారులతో కలిసి ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా అల్వాల్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో రోడ్ల శుభ్రతను కమిషనర్ వినయ్‌కృష్ణా రెడ్డి పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లను క్లీన్ చేయడానికి వినియోగిస్తున్న యంత్ర పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు.

### ముందస్తుగా డ్రైన్ల పూడికతీత

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఓల్డ్ ఆల్వాల్ రోడ్, కందాడి ఎన్‌క్లేవ్ , సరస్వతి కాలనీల్లోని స్టార్మ్ వాటర్ డ్రైన్లు (వరద నీటి కాలువలు) వ్యవస్థను కమిషనర్ తనిఖీ చేశారు. వర్షం నీరు సజావుగా ప్రవహించేలా, డ్రైనేజీ కనెక్టివిటీలో ఎలాంటి అడ్డంకులు లేకుండా నిరంతరం పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు హైడ్రా డిఆర్ఎఫ్ బృందంతో సమావేశమై, వారి సన్నద్ధతను, పరికరాల లభ్యతను సమీక్షించారు.

### రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

బొల్లారం పరిధిలోని మచ్చ బొల్లారం హనుమాన్ ఆలయం సమీపంలో 'శాట్' ఆటో డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమావేశమయ్యారు. రోడ్లపై చెత్త వేసే వారిపై కఠినంగా ఉండాలని సూచించారు. బొల్లారంలోని విజయ్ విహార్ ఎన్‌క్లేవ్ , సరోమా ప్లాజా సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించిన కమిషనర్, స్థానికుల సౌకర్యార్థం ప్రజా పార్కును అభివృద్ధి చేయాలని ఆదేశించారు. న్యూ బొల్లారంలోని రైల్వే కాలనీ రోడ్, రైల్వే ఎంప్లాయీస్ కాలనీ ఫేజ్1 ప్రాంతాల్లో పర్యటించి యాంటీ లార్వల్ కార్యకలాపాలను ముమ్మరం చేయాలన్నారు.

## ఆరోగ్యకర జీవనానికి సైక్లింగ్ తప్పనిసరి



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలి, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడా కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా—సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. జూన్ 7న గచ్చిబౌలి స్టేడియం లో నిర్వహిస్తున్న'ఫిట్ ఇండియా—సండేస్ ఆన్ సైకిల్' పోస్టర్‌ను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనరెడ్డి బుధవారం ఎల్బీ స్టేడియంలోని తన కార్యాలయంలోఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిఒక్కరూ వారానికి కనీసం ఒకరోజు సైకిల్‌ను వినియోగించే అలవాటు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకర జీవనానికి సైక్లింగ్ తప్పనిసరి అన్నారు. ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు పర్యావరణ హిత రవాణా విధానమన్నారు. కాలుష్య నియంత్రణ, ఇంధన పొదుపు, సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు అనిత, సుజాత, రవీందర్, రవితేజ, శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు.

## డిఫెన్స్ లిక్కర్ దందా బట్టబయలు

రూ. లక్ష విలువైన

51 మద్యం బాటిళ్ల స్వాధీనం..

మాజీ సైనిక ఉద్యోగి అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్‌లో అక్రమంగా డిఫెన్స్ లిక్కర్ విక్రయాలు జరుపుతున్న ముఠాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి రూ.లక్ష విలువైన 51 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మాజీ సైనిక ఉద్యోగి కె. విద్యాసాగర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 'ఏ' టీమ్‌కు అందిన సమాచారంతో సిఐ ఎస్.చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలోని అధికారులు సికింద్రాబాద్‌లోని స్టైల్ యూనియన్ షాపింగ్ మాల్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌కు చెందిన డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను విక్రయిస్తున్న కె.విద్యాసాగర్‌రెడ్డిని పట్టుకుని అతని వద్ద నుంచి తొలుత 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడి నివాసంలో నిర్వహించిన సోదాల్లో మరిన్ని మద్యం బాటిళ్లు లభ్యమవడంతో మొత్తం 51 డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడు మధ్యప్రదేశ్‌లో తక్కువ ధరలకు డిఫెన్స్ లిక్కర్ కొనుగోలు చేసి, వాటిని హైదరాబాద్‌కు తరలించి సికింద్రాబాద్, సైనిక్‌పురి ప్రాంతాల్లో చాలాకాలంగా విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ అఫ్జల్, కానిస్టేబుళ్లు మురళి, జంగయ్య, శేఖర్, శోభ, శశిధర్ పాల్గొన్నారు. నిందితుడిని, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను తదుపరి చర్యల నిమిత్తం సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

## కమ్యూనిటీ పోలీసింగ్ బలోపేతం చేయడానికి చర్యలు

-ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాబోయే వర్షాకాలంలో ప్రజాభద్రత, శాంతిభద్రతలు, కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయడానికి, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. బుధవారం రాబోయే వర్షాకాలంలో ప్రజల భద్రత, సమర్థవంతమైన శాంతిభద్రతల అమలుపై సమీక్షించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వరద ముప్పు ఉన్న, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని నివారించడానికి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర ప్రతిస్పందన సహాయక చర్యల కోసం ఇతర విభాగాలతో సమన్వయం కొనసాగించాలన్నారు. క్రమం తప్పని పెట్రోలింగ్, బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని సిపి పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ చందనదీప్తి, డిసిపిలు యోగేష్, నారాణరెడ్డి, శిరీషతో పాటు ఫ్యూచర్ సిటీ ఎసిపిలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సర్పంచ్‌లు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ర్యాకల శ్రీనివాస్, రామకృష్ణ, నరసింహ, శివారెడ్డి, శివరాములు, రమేష్, చందునాయక్, శివకుమార్, యాదగిరి, గోపాల్‌రెడ్డి, జంగయ్య, మల్లేష్, సురేష్ గౌడ్, అంజి, రామచంద్రయ్య గౌడ్, మల్లేష్ గౌడ్, రాజునాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని డైమండ్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని ఎల్‌బి నగర్ ఎంఎల్ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని హస్తినాపురం డివిజన్ మాజీ వార్డు కమిటీ సభ్యులు మహ్మమద్ సయ్యద్ పాషా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తక్షణమే స్పందించి సంబంధిత వాటర్ వర్క్స్ ఎండి ఫోన్‌లో మాట్లాడి డైమండ్ కాలనీ డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ ఎండిని కోరారు. కాలనీల సమస్యలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అధికారులను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట డైమండ్ కాలనీ అధ్యక్షుడు భద్రయ్య ఉన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు కోరారు. బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు అలివేలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు లేక అవస్థలు పడుతున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచేందుకు కృషిచేయాలని కోరారు. వంటగ్యాస్ సిలిండర్లు సబ్సిడీపై అంధించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు ఇస్తామని చెప్పి నేటి వరకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.10వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, దానిని 12నెలలకు పొడిగించాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లు దాటిన కార్మికులకు రూ.1లక్ష రూపాయలు ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్, 58ఏళ్ళు దాటిన వారికి నెలకు రూ.3వేల పెన్షన్ అంధించాలని కోరారు. ప్రతి నెల ఒకటో తేదిలోగా బిల్లులు చెల్లించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.5లక్షల ప్రమాద భీమా అంధించాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పంధిస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, మధ్యాహ్న భోజన కార్మికులు అక్కమ్మ, సత్తెమ్మ, నిర్మల, అనిత, నీలమ్మ, షాహినాభేగం, ఖైరున్, సావిత్రి, కళావతి, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థిని నిఖిలను సన్మానించిన ఎమ్మెల్యే

ఇంటర్ పరీక్షల్లో టాపర్‌గా నిలువడంతోపాటు ఈఏపీసెట్‌లో 21,536వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని నిఖిలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినంధించి సన్మానించారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండాకు చెందిన డి.అఖిల విద్యారంగంలో ప్రతిభ చూపించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## వర్షాకాలంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, మునిసిపల్ కమిషనర్ సృజన





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై వరద నీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, మునిసిపల్ కమిషనర్ సృజనలు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్, మునిసిపల్ కమిషనర్ సృజనతో కలిసి సైబరాబాద్ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి, వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను పరిశీలించారు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిస్థితులను సమీక్షించి అవసరమైన చర్యలపై తగు సూచనలు చేశారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని మల్కం చెరువు బయోడైవర్సిటీ జంక్షన్ సమీపంలోని కేర్ హాస్పిటల్ వద్ద భారీ వర్షాల సమయంలో రోడ్లపై వరద నీరు చేరుతున్న ప్రాంతాలను పరిశీలించారు. అదే విధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్, కొండాపూర్‌లోని హర్ష టయోటా షోరూం జంక్షన్ తదితర ప్రాంతాల్లో వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యల శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు మునిసిపల్ అధికారులు, పోలీసులు, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వారు వివరించారు. ఈ చర్యలతో వర్షాకాలంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణాకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్, ఎడిసిపి హనుమంతరావుతో పాటు పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక వైవాహిక వివాదాలు

# వివాహ బంధాన్ని కాగితాలకే శాశ్వతం చేస్తాయ్

15ఏళ్లకుపైగా విడిగా నివసిస్తూ, విడిపోయిన దంపతుల వివాహాన్ని రద్దు చేసిన 'సుప్రీం కోర్టు'



**న్యూఢిల్లీ :** పదిహేను ఏళ్లకు పైగా విడిగా నివసిస్తున్న విడిపోయిన దంపతుల వివాహాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, వైవాహిక వివాదం దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో ఉండటం కేవలం కాగితాల మీద మాత్రమే వివాహ శాశ్వతత్వానికి దారితీస్తుందని వ్యాఖ్యానించింది. పలు సందర్భాలలో లైంగిక సంబంధాన్ని నిరాకరించడం ద్వారా భార్య భర్త పట్ల క్రూరంగా ప్రవర్తించడం సహా అనేక కారణాల వల్ల రాజస్థాన్ హైకోర్టు భర్తకు అనుకూలంగా విడాకులు మంజూరు చేసిందని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. లైంగిక సాన్నిహిత్యాన్ని నిరాకరించడం తీవ్రమైన మానసిక క్షోభను కలిగిస్తుందని, వివాహబంధానికి పునాదిని దెబ్బతీస్తుందని భారతదేశంలోని న్యాయస్థానాలు పదే పదే నిర్ధారించాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. 'అందువల్ల హైకోర్టు తీర్మానం సమర్థించబడింది. ప్రతివాది భర్త అప్పీల్‌ను అనుమతించడం ద్వారా మంజూరు చేయబడిన విడాకుల డిక్రీ సమర్థించబడింది' అని ధర్మాసనం వివరించింది. సుప్రీంకోర్టు వెల్లడించిన అనేక తీర్పులలో పేర్కొన్నట్లుగా సహేతుకమైన కారణం లేకుండా, లైంగిక సంపర్కాన్ని నిరంతరం నిరాకరించడం సహా దాంపత్య హక్కులను నిరాకరించడం మానసిక క్రూరత్వంగా పరిగణించబడుతుందని, హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(1) (ఐఎ) ప్రకారం విడాకులకు ఇది చెల్లుబాటు అయ్యే కారణంగా పరిగణించబడుతుందని అది పేర్కొంది. డిసెంబరు 2007లో వివాహం చేసుకున్న భార్యాభర్తలు ఇద్దరూ వైద్యులని, వారు వరుసగా గుజరాత్, రాజస్థాన్‌లలో ప్రభుత్వ సేవలో ఉన్నారని ధర్మాసనం పేర్కొంది. సంపూర్ణ న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తన అధికారాలను వినియోగించుకుంటూ, దంపతుల మధ్య వివాహ బంధం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైందని స్పష్టంగా తెలుస్తున్నందున ఆ వివాహాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. గత ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ భార్య దాఖలు చేసిన అప్పీల్‌పై సుప్రీంకోర్టు జూన్ 2న (మంగళవారం) తీర్పు వెలువరించింది. భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు అనుమతించి అతడికి విడాకులు మంజూరుచేసింది. అత్యున్నత న్యాయస్థానం తన తీర్పులో, ఇరుపక్షాలు 15సంవత్సరాలకు పైగా విడిగా జీవిస్తున్నారని, వారికి వివాహ బంధం ద్వారా సంతానం లేదని, న్యాయస్థానాలు పదే పదే ప్రయత్నించినప్పటికీ రాజీ కుదరలేదని పేర్కొంది. దాంపత్య హక్కులు శూన్యంలో ఉండవని, అవి దాంపత్య విధులకు నిర్మాణాత్మక ప్రతిరూపాలని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో పార్టీల ప్రవర్తనను బట్టి, కొద్దికాలం సహజీవనం చేసిన సమయంలో కూడా వారు తమ దాంపత్య బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని స్పష్టం అవుతుందని ధర్మాసనం పేర్కొంది. చాలాకాలంగా వ్యాజ్యం కొనసాగుతున్న కేసులలో పక్షాల మధ్య సంబంధాలను తెంచుకోవడం ఆ పక్షాలకూ, సమాజానికీ శ్రేయస్కరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భార్య దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ, ధర్మాసనం ఆ దంపతుల వివాహాన్ని రద్దు చేసింది.

# బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ది ఆదివాసీ వ్యతిరేక మనస్తత్వం

'జల్, జంగల్ ఔర్ జమీన్' హక్కులను దూరం చేయాలని కుట్రలు చేస్తున్నారు

రాహుల్‌గాంధీ ఫైర్



**న్యూఢిల్లీ :** బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై లోక్‌సభలో ప్రతిపక్షనేత తీవ్ర విమర్శలు చేశారు. వాటికి ఆదివాసీ వ్యతిరేక మనస్తత్వం ఉందని ఆరోపించారు. గిరిజనుల 'జల్, జంగల్ ఔర్ జమీన్' (నీరు, అడవులు, భూమి) హక్కులను వారికి దూరం చేయాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం ఆదివాసీ కాంగ్రెస్ ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం గాంధీ సోషల్ మీడియా పోస్ట్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. బిర్సా ముండాకు నివాళులర్పించిన అనంతరం, ఆదివాసీ ప్రొఫెషనల్స్ కాన్‌క్లేవ్ 2026లో జరిగిన సభను ఉద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ఆయన గిరిజనులకు సంబంధించిన సమస్యలపై కూడా చర్చించారు. ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీకి ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రాంత్ భూరియా సంప్రదాయ ఆదివాసీ తలపాగాను బహూకరించారు. 'ఆదివాసీలే భారతదేశానికి అసలైన సంరక్షకులు. భారతదేశ చారిత్రక చైతన్యం, వివేకం వారిలోనే మూర్తీభవించాయి. ఇదే నిజం' అని హిందీలో చేసిన ఒక ఫేస్‌బుక్ పోస్ట్‌లో రాహుల్ పేర్కొన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల ఆదివాసీ వ్యతిరేక మనస్తత్వం, మిమ్మల్ని వనవాసులు అని ముద్రవేసి, 'జల్, జంగల్, ఔర్ జమీన్ (నీరు, అడవులు, భూమి) అనే మీ హక్కులను హరించాలని చూస్తున్నాయన్నారు. 'కాంగ్రెస్ పార్టీ, నేను మీ హక్కులను గౌరవిస్తాము. వాటిని పరిరక్షించడానికి ప్రతి అడుగు ముందుకు వేయడానికైనా, ప్రతి పోరాటానికీ సిద్ధంగా ఉన్నాము' అని రాహుల్ గాంధీ భరోసానిచ్చారు.

**కరుణానిధికి కాంగ్రెస్ నివాళి :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. తమిళ ప్రజల గౌరవం కోసం, సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన తన జీవితాన్ని పోరాడుతూ గడిపారని రాహుల్ గాంధీ అన్నారు. 'కళైజ్ఞర్' అని కూడా పిలువబడే కరుణానిధి జయంతి సందర్భంగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఆయనకు నివాళులర్పించారు. ఆయన తమిళనాడు ప్రజల ఆరాధ్య నాయకుడని ఖర్గే పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, హేతుబద్ధమైన ఆలోచన, ప్రజాస్వామ్య విలువల పట్ల కరుణానిధి జీవితకాల నిబద్ధత అసంఖ్యాకమైన జీవితాలను మార్చిందని ఖర్గే అన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్‌ను ట్యాగ్ చేస్తూ, 'కళా, సాహిత్యం సహా ప్రజా జీవితానికి కళైజ్ఞర్ కరుణానిధి చేసిన అపారమైన సేవను ఎప్పటికీ ప్రగాఢమైన గౌరవంతో గుర్తుంచుకుంటారు' అని ఖర్గే అన్నారు. కరుణానిధి కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాదని, ఆయన ఒక రచయిత, కవి, మేధావి అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# సిగ్గు లేకుండా పదవినే అంటిపెట్టుకున్నారు

ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ :** సిబిఎస్‌ఇ ఒఎస్‌ఎం వివాదంపై విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ బుధవారం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. మంత్రి ప్రధాన్ తన పదవిలో సిగ్గులేకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. ఆయన మంత్రిత్వ శాఖలో అసమర్థత, అవినీతికి ఆధారాలు ఉన్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను ఎందుకు కాపాడాలని పట్టుబడుతున్నారని ప్రశ్నించింది. మంత్రి ప్రధాన్ అవినీతిమయమైన, అసమర్థమైన, నిర్లక్ష్యపూరితమైన విద్యా మంత్రిత్వ శాఖను నడుపుతున్నారని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ ఆరోపించారు. సిబిఎస్‌ఇ నాయకత్వాన్ని బదిలీ చేసి ఉండవచ్చు, కానీ తన మంత్రిత్వ శాఖ అసమర్థత, అవినీతికి సంబంధించిన ఆధారాలు పేరుకుపోతున్నప్పటికీ మంత్రి ప్రధాన్ సిగ్గులేకుండా తన పదవిని అంటిపెట్టుకుని ఉన్నారని రమేశ్ ఎక్స్‌లో మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా టెండర్‌లోని అవినీతిని మొదట వెలుగులోకి తెచ్చిన 18 ఏళ్ల విద్యార్థి సార్థక్ సిద్ధాంత్ వాంగ్మూలం విన్న తర్వాత, దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ విద్యా స్థాయీ సంఘం లేవనెత్తిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్‌ఎం) సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు సిబిఎస్‌ఇ సమాధానం ఇవ్వలేకపోయిందని మీడియా నివేదికల ద్వారా తమకు తెలిసినట్లు రమేశ్ పేర్కొన్నారు.

ఇది సిబిఎస్‌ఇ, విద్యా మంత్రిత్వ శాఖ అత్యున్నత స్థాయిలో జవాబుదారీతనం స్పష్టంగా లోపించడమేనని ఆయన ఆరోపించారు. సిబిఎస్‌ఇ తన ఒఎస్‌ఎం వ్యవస్థ కోసం నిర్వహించిన డ్రై రన్‌పై ఒక ఆంగ్ల దినపత్రిక జరిపిన దర్యాప్తును ఉటంకిస్తూ, ఆ డ్రై రన్‌లో పాల్గొన్న పలువురు ఈ వ్యవస్థపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని, అందులోని లోపాలను సరిదిద్ది, మూల్యాంకకులందరికీ శిక్షణ ఇచ్చే వరకు దీనిని అమలు చేయడాన్ని వాయిదా వేయాలని సిబిఎస్‌ఇని కోరారని ఆ దర్యాప్తులో వెల్లడైందని రమేశ్ తెలిపారు. ఒఎస్‌ఎం అమలును వాయిదా వేయాలన్న సలహాను పాటించకపోవడమే కాకుండా, పాల్గొన్నవారు ఎత్తి చూపిన అనేక నిర్దిష్ట సమస్యలను పరిష్కరించడంలో కూడా సిబిఎస్‌ఇ విఫలమైందన్నారు. ఆన్‌స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్ వివాదం నేపథ్యంలో ఇద్దరు ఉన్నత సిబిఎస్‌ఇ అధికారులను బదిలీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ మంగళవారం కంటితుడుపు చర్యగా, కప్పిపుచ్చే ప్రయత్నంగా అభివర్ణించింది. ప్రధాన్‌ను తొలగించి, తక్షణమే స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

12వ తరగతి పరీక్షల ప్రక్రియ కోసం డిజిటల్ మూల్యాంకన వ్యవస్థలో జరిగిన అవకతవకల ఆరోపణల నేపథ్యంలో సిబిఎస్‌ఇ చైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాన్షు గుప్తాను జాతీయ విద్యా బోర్డు నుండి బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు.

# సెక్షన్ 301 విచారణపై అమెరికాతో సంప్రదింపులు

వాషింగ్టన్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా కృషి : కేంద్రం



**న్యూఢిల్లీ :** వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులను నిషేధించడంలో విఫలమైన భారత్ సహా 60 దేశాలపై అదనపు సుంకాలు విధించాలని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అమెరికా ప్రభుత్వాన్ని ప్రతిపాదించడంపై భారత్ స్పందించింది. వెట్టిచాకిరి చేసే కార్మికులు, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై సెక్షన్ 301 ప్రొసీడింగ్స్ విషయంలో భారత్ అమెరికాతో సంప్రదింపులు జరుపుతోందని పేర్కొంది. అదే సమయంలో వాషింగ్టన్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా కృషి చేస్తోందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటన చేసింది. భారత్‌తో సహా 60 దేశాలపై తీసుకున్న చర్యలకు సంబంధించి యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ దర్యాప్తును పూర్తి చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దర్యాప్తుల అనంతరం 1974 నాటి యుఎస్ వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 ప్రకారం ఈ 60 దేశాల దిగుమతులపై అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రభుత్వాన్ని ప్రతిపాదించిందని పేర్కొంది. అయితే ఇప్పటికే సెక్షన్ 232 సుంకాల పరిధిలోకి వచ్చే ఉత్పత్తులతో పాటు, మరికొన్ని ఇతర వర్గాలను ఈ ప్రతిపాదిత చర్యల నుంచి మినహాయించిందని స్పష్టం చేసింది. 'సెక్షన్ 301 ప్రొసీడింగ్స్‌పై దర్యాప్తు విషయంలో అమెరికాతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2న ప్రకటించినట్లుగా, ఫిబ్రవరి 7 విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనకు అనుగుణంగా ఒక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కూడా భారత్ సమాంతరంగా అమెరికాతో సంప్రదింపులు జరుపుతోంది. సెక్షన్ 301 కింద యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రతిపాదిత టారిఫ్‌లు ఇంకా ఖరారు కాలేదు. ఆయా దేశాలు 2026 జూన్ 22 వరకు తమ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనడానికి అభ్యర్థనలను యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు సమర్పించవచ్చు. లిఖితపూర్వక అభ్యర్థనలను 2026 జులై 6 వరకు సమర్పించవచ్చు.

**మూడు నెలల క్రితమే దర్యాప్తు ప్రారంభం :** వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన వస్తువులను దిగుమతి చేయడం, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై ఇండియా సహా 60 దేశాలపై 2026 మార్చి 11, 12 తేదీలలో రెండు వేర్వేరు సెక్షన్ 301 విచారణలను యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రారంభించింది. ఈ క్రమంలో జూన్ 2న కీలక నిర్ణయం తీసుకుంది. వెట్టిచాకిరీ కార్మికులు విషయంలో తన దర్యాప్తు వివరాలను విడుదల చేసింది. 60 దేశాలపై అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకొంది. 54 దేశాలపై 12.5శాతం, ఆరు దేశాలపై 10 శాతం సుంకాలను విధించాలని ట్రంప్ సర్కార్‌ను కోరింది. ఈ మేరకు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ ఓ ప్రకటన చేశారు.

## రూ.7,597 కోట్ల ఖర్చుతో

# తెలంగాణలో రెండు ఎన్‌హెచ్‌ల విస్తరణ

ఆర్మూర్–మంచిర్యాల రహదారి విస్తరణ

జగిత్యాల–కరీంనగర్‌కు నాలుగులైన్ల దారి

కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం

గంటకు 100 కి.మీ వేగంతో ప్రయాణానికి డిజైన్

గణనీయంగా కలిసిరానున్న సమయం



**న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రానికి రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టుల విస్తరణ, నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం తీర్మానం చేసింది. మొత్తం 190.76 కిలోమీటర్ల నిడివి గల రహదారులను రూ.7,597.16 కోట్లతో నిర్మిస్తారు. రోజు రోజుకూ విపరీతంగా రద్దీ పెరిగిపోతున్న అర్మూర్–మంచిర్యాలమధ్య 63వ నెంబరు జాతీయ రహదారిని ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంలో 'హ్యామ్' (హైబ్రీడ్ యాన్యుటీ మోడల్) పద్ధతిలో విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. అదేవిధంగా జగిత్యాల–కరీంనగర్ మధ్య 563వ నెంబరు జాతీయ రహదారిని కూడా ప్రైవేటు రంగంలో నిర్మించి నిర్వహించి ఆ తర్వాత తిరిగి ప్రభుత్వానికి అప్పగించే బిఓటి పద్ధతిలో నాలుగులైన్ల రహదారిని ప్రామాణిక పద్ధతులలో నిర్మించేందుకు మొత్తం రెండు ప్రాజెక్టులకు కలిపి రూ.7,597 కోట్లు కేటాయిస్తూ కేంద్ర ఆర్థిక వ్యవహారాలపై నియమించిన మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంలో ఈ తీర్మానం చేశారు. ఈ రహదారుల విస్తరణ, నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వస్తే, ఆర్మూరు–మంచిర్యాల మధ్య గంటన్నర ప్రయాణ సమయం తగ్గిపోతుంది. అదేవిధంగా జగిత్యాల–కరీంనగర్ మధ్య ప్రయాణ దూరం కూడా 45 నిమిషాలు తగ్గిపోతుంది. ఈ మార్గాలలో రోజు రోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోంది. ఈ రహదారులు అందుబాటులోకి వస్తే రద్దీ తగ్గిపోవడమే కాకుండా ప్రయాణ వేగ పెరుగుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గుతుంది. కార్బన్ ఉద్గారాల వెల్లువ, వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా తగ్గిపోతాయని మంత్రివర్గ సమావేశం అనంతరం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం తెలియజేసింది. ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల సెక్షన్‌లో విస్తరణ పథకం కింద నిర్మించే ఈ ప్రాజెక్టులో నిజామాబాద్,జగిత్యాల,మంచిర్యాల జిల్లాల మీదుగా రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ రహదారి మార్గంలో అంక్సాపూర్,కోరుట్ల, జగిత్యాల,ధర్మపురి,లక్సెట్టిపేట,మంచిర్యాల వంటి ప్రాంతాలలో అనేక నివాసిత ప్రాంతాలు ఉండటంవల్ల ప్రస్తుతం ఈ మార్గంలో తీవ్రమైన వాహనాల రద్దీ ఉంది. ఈ కొత్త నిర్మాణం వల్ల రద్దీ పూర్తిగా తగ్గిపోతుంది. కొత్త అవకాశాలతోపాటు సామాజిక అభివృద్ధికి ఈ మార్గం బాటలు వేస్తుందని కేంద్రం ప్రకటన పేర్కొంది. అదేవిధంగా జగిత్యాల–కరీంనగర్ సెక్షన్‌లో నిర్మించే మార్గం చాలా తీవ్రమైన రద్దీగా ఉండే జగిత్యాల,పోతారం,గంగాధర,కరీంనగర్ ప్రాంతాలమీదుగా వెళుతుంది. నాలుగులైన్ల రహదారికింద దీనిని నిర్మిస్తారు. ఓపెన్ టోలింగ్‌తో ఈ రహదారి నిర్మాణం ఉంటుంది. గంటకు 100 కి.మీ వేగంతో ప్రయాణించడానికి వీలుగా ఈ మార్గాలను నిర్మిస్తారు. దీనివల్ల ప్రయాణ సామర్థ్యం

**విమాన ఇంధన ధర స్థిరీకరణకు రూ.10వేల కోట్ల కేంద్ర నిధి :**

విమాన ఇంధన ధరలను స్థిరీకరించడానికి కేంద్ర ప్రభుత్వం రూ.10,000 కోట్లతో ఒక నిధిని సమకూర్చింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఒక తీర్మానం చేసింది. ఈ నిధి వల్ల విమాన ప్రయాణికులపై ఈ సంక్షోభకాలంలో ఛార్జీల భారీలు పడవు. విమాన సంస్థలు కూడా జెట్ ఫ్యూయల్ కొనుగోలు చేసేందుకు భారీ ఎత్తున డబ్బులు సమకూర్చాల్సిన అవసరం లేదు. స్థిరమైన ధరలకే ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు. అదేవిధంగా ముఖ్యంగా విమానయాన రంగంలో ఉన్న 77 లక్షలమంది ఉద్యోగులకు పూర్తి భద్రత లభిస్తుంది. వారి ఉద్యోగాలకు యజమానులవల్ల ఎలాంటి హానీ కలగదు. ఈ నిధి కింద ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు (ఓఎంసిలు) రూ.10,000 కోట్ల మేరకు వడ్డీలేని అడ్వాన్సులు సమకూరుస్తారు. ఈ ధనాన్ని ఉపయోగించి ఓఎంసి చమురు కంపెనీలు విమానయాన సంస్థలకు ఎలాంటి అధిక ధరలు లేకుండా స్థిరమైన ధరల్లోనే ఎటిఎఫ్‌ను సరఫరా చేస్తాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరిగితే కంపెనీలకు ఆర్థిక సహాయం ఇచ్చి లోటు భర్తీ చేస్తారు. ఆ తర్వాత ఈ ధనాన్ని ఓఎంసిల నుండి తిరిగి రాబట్టి సర్దుబ్లా ద్వారా వివిధ అకౌంట్లలో జమ చేస్తారు.

**రూ.4,415,60 కోట్లతో మధ్యప్రదేశ్‌కు రెండు హైవే ప్రాజెక్టులు :**

మధ్యప్రదేశ్‌లో రూ.4,415.60 కోట్లతో రెండు రహదారి ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ప్రస్తుం ఉన్న రహదారులను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టుల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టారు. హివఖ్కేడీ–రోష్నీ–ఆషాపూర్–రూఢీ సెక్షన్‌లో ప్రస్తుతం రెండు లైన్లలో ఉన్న 347 బి జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా చేసేందుకు విస్తరణ చేపడతారు. దేశ్‌గాయన్–జుల్వానియా సెక్షన్‌లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో రహదారిని అభివృద్ధి చేస్తారు. ఇదలా ఉండగా, బీహార్‌లోని ఖగారియా–పూర్ణియా సెక్షన్‌లో 31వ నెంబరు జాతీయ రహదారి, 231వ నెంబరు జాతీయ రహదారులను కూడా బిఓటి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర మంత్రివర్గం రూ.3,936.05 కోట్లు కేటాయించింది. అదేవిధంగా ఒడిసాలోని రామేశ్వర్–పారదీప్ కోస్తా ప్రాంత జాతీయ రహదారి నిర్మాణానికి రూ.8,300.79 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో తీర్మానం చేసింది. ఈ కొత్త కోస్తా ప్రాంత జాతీయ రహదారి నిర్మాణం 160.18 కి.మీ నిడివితో నిర్మిస్తారు.ఈ మార్గం ఖుర్దా,పూరీ,కేంద్రపద,జగత్సింగ్‌పూర్ జిల్లాలమీదుగా వెళుతుంది. అదేవిధంగా ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లో గాలి కాలుష్యాన్ని తగ్గించే ఉద్దేశంతో ఈ ప్రాంతాన్ని శుద్ధంగా మార్చేందుకు వీలుగా పాత లారీలు,బస్సుల స్థానంలో కొత్తవి తీసుకునేందుకు వీలుగా ఒక కొత్త పథకాన్ని కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. ఈ పథకం కింద పాత లారీలు,బస్సుల యజమానులకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. వారి వాహనాలు మార్చుకోవడం ద్వారా ఈ ప్రోత్సాహకాలు లభిస్తాయి. దీనివల్ల హర్యానా,రాజస్థాన్,ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో దాదాపు 1.91 లక్షల లారీలు, 16,329 బస్సుల యజమానులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకం కింద రూ.9,585 కోట్లు ఖర్చు చేస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.5,041 కోట్లు, రాష్ట్రాలు రూ.1,601 కోట్లు పన్ను రాయితీలను ఇస్తాయి.



## పునఃమూల్యాంకనం కోసం 44 వేల మంది దరఖాస్తు

సిబిఎస్‌ఇ ప్రకటన

**న్యూఢిల్లీ :** బోర్డు పరీక్షల ధృవీకరణ, పునఃమూల్యాంకన సౌకర్యాన్ని దాదాపు 44,000 మంది విద్యార్థులు వినియోగించుకుని బుధవారం ఉదయం వరకు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ) తెలిపింది. జవాబు పత్రాల ధృవీకరణ, పునఃమూల్యాంకనం కోసం ఆన్‌లైన్ పోర్టల్‌కు మొత్తం 43,980 దరఖాస్తులు అందినట్లు బోర్డు పేర్కొంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు, ధృవీకరణ కోసం 4,924 దరఖాస్తులను, పునఃమూల్యాంకనం కోసం 39,056 దరఖాస్తులను (మొత్తం 43,980) పోర్టల్ స్వీకరించినట్లు బుధవారం ఎక్స్ పోస్ట్‌లో సిబిఎస్‌ఇ తెలిపింది. ధృవీకరణ, పునఃమూల్యాంకన పోర్టల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్ పేమెంట్ గేట్‌వేలు అందుబాటులో ఉన్నాయని, చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయడానికి విద్యార్థులకు ఈ బ్యాంకుల్లో ఖాతా ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంది. చెల్లింపు పూర్తి చేయడానికి విద్యార్థులకు ఈ బ్యాంకుల్లో ఖాతా ఉండాల్సిన అవసరం లేదు, కానీ చెల్లింపులు చేయడానికి ఈ పేమెంట్ గేట్‌వేలలో దేనినైనా ఉపయోగించుకోవచ్చని అని బోర్డు తెలిపింది. అభ్యర్థులు నిర్దేశిత గేట్‌వేల ద్వారా యుపిఐ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్‌తో సహా ఆన్‌లైన్ చెల్లింపు పద్ధతులను ఉపయోగించుకోవచ్చని అది తెలిపింది. జవాబు పత్రాల ధృవీకరణ, పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తుల స్వీకరణ మే 29 నాటికి ప్రారంభమవుతుందని సిబిఎస్‌ఇ గతంలో చెప్పినప్పటికీ, ఆలస్యంగా ఈ పోర్టల్ ప్రారంభించబడింది. బోర్డు ఉపయోగిస్తున్న ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్‌ఎం) విధానంపై కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

## ఆరావళి నిర్వచనం పున:పరిశీలనకు

# 'సుప్రీంకోర్టు' ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ

చైర్మన్‌గా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్ కంచన్‌దేవి నేతృత్వం

ఆగస్టు 31లోగా సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ :** ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణపై కేంద్రం ఇచ్చిన నివేదికను స్వతంత్రంగా సమీక్షించేందుకు సుప్రీంకోర్టు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. అలాగే ఆ నివేదికలోని అంశాలలో ఉన్న 'తీవ్రమైన 'అస్పష్టతలను' సరిదిద్దాలని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆ కమిటీని ఆదేశించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసిఎఫ్‌ఆర్‌ఇ) డైరెక్టర్ జనరల్ కంచన్‌దేవి నేతృత్వంలోని కమిటీకి 2026 ఆగస్టు 31లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఇఎఫ్‌సిసి) కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ రూపొందించిన అక్టోబరు 2025 నివేదిక అమలుపై డిసెంబరు 29న సుప్రీంకోర్టు స్టే విధించిన కొన్ని నెలల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. తాజా శాస్త్రీయ, పర్యావరణ అంచనాను చేపట్టడానికి, ఆయా రంగాల నిపుణులతో కూడిన ఒక స్వతంత్ర సంస్థ అవసరాన్ని అప్పుడు కోర్టు నొక్కి చెప్పింది. ఆరావళి పర్యావరణ వ్యవస్థ పరిరక్షణకు సంబంధించిన అనేక వివాదాస్పదమైన సమస్యలపై ఖచ్చితమైన మార్గదర్శకం అందించడానికి, సంబంధించిన భాగస్వాములు అందరినీ సంప్రదించిన తర్వాత 'నిష్పాక్షికమైన, స్వతంత్ర నిపుణుల అభిప్రాయం అవసరం' అని కోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్వయం ప్రతిపత్తిగల సంస్థ అయిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్) 1991 బ్యాచ్‌కు చెందిన ఆఫీసర్ కంచన్ దేవి, కొత్తగా ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీకి పదవిరీత్యా అధ్యక్షత వహిస్తారు. ఈ ఉన్నత స్థాయి కమిటీలో ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుభాష్ అశుతోష్, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ శర్మ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మాజీ జాయింట్ సెక్రటరీ బ్రిజ్ మోహన్ సింగ్ రాథోర్, ఢిల్లీ యూనివర్సిటీ బోటనీ డిపార్ట్‌మెంట్ మాజీ అధిపతి ప్రొఫెసర్ అశోక్ కె.భట్నాగర్ సభ్యులుగా ఉన్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్‌కు చెందిన ప్రొఫెసర్ జగదీష్ క్రిష్ణస్వామి, హర్యానాలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ లక్ష్మికాంత్ శర్మను ప్రత్యేక ఆహ్వానితులుగా, అవసరమైనప్పుడు చైర్ పర్సన్ ద్వారా కమిటీ పనిలో అసోసియేట్ చేయవచ్చు. కమిటీకి సభ్య కార్యదర్శిగా పనిచేయడానికి డైరెక్టర్ హోదాలో ఉన్న అధికారిని నామినేట్ చేయాలని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖను ఆదేశించడం జరిగింది. అక్టోబరు 2025 నివేదిక నుంచి తలెత్తిన అనేక కీలక ప్రశ్నలను పరిశీలించే బాధ్యతను హెచ్‌పిసికి అప్పగించారు. ఆరావళి వ్యవస్థపై సమగ్రమైన, శాస్త్రీయ భూగర్భ శాస్త్ర పరిశోధన అవసరం అయ్యేంత ముఖ్యమైన లోపాలు ప్రస్తుత నియంత్రణ యంత్రాంగాలలో ఉన్నాయో లేదో ఈ కమిటీ మరింతగా మూల్యాంకనం చేస్తుంది. కోర్టు ముందు పక్షాల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం హెచ్‌పిసి ఏర్పాటు చేయబడింది. మే 25న జరిగిన చివరి విచారణ సందర్భంగా అమికస్ క్యూరీ, సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సిఇసి) సమర్పించిన సిఫారసులలో పేరు ఉన్న నలుగురు నిపుణులను ప్రతిపాదిత ప్యానెల్‌లో చేర్చవచ్చని, ఐసిఎఫ్‌ఆర్‌ఇ డిజి దీనికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని కేంద్రం ధర్మాసనానికి తెలియజేసింది.

SHRIRAM Finance

## వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS02FD7868 | Elabadri Bharath | SWARAJ 742FE | 2020 |
| 2 | TS07UG7399 | Supriya Burra | TATA SIGNA 3718 FBT-T | 2019 |
| 3 | TS03UA5999 | NUNAVATH RAMESH | LPT3118 | 2014 |
| 4 | TS25T8379 | RAKESH ASHADAPU | 4220 | 2023 |
| 5 | TS17E8037 | BOINI SATHEESH | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2019 |
| 6 | AP36TA8799 | Supriya Burra | TATA LPT 3118 CUMMINS FBT | 2012 |
| 7 | TS03UA3879 | GOPAL TOLAM | TATA LPT 3118 CUMMINS FBT-T | 2014 |
| 8 | TS02FG5052 | Govindula Suresh | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2014 |

AUCTION DATE : 06-06-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
1st Floor H.No. 6-159, Above DCC Bank Reddy Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District - 506169.
Cell : 9849981545, 9949340057

# రష్యాపై ఉక్రేన్ భారీ ప్రతీకార దాడి

## ఏడుగురు మృతి

## కీవ్‌లో నాటో అధిపతి ఆకస్మిక పర్యటన



**మాస్కో :** రష్యాపై ఉక్రేన్ బుధవారం ప్రతీకార దాడులకు దిగింది. ఈ ప్రతీకార దాడుల్లో ఏడుగురు మరణించారు. రష్యా నియంత్రణలో ఉన్న క్రిమియా ప్రాంతంలో రహదారిపై వెళుతున్న బస్సుపై ఉక్రేన్ ప్రయోగించిన డ్రోన్ ఢీకొంది. ఈ దాడిలో బస్సులో ఏడుగురు ప్రయాణికులు మరణించారు. మరో 11 మంది గాయపడ్డారు. అదేవిధంగా వ్లాదిమీర్ పుతన్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం సమావేశాన్ని బుధవారం ప్రారంభిస్తున్న తరుణంలో ఉక్రేన్ డ్రోన్లు రష్యా భూభాగంలోకి చొచ్చుకువెళ్ళి సెయింట్ పీటర్స్ బర్గ్ చుట్టుపక్కల ప్రాంతాలపై దాడులు చేసి తీవ్ర నష్టం కలిగించింది. ఐతే వందలాది డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా సైన్యం ప్రకటించింది. ప్రపంచ వ్యాపార నాయకులకు ఆర్థిక సమస్సుకు రష్యా ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో ఉక్రేన్ దాడి జరిగింది. రాత్రికి రాత్రే 350 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా సైనిక వర్గాలు ప్రకటించాయి. రష్యా నియమించిన తూర్పు డోనెట్స్క్ నాయకుడు డెనిస్ పుష్లిన్ మాట్లాడుతూ, రష్యా నియంత్రణలో ఉన్న క్రిమియాలోని సింఫెరోపోల్ నుండి మాస్కోకు ప్రయాణిస్తున్న బస్సుపై బుధవారం తెల్లవారుజామున ఉక్రేన్ డ్రోన్ దాడి చేసిందని చెప్పారు. మంగళవారం ఉక్రేన్‌లో పౌర ప్రాంతాలపై రష్యా దాడులు చేయడంతో ఇప్పుడు తాజాగా ఉక్రేన్ కూడా పౌరుల వాహనంపై డ్రోన్ దాడి చేసి ప్రతీకారానికి పాల్పడింది. నిన్న రాత్రి రష్యాలోని ముఖ్యమైన మౌలిక సదుపాయాలపై డ్రోన్ దాడులు చేసినట్లు ఎక్స్ వేదికగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పోస్టింగ్ పెట్టారు. అదేవిధంగా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఆయిల్ టర్మినల్‌పై నుండి నల్లటి పొగలు పైకి లేస్తున్న చిత్రాలను కూడా ఆయన షేర్ చేశారు. రష్యా టాంబోవ్ ప్రాంతంలో ఉన్న లక్ష్యాలపై కూడా తమ దళాలు దాడులు చేశాయని ఆయన ప్రకటించారు. అదేవిధంగా దక్షిణ ఖేర్సన్ ప్రాంతంలో రష్యా రాత్రిపూట జరిపిన దాడిలో ఒక వృద్ధురాలు మరణించింది. విభిన్న ప్రాంతాలలో రష్యా 198 డ్రోన్లు ప్రయోగించగా వాటిల్లో 189 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రేన్ సైనిక దళం ప్రకటించింది. ఇదిలా ఉండగా, మంగళవారం ఉక్రేన్‌లో ప్రధానంగా కీవ్ నగరంలో రష్యా చేసిన మహోగ్ర దాడులను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో ఒక తల్లీ బిడ్డా సహా 22 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఇలాంటి దాడులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. మరోవైపు పశ్చిమ దేశాలకు కూడా రష్యా చేసిన దాడిని ఖండించాయి. ఉక్రేన్‌కు సంఘీభావం ప్రకటించగా, నాటో కూటమి అధిపతి మార్క్ రుట్టో బుధవారం ఆకస్మికంగా ఉక్రేన్ రాజధాని కీవ్ నగరంలో పర్యటించారు. బహుశా యుద్ధ సహాయం, ఆయుధ సహాయం గురించి వారు చర్చలు జరుపుతారని అంచనావేస్తున్నారు. పశ్చిమాసియా దేశాలు ఇప్పటికే ఉక్రేన్‌కు ఆయుధ సహాయం చేసేందుకు అంగీకరించాయి. బెల్గొరోడ్, కుర్క్స్,ఇతర పశ్చిమ ప్రాంతాలతోపాటు మాస్కో సమీపంలోని అజోవ్ సముద్రంపై ఉక్రేన్ డ్రోన్‌లను కూల్చివేశామని రష్యా సైనిక అధికారులు చెప్పారు. మాస్కోకు వాయువ్యంగా లెనిన్‌గ్రాడ్ సమీపంలో 50 డ్రోన్‌లను కూల్చివేసినట్లు ఆ ప్రాంత గవర్నర్ అలెగ్జాండర్ డ్రోజ్ డెంకో చెప్పారు.

# వెనిజులా అధ్యక్షురాలు డెల్సీ భారత్ పర్యటన

## ద్వైపాక్షిక బంధంకోసం



**కారకస్:** వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ ఎలోయినా రోడ్రిగ్జ్ గోమెజ్ బుధవారం భారతదేశ పర్యటన ప్రారంభించారు. ఈ పర్యటనలో అమె ప్రధానమంత్రి మోదీతో ముఖాముఖీ సంభాషణలు జరుపుతారు. ప్రపంచంలో చమురు దిగుమతి చేసుకునే దేశాలలో మూడవ అతిపెద్దదేశం భారత్ ఇటీవలికాలంలో వెనిజులా నుండి చమురు దిగుమతిని ఉద్ధృతం చేసింది. పశ్చిమాసియాలో యుద్ధం,ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో వెనిజులా నుండి భారత్ కొనుగోళ్ళు పెంచింది. భారత్ తన అవసరాలకోసం 90 శాతం చమురును ఇతర దేశాల నుండే దిగుమతి చేసుకుంటున్నది. మే నెలలో భారత్ ముడి చమురు దిగుమతుల్లో వెనిజులా ఐదవ అతిపెద్ద వనరుగా మారింది. కెప్లెర్ గణాంకాల ప్రకారం ఏప్రిల్,మేనెలల్లో భారతదేశం రోజుకు 2.80 లక్షల బ్యారెళ్ళ ముడిచమురు దిగుమతి చేసుకుంది. జూన్‌నెలలో ఈ దిగుమతులు మూడు లక్షల బ్యారెళ్ళకు పెరుగుతాయన అంచనావేస్తున్నారు. డెల్సీ రోడ్జిగ్జ్ జూన్ ఏడో తేదీ ఆదివారం వరకూ భారత్‌లో పర్యటిస్తారు. ఇంధనం,వాణిజ్యం,పెట్టుబడులు,పునరుత్పాదన వనరులు,ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆమె ఈ పర్యటనను ఉపయోగించుకుంటున్నారు. ఇంధనం,పెట్టుబడి రంగాలలో వెనిజులా మనదేశానికి ముఖ్యభాగస్వామిగా ఉంది. ఆమె భారతదేశంలో పర్యటించడం ఇది ఆరోసారి. ఈసారి అమె దేశాధ్యక్షురాలి హోదాలో పర్యటిస్తున్నారు. 2015,2023 ,024,2025 సంవత్సరాలలో ఆమె భారత్‌లో అధికారిక పర్యటనలు చేశారు.



# దక్షిణ బీరూట్‌లో ఇజ్రాయెల్ దాడులు

**బీరూట్ :** లెబనాన్‌లో దాడులపై పెద్ద రగడ జరిగిన తర్వాత కూడా ఇజ్రాయెల్ తన దాడులను ఆపలేదు. ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేసిన తర్వాత రెండోరోజు బుధవారం కూడా దక్షిణ బీరూట్‌లో ఇజ్రాయెల్ తన దాడులు కొనసాగించింది. ఒకవైపు వాషింగ్టన్‌లో లెబనాన్–ఇజ్రాయెల్ దౌత్యవేత్తలమధ్య నాలుగోవిడత సంప్రదింపులు జరుగుతున్న సమయంలోనే ఈ దాడులు జరగడం అందరికీ ఆగ్రహం కలిగిస్తోంది. ఖాదెహ్ ప్రాంతంలో ఎలాంటి ముందస్తు హెచ్చరికలూ లేకుండానే ఇజ్రాయెల్ సైనికులు దాడులు చేశారు. ఐతే ఇక్కడ మరణాలు సంభవిచాయా?లేదా? అనే విషయం వెంటనే తెలియలేదు. ఇప్పటి వరకూ ఇజ్రాయెల్ 8000 మంది హెజ్బొల్లా ఉగ్రవాద సైనికులను నిర్మూలించింది. అమెరికా మధ్యవర్తిత్వం ద్వారా సోమవారం ఇజ్రాయెల్–లెబనాన్ రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయి. కానీ ఐడిఎఫ్ దానిని పదే పదే ఉల్లంఘించింది. దీంతో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూపై ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నువ్వొక పిచ్చోడివి, నేను నిన్ను కాపాడుతున్నాను, నేను లేకపోతే ఈ పాటికి నువ్వు జైలులో ఉండేవాడివి అని తీవ్రస్థాయిలో నెతన్యాహూపై ట్రంప్ విరుచుకుపడ్డారు. ఆ తర్వాత కూడా దాడులు జరుగుతున్నాయి. ఏప్రిల్ 17 నుండి ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ అదొక అవహేళనగా మారింది. ఇజ్రాయెల్ దాడులు ఆపడంలేదు. మార్చి రెండో తేదీన లెబనాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 3,468 మంది మరణించారు. మరో 12 లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

# థక్షిన్ షినవత్రకు క్షమాభిక్ష : త్వరలో విడుదల



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ మాజీ ప్రధానమంత్రి థక్షిన్ షినవత్ర (77)త్వరలో జైలు నుండి విడుదల అవుతారని ఆ దేశ న్యాయశాఖామంత్రి రుత్తఫోన్ నౌవరత్ బుధవారం ప్రకటించారు. ఆయనకు థాయ్ రాజు నుండి క్షమాభిక్ష లభించింది. 2001 నుండి 2006 వరకూ అధికారం నుండి తొలగించే వరకూ ఆయన థాయ్‌లాండ్‌కు 23వ ప్రధానమంత్రిగా సేవలు అందించారు. 2006 సెప్టెంబరులో సైనిక కుట్ర కారణంగా ఆయన ప్రభుత్వం కుప్పకూలిపోయింది. ఆయన రాజకీయ పార్టీ కూడా నిషేధానికి గురైంది. ఎనిమిది నెలలు ఆయన జైలుశిక్ష అనుభవించారు. గతనెల ఆయన పెరోల్‌పై విడుదలయ్యారు. ఇంకా ఆయనకు మూడు నెలలు జైలుశిక్ష మిగిలి ఉంది. జూన్ మూడో తేదీన థాయ్ రాణి సుతిదా పుట్టినరోజు ఉత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిక చేసిన ఖ:దీలకు మహావజిరలోంగ్ కార్న్ క్షమాభిక్ష ప్రకటించారు. ఇందులో దేశ మాజీ ప్రధానమంత్రి షినవత్ర కూడా ఉన్నారు.ఆయన కాలికి జైలు నిబంధనల ప్రకారం ఒక ఎలక్ట్రానిక్ కడియాన్ని బిగించారు. దానిని తొలగించే ప్రక్రియను ఇంకా పూర్తిచేయాల్సి ఉంది. తొలుత ఆయన 15 సంవత్సరాలు స్వచ్ఛంధ ప్రవాసశిక్ష అనుభవించారు.

# లాస్‌ఏంజెల్స్ మేయర్‌గా మళ్ళీ కారెన్ బాస్!

## కౌంటింగ్‌లో 'ఆమే' ముందంజ



**లాస్‌ఏంజెల్స్ :** అమెరికాలో ప్రతిపక్ష డెమోక్రాట్లు అధిపత్యం చెలాయించే కాలిఫోర్నియాపైనే అందరూ ఇప్పుడు దృష్టి కేంద్రీకరించారు. మంగళవారంనాడు కాలిఫోర్నియా గవర్నర్‌పదవి, లాస్ ఏంజెల్స్ మేయర్ పదవికి ఎన్నికలు జరుగుతున్నాయి. కాలిఫోర్నియా గవర్నర్ ప్రైమరీ రేసుకు లెక్కింపు కొనసాగుతోంది. ఇక్కడ అధికార ప్రతిపక్షాలమధ్య హోరాహోరీ పోటీ నెలకుని ఉంది. లాస్ ఏంజెల్స్ మేయర్ ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ విజయం సాధించి దాదాపు 30 సంవత్సరాలు గడచిపోయింది. ఇప్పటివరకూ లాస్‌ఏంజెల్స్‌ను రిపబ్లికన్లు గెలుచుకోలేకపోయారు. దీంతో ఇది ట్రంప్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇక్కడ పోలింగ్ ముగిసి లెక్కింపు కొనసాగుతోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్ మేయర్ దేశంలో అతిఎక్కువ జనాభాగల రెండవ అతిపెద్ద నగరం కానీ ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్ మేయర్ పదవికి కౌంటింగ్‌లో కారెన్ రూత్ బాస్ ముందంజలో ఉన్నారు. ఆమె రెండోసారి మేయర్‌గా ఉండే అవకాశజం ఉంది. ఈ ఎన్నికలు వచ్చే నవంబరులో మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. కారెన్‌బాస్‌కు కాంగ్రెస్‌లో పనిచేసిన రాజకీయ, సామాజిక అనుభవం ఉంది. ఆమె హౌస్ కమిటీల్లో కూడా పనిచేశారు.అదేవిధంగా లాస్‌ఏంజెల్స్. రియాలిటీ టీవీస్టార్, ఆన్‌లైన్ ఇన్ఫ్లుయెన్సర్‌గా ఉంటూ ఆ తర్వాత మేయర్ అభ్యర్థిగా మారిన స్పెన్సర్ ప్రాట్ (42) ఇప్పుడు ప్రజలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఆయన వీడియోలు, ప్రసంగాలు వైరల్ అవుతున్నాయి. 2020లో స్పెన్సర్ ప్రాట్ రిపబ్లికన్‌పార్టీలో చేరినప్పటికీ లాస్‌ఏంజెల్స్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ట్రంప్ ఆయనపై ప్రశంసలు కురిపించారు. ట్రంప్ ఆయనను విలక్షణమైన వ్యక్తిగా, మాగా వ్యక్తిగా అభివర్ణించారు. గత ఏడాది కార్చిచ్చుల్లో 17,000 ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఈ ఇళ్ళు కోల్పోయిన వారిలో ప్రాట్ కూడా ఉన్నారు. దేశవ్యాప్తంగా ప్రైమరీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలు రాబోయే మధ్యంతర ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఈ ఎన్నికలు ట్రంప్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అయోవాలో జరిగే గవర్నర్ ఎన్నిక కూడా ట్రంప్‌కు ప్రతిష్టాత్మాకంగా ఉంది. ఈ పదవి నామినేషన్ కోసం డెమోక్రటిక్‌పార్టీలో సంప్రదాయ ప్రగతిశీల వర్గాల మధ్య పోరాటం కొనసాగుతోంది.

## ప్రజాద్రోహం (మొదటి పేజీ తరువాయి)

వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక దాగి ఉన్న ఎజెండా ఏమిటో ప్రజలకు చెప్పాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని కమ్యూనిస్టులు కోరుకుంటున్నారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎవరో వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలను పెద్దవిగా చేసి, రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాజకీయాలు చేయడానికి ఎవరికైనా హక్కు ఉంటుందని, ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం మాత్రం సమర్థనీయం కాదని, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న సోదరభావాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

**సమస్యలు ఉన్నంత కాలం కమ్యూనిస్టు భావజాలం సజీవమే**

కమ్యూనిజం చచ్చిపోయిందని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం వెనుక ఉద్దేశం ఏమిటని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రజల సమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు భావజాలం సజీవంగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల బాధలకు స్పందించి ప్రశ్నించే ప్రతి మనిషిలో కమ్యూనిస్టు ఆలోచన ఉంటుందని, దానిని ఎవరూ అంతం చేయలేరని వ్యాఖ్యానించారు. గతంలో కమ్యూనిస్టు భావజాలం గురించి మాట్లాడిన పవన్ కళ్యాణ్ ఎర్ర కండువా వేసుకుని ఇప్పుడు కమ్యూనిస్టులనే లక్ష్యంగా చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలతో పొత్తులు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. ప్రజా గాయకుడు గద్దర్‌కు తాము ఎప్పటికప్పుడు అండగా నిలిచామని చెప్పారు. గద్దర్‌కు తానే కారు ఇచ్చానంటూ పవన్‌కళ్యాణ్ ప్రచారం చేసుకోవడం సరికాదని, ప్రజల ప్రేమాభిమానాలే గద్దర్‌ను నిలబెట్టాయన్నారు. ఒక చేత్తో చేసిన సహాయం మరో చేతికి తెలియకుండా చేయాలనే సంస్కారం ఉండాలని సాంబశివరావు సూచించారు.

**నేడు బషీర్‌బాగ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం :** ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై ఏపిలో నమోదు చేసిన అక్రమ కేసులను నిరసిస్తూ గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో మేధావులు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. అధిక ధరలను నిరసనగా ఈ నెల10వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు 45 నియోజకవర్గాల్లో భారీ పాదయాత్రలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 28న వేలాది మందితో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

# మరింత విస్తరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

నాలెడ్జ్ సిటీగా మార్చాయని స్పష్టం చేశారు. వైద్య రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మధ్యప్రాచ్య దేశాలతో పాటు అనేక దేశాల ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. అత్యాధునిక ఆసుపత్రులు, నిపుణులైన వైద్యులు, మెరుగైన ఆరోగ్య మౌలిక వసతులు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు.

**మెడికల్ టూరిజంకు ప్రత్యేక స్థానం**

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించవచ్చని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. గత ఏడాది నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025' భారీ విజయాన్ని సాధించిందని సిఎం గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనడంతో తెలంగాణకు కొత్త పెట్టుబడి అవకాశా లు లభించాయని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షులు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించగా, దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షులు వెంటనే స్పందించి పెద్ద సంఖ్యలో బృందంతో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని చె ప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మెగా ఆసుపత్రులను నిర్మిస్తోందని చెప్పారు. ఆరోగ్య రంగంలో తెలంగాణదక్షిణాఫ్రికా భాగస్వామ్యం ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్‌తో సౌత్ ఆఫ్రికాది చారిత్రక బంధం: పాల్ మషాటిలే**

భారతదేశంతో దక్షిణాఫ్రికాది చారిత్రక బంధమని ఆ దేశ ఉపాధ్యక్షులు పాల్ మషాటిలే అన్నారు. సమావేశం సందర్భం గా ఆయన మాట్లాడుతూ భారత్, దక్షిణాఫ్రికాల మధ్య దశాబ్దాలుగా బలమైన సాంస్కృతిక సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత కంపెనీలు ఆఫ్రికా మార్కెట్లలోకి విస్తరించేందుకు దక్షిణాఫ్రికా కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఫార్మా, ఆరోగ్య రంగాల్లో భారత కంపెనీలకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని, భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో దక్షిణాఫ్రికా అంతర్జాతీయ సంబంధాల ఉపమంత్రి మొరాకా, భారతదేశానికి దక్షిణాఫ్రికా రాయబా రి ఎ.సూక్లాల్, ఆరోగ్య మంత్రి డాక్టర్ ఎ.మోట్సోలేడీ, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ఎండాబేని, విజ్ఞాన సాంకేతిక శాఖ ఉపమంత్రి ఎన్.గినా, కమ్యూనికేషన్స్, డిజిట ల్ టెక్నాలజీ శాఖ ఉపమంత్రి ఎం.గుంగుబెలే తదితరులు పా ల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వై ద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్ డ్రోన్ దాడులు (మొదటి పేజీ తరువాయి)

అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎక్స్‌వేదికగా దౌత్య కా ర్యాలయం తెలియజేసింది. కువైట్ విమానాశ్రయంపై డ్రోన్ దాడుల తర్వాత విమానాశ్రయంలో వాణిజ్య రాకపోకలన్నీ స్తంభించిపోయాయి. ఆ దేశ రక్షణమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ సౌద్ అబ్దుల్ అజీజ్ అల్–ఒతైబీ మాట్లాడుతూ, శత్రుదే శం కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులు బసలచేసే భవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని చెప్పారు. యుద్ధ సమయంలో మూతపడిన ఈ విమానాశ్రయం ఈ సోమవారంనాడే తిరిగి తెరచుకుంది. బహ్రైన్‌లో ఇరాన్ చేసిన దా డులను ఇంటర్‌సెప్టర్స్ ద్వారా అక్కడి సైన్యం అడ్డుకుంది. ఈ దాడుల కారణంగా దౌ త్య సంభాషణలపై తీవ్ర ఒత్తిడి పడింది. ఖర్గ్ ద్వీప సముద్ర జలాలలో వెళుతున్న చము రు ట్యాంకర్‌పై అమెరికా సైనిక బలగాలు ''హెల్ ఫైర్'' క్షిపణి ఉపయోగించి దాడులు చేశాయి. బోట్సువానా జెండాతో ఈ చమురు ట్యాంకర్ ప్రయాణం చేస్తుండగా దాడు లు చేసినట్లు అమెరికా సైనిక దళాల సెంట్‌కామ్ అధికారులు చెప్పారు. యుద్ధం మొదలైన తర్వాత ఈ విధంగా ఆరోనౌకను అమెరికా దళాలు స్తంభింపజేశాయి. ఇప్పటివరకూ 32 నౌకలను జలసంధిలోకి రానీయకుండా వెనక్కు తరిమికొట్టాయి. కువైట్‌లో అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌కు నిలయమైన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులు ప్రయోగించిందని, మూడు క్షిపణులను మార్గమధ్యలోనే ధ్వంసం చేశామని, అనేక డ్రోన్‌లను కూల్చివేశామని సెంట్‌కామ్ ప్రకటించింది. బహ్రైన్,కువైట్‌లలో దాడులకు ప్రతీకారంగా హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఖెష్మ్ ఐలాండ్‌లో ఉన్న భూతల నియంత్ర ణ కేంద్రంపై కూడా అమెరికా దాడులు చేసింది. మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఇరాన్ ప్ర భుత్వం అమెరికాతో సంభాషణలు,చర్చల ప్రక్రియను పూర్తిగా నిలిపివేసిన నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై తిరిగి దాడులు ప్రారంభమైనట్లు ఇరాన్ సెమీ–అఫీషియల్ ఇరాన్ న్యూ స్ ఏజన్సీలు ప్రకటించాయి. దౌత్యమార్గాలను మంగళవారంనాడే మూసివేశామని, యుద్ధం తప్పదని ఇరాన్ ప్రకటించగా, దౌత్యమార్గాలు ఇంకా చాలా క్రియాశీలంగా పని చేస్తున్నారని, చర్చలుజరుగుతున్నాయని, చర్చల ప్రక్రియ సమస్యల్లో పడిందని వచ్చిన నివేదికలు అబద్ధమని, తాను చెప్పిన విధంగా ఇరాన్ ఒక ఒప్పందం చేసుకోవాల్సిన సమయం వచ్చిందని అధ్యక్షుడు ట్రంప్ సోషల్‌మీడియా వేదికగా చెప్పారు. ఐతే లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఒప్పందానికి ఒక ప్రతిబంధకంగా మారాయి. లెబనాన్‌లో దాడులు నిలిపివేయాలని, సైన్యం వెనక్కివెళ్ళిపోవాలని, ముసాయిదా ఒప్పందంలో ఈ అంశం కూడా ప్రధానంగా ఉండాలనేది ఇరాన్ ప్రధాన లక్ష్యంగా ఉంది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగితే ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతం నుండి ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోవాల్సి వస్తుందని,దాడులు చేస్తామని ఇప్పటికే ఇరాన్ హెచ్చరిక చేసింది. అమెరికా చేస్తున్న అలవిమాలిన డిమాండ్ల కారణంగానే చర్చలు పొడిగించాల్సివస్తోందని ఇరాన్ విమర్శించింది. లెబనాన్‌లో విస్తరిస్తున్న యుద్ధం చర్చల ప్రయత్నాలపై తీవ్ర ఒత్తిడి పడుతుండగా, మరోవైపు హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగిస్తోంది.

## విలువలు సవరణ (మొదటి పేజీ తరువాయి)

స్థానిక పరిస్థితులను పరిశీలించి, సవరించిన విలువలను రూపొందించి, ఆమోదించాయని ఆయన పేర్కొన్నారు. ప్రాంతాల అభివృద్ధి సామర్థ్యం, వృద్ధి రేటు, ఇటీవల జరిగిన భూముల వేలాలు, మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కొత్త రహదారులు, వృద్ధి కారిడార్లు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల వి స్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కెట్ విలువలను నిర్ణయించామన్నారు.

**అన్ని అంతస్తులకు ఒకే రేటు:** ఫ్లాట్ల విషయంలో గతంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ అంతస్తుల వారీగా అధిక రేట్లు నిర్ణయించడం వల్ల అసమానతలు ఏర్పడ్డాయని, అలాంటి ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేస్తూ మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదించలేదన్నారు. ఆయా ప్రాంతాల అభివృద్ధి స్థాయిని బట్టి హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ ఎం డిఎ ), క్యూర్ పరిధి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా నిర్ణయించామన్నారు. నిర్మాణ వ్యయాలను కూడా 2021 తర్వాత సవరించలేదని, గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో నిర్మాణ రేట్ల సవరణ అవసరమైందన్నారు.

**'ఆర్‌సిసి,నాన్‌ఆర్‌సిసి'కి సవరణ :** అనేక మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ కావడం, గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సిసి, నాన్‌ఆర్‌సిసి నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకత కు పెద్దపీట వేశామన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూ లావాదేవీలలో పారదర్శకత పెంపునకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆయన చెప్పారు.

# ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సహా సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 40 మందిని రక్షించి ఆసుపత్రికి తరలించగా, అక్కడ 21 మంది అప్పటికే మరణించినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఢిల్లీ ప్రభుత్వ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానం కింద హోటల్‌కు కేవలం ఆరు గదులకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, అది 25 గదులను నడుపుతోందని పోలీసు అధికారులు తెలిపారు. బేస్‌మెంట్‌లో కూడా గదులు ఏర్పాటు చేశారు. హోటల్‌కు ఒకే ఒక్క ప్రవేశనిష్క్రమణ మార్గం ఉందని, ఫైర్ ఎన్‌ఓసి పరిశీలనలో ఉందని అధికారులు తెలిపారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. మృతులలో విదేశీయులు కూడా ఉన్నారు. వీరిలో చాలామంది మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారు. కొద్ది దూరంలోనే ఉన్న మాక్స్ ఆసుపత్రిలో చేరిన తమ బంధువులను పరామర్శించడానికి వారు ఆ హోటల్‌లో బస చేశారు. ఘటన దృశ్యాలను పరిశీలిస్తే.. ఆ ప్రాంతంలో ఇరుకైన సందులు, వేలాడుతున్న తీగలు, అస్తవ్యస్తంగా ఉన్న ఇరుకైన భవనాల మధ్య మంటలు ఆకాశంలోకి ఎగసిపడుతుండగా, వేడికి వంకరపోయి తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నట్లు కనిపించింది. పొగతో కాలిపోయిన భవనం చుట్టూ అద్దాలు పగిలిపోయి ఉన్నాయి. ఢిల్లీ అగ్నిమాపక సేవలు, పోలీసులు, విపత్తు ప్రతిస్పందన బృందాల బృందాలు పొగతో నల్లబడిన ఆ భవనంలో ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలించాయి. బాధితులను నేలమాళిగ నుండి బయటకు తీసి అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అన్నిచోట్లా భయానక దృశ్యాలు చోటుచేసుకున్నాయి. దట్టమైన పొగ భవనాన్ని కమ్మేయడం, మంటలు వేగంగా వ్యాపించడంతో, చాలా మంది కిటికీ అద్దాలు పగలగొడుతూ సహాయం కోసం కేకలు వేయడం కనిపించింది. 'లోపల చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నంలో స్థానికులు కింద నేలపై పరుపులు పరచడంతో, ఒక మహిళ తన చిన్నారిని పట్టుకుని మూడో అంతస్తు నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షి చెప్పాడు. 'ఆమె బిడ్డను గట్టిగా పట్టుకుని ఉంది, బయటకు రావడానికి మరో మార్గం లేకపోవడంతో దూకింది. ప్రజలు అప్పటికే భవనం కింద పరుపులు ఏర్పాటు చేశారు. ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు, కానీ ఆమెకు గాయాలైనట్లు కనిపిస్తోందని అన్నారు. ఒక పరుపుల వ్యాపారి, కిందపడే వారి దెబ్బల నుండి రక్షణగా తన పరుపులను నేలపై పరచగా, మరికొందరు గాయపడిన బాధితులకు సిపిఆర్ చేశారు. రోడ్డుకు అవతల ఉన్న మాక్స్ ఆసుపత్రి వద్ద, గాయపడిన వారిని, మృతదేహాలను లోపలికి తీసుకువస్తుండగా, దిగ్భ్రాంతికి గురైన బంధువులు తమ ప్రియమైన వారి కోసం వెతుకుతూ వెయిటింగ్ ఏరియాలో గుమిగూడారు. వారు జాబితాలను పరిశీలిస్తూ, ఆత్రంగా ఫోన్ కాల్స్ చేస్తున్నారు. 'ఫోటోలు చూసి వారిని గుర్తుపట్టలేకపోతున్నాం; ఇది గుర్తుపట్టలేని పరిస్థితి. ప్రతి ఒక్కరూ తీవ్రంగా కాలిపోయారు' అని ఒక వ్యక్తి వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నాడు. ఇదిలా ఉండగా, అత్యవసర విభాగానికి 39 మంది రోగులు వచ్చారని మాక్స్ ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. వీరిలో 18 మంది మరణించిన స్థితిలో తీసుకురాగా, 15 మందిని ఐసియులో చేర్చారని, వీరిలో ఎనిమిది మంది వెంటిలేటర్ సహాయంతో విషమ పరిస్థితిలో ఉన్నారని ఆసుపత్రి పేర్కొంది. రోగులు ఊపిరాడకపోవడం, స్వల్ప కాలిన గాయాలు, ఎముకలు విరగడం వంటి వాటితో బాధపడ్డారని పేర్కొంది. స్వల్ప గాయాలైన ఐదుగురు రోగులకు ప్రాథమిక వైద్య సంరక్షణ అందించి డిశ్చార్జ్ చేయగా, తీవ్రమైన కాలిన గాయాలతో ఒక రోగిని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించినట్లు అది తెలిపింది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు 13 మంది రోగులు చేరారు. వీరిలో ముగ్గురు కిందపడటం వల్ల గాయపడగా, మంటల్లో చిక్కుకున్న భవనంలో చిక్కుకున్న వారిని రక్షించే క్రమంలో 10 మంది గాయపడ్డారు.

**రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తదితరులు తమ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని మాల్వీయా నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వార్త అత్యంత హృదయ విదారకంగా ఉందని, మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ముర్ము హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రాణనష్టాన్ని ప్రధానమంత్రి విషాదకరంగా అభివర్ణించారు. ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు అధికారులు అన్ని విధాలా సహాయం అందిస్తున్నారని మోదీ ఒక పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లింపునిస్తామని ప్రధానమంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, నాయకుడు రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులు తమ సంతాపం తెలిపారు.

# టీమ్ ఇండియా న్యూజిలాండ్ టూర్ ఖరారు

## 5 టి-20లు, 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనున్న భారత్




**ఆక్లాండ్:** న్యూజిలాండ్‌లో ఇండియా పర్యటించనున్నది. ఆ రెండు దేశాల మధ్య అతిపెద్ద ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరగనున్నది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు జరిగే ఈ సిరీస్‌లో 5 టి–20 మ్యాచ్‌లు, 5 వన్డేలు, రెండు టెస్టులు ఆడనున్నారు. సుమారు 40 రోజుల పాటు ఈ సిరీస్ కొనసాగనున్నది. ఇప్పటిక వరకు రెండు దేశాల మధ్య జరగబోయే అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్ ఇదే కానున్నది. న్యూజిలాండ్ పర్యటనలో మొత్తం 12 మ్యాచ్‌లు ఉండనున్నాయి. గతంలో ఎప్పుడూ ఇంత భారీ సంఖ్యలో అక్కడ సిరీస్ జరగలేదు. రెండు దేశాల మధ్య క్రీడాసంబంధాలకు వందేళ్లు నిండిన నేపథ్యంలో ఈ భారీ సిరీస్‌కు ప్లాన్ చేశారు. అక్టోబర్ 22వ తేదీన తొలి టీ౦ మ్యాచ్ క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్నది. టి–20 సిరీస్ తర్వాత వన్డే సిరీస్ జరుగుతుంది. నవంబర్ 4వ తేదీన ఆక్లాండ్‌లో తొలి వన్డే జరుగుతుంది. ఇక నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో ఫస్ట్ టెస్ట్ మ్యాచ్, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు రెండో టెస్టు క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్నది. కేవలం క్రికెట్ సిరీస్ మాత్రమే కాదు అని, రెండు దేశాల మధ్య చరిత్ర, సంస్కృతీ సంబంధాలకు చెందిన సంబరాలు జరగనున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గ్లెన్ క్రిట్‌చెల్ తెలిపారు.కోహ్లీ, బుమ్రా లాంటి ఆటగాళ్లు కూడా ఈ టూర్‌కు వస్తారని, దానికి తగినట్లు తాము సిద్ధమవుతున్నట్లు కివీస్ మార్కెటింగ్ చీఫ్ చెప్పారు. 2019–20 సీజన్ తర్వాత న్యూజిలాండ్‌కు భారత్ వెళ్లలేదు. కానీ ఆ తర్వాత రెండు సార్లు ఇండియాలో కివీస్ టూర్ చేసింది.

## ప్రజ్ఞానంద క్లాసికల్ విక్టరీ



**ఓస్లో:** యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద మళ్లీ షాకిచ్చాడు. హోమ్టౌన్ హీరో, వరల్ నెంబర్ వన్ ప్లేయర్ మ్యాగ్నస్ కార్లసన్‌పై వరుసగా రెండోసారి విక్టరీ కొట్టాడు. నార్వే చెస్ టోర్నీలో క్లాసికల్ గేమ్‌లోనూ కార్లసన్‌పై స్టన్నింగ్ విక్టరీ సాధించాడు ప్రజ్ఞానంద. మరోవైపు వరల్ చాంపియన్ డీ గుకేశ్.. నార్వే టోర్నీలో చేతులెత్తేశారు. 8వ రౌండ్ గేమ్‌లో ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో పాయింట్ల పట్టికలో గుకేశ్ దిగువ స్థాయిలో ఉండిపోయాడు. డబుల్ రౌండ్ రాబిన్ ఎలైట్ ఈవెంట్‌లో ప్రజ్ఞానంద అసాధారణ ప్రతిభ కనబరిచారు. క్లాసికల్ గేమ్‌లో ఈ ఏడాది కార్లసన్‌పై రెండు సార్లు గెలిచిన ప్లేయర్‌గా ఇండియన్ స్టార్ నిలిచాడు. ఈ టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉన్నాయి. కానీ 20 ఏళ్ల ప్రజ్ఞానంద 12 పాయింట్లతో ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్నాడు. అలీరేజా 13 పాయింట్లతో రెండో స్థానంలో, అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లే సో 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు. నార్వే టోర్నీలో కార్లసన్ పేలవ ఫామ్ కొనసాగుతోంది. అయిదు సార్లు ప్రపంచ చాంపియన్ కార్లసన్ కేవలం 9 పాయింట్లే సాధించాడు. తర్వాత జరిగే రెండు క్లాసికల్ గేమ్స్‌లో అతను గెలిచినా.. పాయింట్ల విషయంలో అతను నెట్టుకురావడం కష్టమే. ఇక ప్రజ్ఞానంద చేతిలో మొత్తానికి మూడు సార్లు కార్లసన్ ఓడారు.

## ఆ వైఫల్యమే ప్రపంచ రికార్డుకు పునాది



**న్యూఢిల్లీ :** పారిస్ ఒలింపిక్స్‌లో ఎదురైన చేదు అనుభవం తనను మానసికంగా ఎంతో బలోపేతం చేసిందని, అదే మ్యూనిచ్ వరల్ కప్‌లో సంచలన విజయానికి పునాదిగా నిలిచిందని భారత స్టార్ షూటర్, హైదరాబాదీ ఇషా సింగ్ పేర్కొంది. గత వారం మ్యూనిచ్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో 43 పాయింట్ల ప్రపంచ రికార్డు స్కోరుతో ఇషా పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆపై 10 మీ. పిస్టల్ ఈవెంట్లోనూ రజతం నెగ్గి టోర్నీలో భారత్ అగ్రస్థానంలో నిలిచేలా చేసింది. ఒలింపిక్స్‌లో తీవ్రంగా నిరాశపరిచిన ఇషా ఆ తర్వాత ఎదురైన వైఫల్యాల వల్ల చాలా మానసిక సంఘర్షణకు లోనయ్యానని చెప్పింది. అయితే క్రీడల్లో అత్యున్నత వేదికను చూసేసిన తర్వాత మిగతా పోటీల ఒత్తిడిని తట్టుకోవడం సులువైందని, తనలో సరికొత్త పట్టుదల పెరిగిందని వెల్లడించింది. 'షూటింగ్‌లో ఆఖరి షాట్ పడేవరకు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అందుకే మ్యూనిచ్ బరిలో ఎక్కడా అలసత్వానికి తావివ్వకుండా చివరి క్షణం వరకు పట్టుదలతో పోరాడాను. పదేళ్ల కెరీర్ అనుభవంతో ఒత్తిడిని జయించడం నాకు అలవాటైంది. పరాజయాలను నేను ఆడుకునే లెగో బ్లాక్స్ లాగా భావిస్తాను. అవి మనల్ని మరింత ఎత్తుకు ఎదగడానికి తోడ్పడతాయి' అని ఇషా చెప్పింది.

# 16 మహాజనపదాలు..




క్రీపూ 6వ శతాబ్దం సమయంలో భారత ఉపఖండంలో రాజకీయంగా శక్తివంతమైన స్వతంత్ర రాజ్యాలుగా అవతరించినవి మహాజనపదాలు. మహా అంటే గొప్ప, జనపద అంటే ప్రజలు నివసించే ప్రాంతం. చిన్న జనపదాలుగా ఉన్న గణాలు, రాజ్యాలు క్రమంగా విస్తరించి, బలమైన పరిపాలన వ్యవస్థలు, కోటలతో కూడిన రాజధానులు, స్థిర సైన్యాలతో కూడిన శక్తివంతమైన రాజ్యాలుగా మారాయి. ఇవి ప్రధానంగా గంగా సింధు సమతల ప్రాంతం నుంచి ఉత్తర దక్కన్ వరకు విస్తరించాయి. మహాజనపదాలు రెండు రకాలుగా ఉండేవి. రాజ్యాలు (రాచరికాలు), గణరాజ్యాలు (గణ/సంఘాలు).

క్రీపూ 6వ శతాబ్దంలో వికసించిన 16 మహాజనపదాలు పరిపాలన, సమాజం, ఆర్థిక వ్యవస్థ, సైనికశక్తి, మత వైవిధ్యం వంటి విభిన్న లక్షణాలతో ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఇవి భారతీయ రాజకీయ–సాంస్కృతిక పరిణామానికి బలమైన పునాది వేశాయి. మహాజనపదాలు రాజ్యాలు (రాచరికాలు), గణ–సంఘాలు (ఒలిగార్కీలు) అనే రెండు విధాలుగా ఉండేవి. గ్రామం(గ్రామ) ప్రాథమిక పరిపాలనా యూనిట్. రెండు గ్రామాలు కలిసినప్పుడు సంగ్రామంగా పిలిచేవారు. గ్రామనాయకులను గామినీ అని పిలిచేవారు. రాజ్యాల్లో రాజుకు మంత్రి వర్గం సహకారం ఉండేది. ఆర్థికం, రక్షణ, న్యాయ శాఖలుగా విభజన ఉండేది. గణరాజ్యాల్లో పెద్దలసభలు పాలనలో ప్రధానపాత్ర పోషించేవి. పన్నుల వ్యవస్థ సుస్పష్టంగా ఉండేది. సమాజం వర్ణ, వృత్తి ఆధారంగా విభజింపబడి ఉండేది. క్షేత్రిక, కస్సక వంటి రైతులు ప్రధాన వర్గంగా ఉండేవారు. దాస్య వ్యవస్థ కూడా ఉండేది. రాజకీయ ప్రయోజనాల కోసం వివాహ బంధాలు ఏర్పడేవి. కుల వ్యవస్థ ప్రారంభ దశలో ఉండి పూర్తిగా స్థిరపడలేదు. ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం . ఇనుప పరికరాల వినియోగం వల్ల ఉత్పత్తి పెరిగింది. వాణిజ్యం విస్తరించి, పంచ్‌మార్క్ నాణేలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. కహాపణ, నిక్ష, కకణిక వంటి నాణేలు వినియోగంలోకి వచ్చాయి. ఈ కాలంలో హిందూ మతంతో పాటు బౌద్ధం, జైనం వంటి శ్రామణిక సంప్రదాయాలు అభివృద్ధి చెందాయి. ఆజీవిక, చార్వాక వంటి ఇతర తాత్విక పంథాలు కూడా ప్రాచుర్యం పొందాయి. రాజులు మతాలకు ప్రోత్సాహం అందించేవారు. పదాతి సైన్యం, అశ్వ దళం, రథాలు, ఏనుగులతో కూడిన బలమైన సైన్యం ఉండేది. తామ్రలిప్త, భరుచ్, సోపార వంటి నౌకాశ్రయాలు సముద్ర వాణిజ్యానికి కేంద్రాలుగా నిలిచాయి. ఈ లక్షణాల సమాహారం మహాజనపదాలను శక్తివంతమైన ప్రాచీన రాష్ట్రాలుగా నిలబెట్టి, తర్వాతి సామ్రాజ్యాల అభివృద్ధికి పునాది వేసింది.

రాజ్యాల్లో రాజు ఆధిపత్యం ఉండగా, గణరాజ్యాల్లో ప్రముఖుల సమితి పాలన నిర్వహించేది. ఈ కాలం బౌద్ధం, జైనం వంటి నూతన మత, తాత్విక ఆలోచనల ఉదయానికి సమకాలికం. ఇనుప సాంకేతికత అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల, వాణిజ్య మార్గాల విస్తరణ, పట్టణీకరణ వంటి మార్పులు ఈ రాష్ట్రాల ఆర్థిక బలాన్ని పెంచాయి. మొత్తం 16 మహాజనపదాల ప్రస్తావన చరిత్రలో ఉంది. వాటిలో ముఖ్యమైనవి... అంగ, మగధ, కాశీ, వత్స, కోశల, సౌరసేన, పాంచాల, కురు, మత్స్య, చేది, అవంతి, గాంధార, కంబోజ, అస్మక, వజ్జి, మల్ల. తర్వాత పాటలిపుత్రాన్ని రాజధానిగా చేసుకుని గంగా, సోన్ నదుల పరిసరాల్లో మగధ రాజ్యం రా అభివృద్ధి చెందింది. కోశల శ్రావస్తి కేంద్రంగా సరయు నది ప్రాంతంలో ఉన్నది. వత్స కౌశాంబి కేంద్రంగా గంగా–యమునా దోయ్ద ప్రాంతంలో ఉన్నది. గాంధార తక్షశిల కేంద్రంగా ఇండస్ పరిసరాల్లో విస్తరించింది. అస్మక గోదావరి లోయలో దక్కను ప్రాంతంలో ఏకైక దక్షిణ మహాజనపదంగా నిలిచింది. ప్రస్తుత నిజాబాద్ పరిసర ప్రాంతాలలో అస్మక జనపదం ఉండేది. ఈ




మహాజనపదాల గురించి సమాచారం ప్రధానంగా బౌద్ధ గ్రంథం అంగుత్తర నికాయ, జైన గ్రంథం భగవతి సూత్ర, అలాగే మహాభారతం, రామాయణం, పురాణ సాహిత్యం ద్వారా లభిస్తుంది. పురావస్తు ఆధారాలు కూడా ఈ కాలపు పట్టణ నిర్మాణం, నాణేల వినియోగం, వాణిజ్య అభివృద్ధిని నిర్ధారిస్తున్నాయి. మహాజనపదాల కాలం భారత రాజకీయ చరిత్రలో కీలక దశ. పరిపాలనా వ్యవస్థలు, సైనిక శక్తి, ఆర్థిక వృద్ధి వంటి అంశాలు తర్వాతి మహాసామ్రాజ్యాలకు పునాది వేశాయి. ముఖ్యంగా మగధ రాజ్యం క్రమంగా శక్తివంతమై, తర్వాత మౌర్యుల కాలంలో విశాల సామ్రాజ్యంగా ఎదిగింది. అందువల్ల మహాజనపదాల యుగం భారత ఉపఖండ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిణామంలో మలుపుతిప్పిన దశగా పరిగణించబడుతుంది.

## దేశ చరిత్రలో విస్తృత మార్పులు..



16 మహాజనపదాల ప్రాధాన్యం భారత ప్రాచీన చరిత్రలో ఒక కీలక మలుపుగా పరిగణించబడుతుంది. ఈ యుగం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతికరంగాల్లో విస్తృతమైన మార్పులకు నాంది పలికింది. తర్వాతి సామ్రాజ్యాల ఆవిర్భావానికి ఇది బలమైన పునాది వేసింది. మహాజనపదాల కాలంలో చిన్న జనపదాల స్థానంలో విస్తారమైన భూభాగాన్ని కలిగిన ప్రాంతీయ రాజ్యాలు ఏర్పడ్డాయి. సుసంఘటిత పరిపాలన, పన్నుల వ్యవస్థ, స్థిర సైన్యం వంటి అంశాలతో రాజ్య వ్యవస్థ బలపడింది. మోనార్కీలు (రాచరికాలు), గణరాజ్యాలు అనే రెండు విధాల రాజకీయ వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. సింధు నాగరికత తర్వాత భారతదేశంలో రెండవసారి పట్టణీకరణ ఈ కాలంలో జరిగింది. రాజధానులు వాణిజ్య, సాంస్కృతిక, పరిపాలనా కేంద్రాలుగా ఎదిగాయి. రాజగృహ, కౌశాంబి, శ్రావస్తి, ఉజ్జయిని వంటి నగరాలు అభివృద్ధి చెందాయి. నగరాల పెరుగుదలతో వృత్తులు, శిల్పకళలు, మార్కెట్లు విస్తరించాయి. రాజ్యాల మధ్య వివాహ సంబంధాలు, సైనిక ఒప్పందాలు, కూటములు ఏర్పడటం సాధారణమైంది. ఇవి పరస్పర ప్రయోజనం కోసం లేదా బాహ్య శత్రువులను ఎదుర్కొనేందుకు ఏర్పడేవి. రాజకీయ వ్యూహాలు, దౌత్య నైపుణ్యం ప్రాముఖ్యం పొందాయి. పెద్ద రాష్ట్రాల ఏర్పాటుతో అంతర్గత, బాహ్య వాణిజ్యం విస్తరించింది. ఉత్తరపథ, దక్షిణపథ వంటి వాణిజ్య మార్గాలు సరుకుల రవాణాను సులభతరం చేశాయి. రహదారులు, వంతెనలు నిర్మించడం వల్ల ఆర్థిక చలనం పెరిగింది. నాణేల వినియోగం వాణిజ్యాన్ని మరింత సుస్థిరం చేసింది. మహాజనపదాల పరిపాలనా పద్ధతులు, పట్టణ అభివృద్ధి, సైనిక శక్తి తదుపరి నంద, మౌర్య సామ్రాజ్యాల ఎదుగుదలకు దారితీశాయి. కేంద్రికృత పరిపాలనకు పునాది ఈ కాలంలోనే పడింది. ఈ యుగంలో స్తూపాల నిర్మాణం ప్రారంభమై, తరువాతి కాలంలో సాంచీ వంటి ప్రఖ్యాత స్తూపాల రూపకల్పనపై ప్రభావం చూపింది.

# కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు




**ప్రజాపక్షం/నల్లబెల్లి :** పెట్టుబడిదారి వ్యవస్థ రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతుందని, దానికి ప్రత్యామ్నాయంగా ప్రపంచ యువత ఎర్రజెండా వైపు చూస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫక్షన్‌హాల్‌లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అధ్యక్షతన జరిగిన వరంగల్ జిల్లా సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి విచ్చేసి మాట్లాడారు. కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని, మానవాళిని దోపిడి నుంచి విముక్తి చేసేందుకు కార్ల్‌మార్క్స్ అందించిన సిద్ధంతమే ప్రపంచానికి మార్గదర్శకమని స్పష్టం చేశారు. సిపిఐది ఘన చరిత్ర అని, దేశస్వాతంత్ర్య పోరాటంలో అనేక త్యాగాలను చేసిందని, దున్నేవాడిదే భూమి నినాదంతో లక్షలాది ఎకరాలను పేదలకు పంచిందన్నారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించిన సాయుధ రైతాంగ పోరాటంతో వేలాది గ్రామాలకు కమ్యూనిస్టులు విముక్తి కలిగించారని గుర్తు చేశారు. భవిష్యత్తు కార్యాచరణతో దేశంలో లౌకిక , ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేస్తు వామపక్షాల ఐక్యతతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తక్కళ్లపల్లి తెలిపారు. తెలంగాణ వ్యతిరేకులకు ఇక్కడ స్థానం లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాక్యలను తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు తప్పుపట్టారు. పవన్‌కళ్యాణ్‌కు తెలంగాణ సంస్కృతిపై కనీస అవగాహన లేదని, ఆయనకు ఒక స్థిరమైన సిద్ధాంతం లేదని, ఆంధ్రప్రదేశ్‌లో ఒకలా, తెలంగాణలో మరోలా మాట్లాడుతున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ బిజెపి ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ ప్రజలు ఆయనను ఎప్పటికీ విశ్వసించరని తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శిక్షణ తరగతులలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి, ఎస్‌కె బాషుమియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, అక్కపెల్లి రమేష్, కందిక రమేష్, సిపిఐ నాయకులు బట్టు సాంబయ్య, మామిండ్ల పెద్ద అయిలయ్య, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# యూరియా యాప్ రద్దు చేయాలి

### రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం :** యాప్ ద్వారా యూరియా పంచే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రైతులు యాప్ ద్వారా యూరియా పొందెందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. మిడికంటి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారుల అంచనాల మేరకు రసాయనిక ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు గతేడాది తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రసాయనిక ఎరువుల కోటాను తగ్గించిన క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని ఆయన సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించకపోతే రైతులకు ఆర్థికంగా భారమవుతుందని ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారని హేమంతరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా విషయంలో దాటవేత ధోరణిని అవలంభిస్తుందని యాసంగి సీజన్‌కు సంబంధించి రెండు ఎకరాలకు పైగా ఉన్న రైతులకు తక్షణం రైతు భరోసా డబ్బులు జమ చేయాలని వానా కాలానికి సంబంధించి రైతు భరోసా సైతం జమ చేయాలన్నారు. మొక్కజొన్నలు, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ములకశిర కార్తె సమీపిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న మొక్కజొన్నలు, ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి తరలించాలని, నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల ఎనిమిదిన జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు హేమంతరావు తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉద్యమిస్తుందన్నారు. రైతు సంఘ సభ్యత్వ చేర్పింపు కార్యక్రమాన్ని ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని హేమంతరావుకు అందజేశారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, నాయకులు పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, పుచ్చకాయల సుధాకర్, మామిడి సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, రాంకోటి, దొబ్బల కృష్ణ, రామకృష్ణ, వెంకటనర్సయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తోటపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పెట్రో ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్యుల నడ్డి విరుస్తోందని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, అడ్డుఅదుపులేకుండా పెంచుతున్న ధరలపై ప్రజలు గళం విప్పాలని, అప్పుడే పాలకుల్లో చలనం వస్తుందన్నారు. పెరిగిన నిత్యవసరాలు, గ్యాస్, పెట్రో, డీజిల్ అధిక ధరలను నిరసిస్తూ జూన్ 10న చేపట్టబోయే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు, పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని, ప్రజల పక్షాన నిలబడి పోరాడినప్పుడే పార్టీకి నిజమైన బలం చేకూరుతుందని గుర్తు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో అనేక దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం కావడం హర్షణీయం అన్నారు. సమావేశంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, నేరెళ్ల రమేష్, గోనె మణి, మునిగడప వెంకటేశ్వర్లు, ఎండి యూసుఫ్, బోయిన విజయ్, ముడెత్తుల శ్రీనివాస్, గోపికృష్ణ, ధర్మరాజు, సుధాకర్ పల్నాటి ప్రశాంత్, పి.ధనలక్ష్మి, వై.శంకర్,. జహీర్, నగేష్, సత్యనారాయణచారి, సింగిరాల రమేష్, గడ్డం ప్రభాకర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# డిపెండెంట్ కార్మికులకు ఉద్యోగ నియామక పత్రాలివ్వాలి

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ వినతి

### జిఎం కార్యాలయం ఎదుట ధర్నా, వినతిపత్రం అందజేత




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణిలో మెడికల్ అన్ ఫిట్ పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జిఎం కార్యాలయం ఎదుట సింగరేణి వ్యాప్తంగా కార్మికులు డిపెండెంట్ ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేయాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అనారోగ్య కారణాలవల్ల మెడికల్ అన్‌ఫిట్ పొందిన కార్మికుల పిల్లలు సుమారు 400 మంది డిపెండెంట్ ఉద్యోగం పొందిఉన్నారని వారికి ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నియామకపత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. వారిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఇల్లు గడవక దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి నియామక పత్రాలు అందజేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే ప్రభుత్వం వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు. గతంలో సింగరేణి భవన్‌కు పిలిపించుకొని నియామక పత్రాలు ఇచ్చేవారని, జూన్ 2న కార్మికులకు ఉద్యోగం నియామక పత్రాలు అందజేస్తారని ఎదురు చూసిన కార్మికులకు నిరాశ ఎదురైందని చెప్పారు. ఓపిక నశించి సింగరేణి వ్యాప్తంగా అన్ని జిఎం కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే జూన్ నెలలో 3వ వారంలో సమ్మెకైనా సిద్ధమేనని హెచ్చరించారు. అనంతరం కార్మికులకు నియమాక పత్రాలు ఇవ్వాలని కోరుతూ జిఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి వైస్‌ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపెల్లి సుధాకర్ రెడ్డి, ఆసిఫ్ పాషా, జి శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, బ్రాంచ్ కమిటీ నాయకులు తోట రామచందర్, ఫిట్ సెక్రటరీలు రాజేందర్, గణేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి, ఆర్జీ1 బ్రాంచి ఆధ్వర్యంలో బుధవారం ఆర్జీ1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎస్ఒటు జిఎంకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, నాయకులు బోగ సతీష్‌బాబు, గండి ప్రసాద్, సిర్ర మల్లికార్జున్, చంద తిరుపతి, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అజీం, బలుసు రవి, తాళ్ళపెల్లిశ్రీనివాస్, నంది నరేశ్, రవీందర్, విజయ్‌కుమార్, రమేశ్ గౌడ్, పర్లపెల్లి రామస్వామి, చేరాలు, గంగారపు చంద్రయ్య, రాజేశ్వర్‌రావు, తొడుపునూరి రమేశ్ కుమార్, జ్యోతి, కళ్యాణి, స్వర్ణ పాల్గొన్నారు.



## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: సిపిఐ(ఎం)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కమ్యూనిజం, ప్రజా పోరాటాలపై చేసిన వ్యాఖ్యలను సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ విద్వేషాలు, భాషా విభేదాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం బాధ్యతాయుత పదవిలో ఉన్న వ్యక్తికి తగదని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. ఆయనపై వచ్చిన భూ ఆక్రమణ ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిపిఐ(ఎం) తెలంగాణను వ్యతిరేకించిందంటూ అవాస్తవ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.కమ్యూనిజం చచ్చిపోయిందని చెప్పడం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. బిజెపి ప్రధాని నరేంద్ర మోదీ ఎజెండాకు అనుగుణంగా మతోన్మాద, విద్వేష రాజకీయాలను తెలంగాణలో ప్రవేశపెట్టేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జాన్‌వెస్లీహెచ్చరించారు.

## తెలంగాణ రాజకీయాలపై వ్యాఖ్యలు వద్దు

టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అభివృద్ధిపై పక్క రాష్ట్రాల నాయకులు, పెయిడ్ ఆర్టిస్టులు జోక్యం చేసుకోవద్దని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ సూచించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణలో ఎలాంటి గద్దలకు అవకాశం ఉండదని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినప్పుడు పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, రాష్ట్ర అభివృద్ధి ఎలా చేసుకోవాలో తమకు తెలుసని పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ పట్ల గౌరవం ఉన్నప్పటికీ తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకుని మరో కేఏ పాల్‌గా మారొద్దని హితవు పలికారు. గద్దర్ వంటి వ్యక్తులపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అవివేకపూరితమని దయాకర్ విమర్శించారు.

## గద్దర్‌పై పవన్ వ్యాఖ్యలు పూర్తిగా అసత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ ప్రజాగాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత గద్దర్ గురించి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్‌లో పవన్ కళ్యాణ్‌పై అధికారిక ఫిర్యాదు దాఖలైంది. న్యాయవాదులు ఫణీంద్ర భార్గవ్, రవికుమార్ వొడియారపు సంయుక్తంగా ఇచ్చిన ఫిర్యాదులో, గద్దర్ తనను కారు అడిగారని, తాను బహుమతిగా కారు ఇచ్చానని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని ఆరోపించారు. మరణించిన వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన భావోద్వేగాలను అవమానించినట్లవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గద్దర్ దళిత సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడని, ఆయనపై చేసిన వ్యాఖ్యలు దళితుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదుదారులు ఆరోపించారు. భారతీయ న్యాయ సంహితలోని పరువు నష్టం, ఉద్దేశపూర్వక అవమానం, విద్వేషాలను రెచ్చగొట్టే నిబంధనలతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కూడా చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. అయితే ఫిర్యాదు స్వీకరించినప్పటికీ, ఈ వార్త రాసే సమయానికి పవన్ కళ్యాణ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు లేదా కేసు బుక్ చేసినట్లు అధికారికంగా పోలీసులు ప్రకటించలేదు. ప్రస్తుతం ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణలో పలువురు రాజకీయ నాయకులు, ఉద్యమకారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## తెలంగాణలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్న పవన్ కళ్యాణ్

టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజల్లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ విమర్శించారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్3 ప్రకారం చట్టబద్ధంగా ఏర్పడిందని, ఈ విషయంపై పవన్ కళ్యాణ్‌కు కనీస అవగాహన కూడా లేదన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్ర అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని పేర్కొన్నారు. గద్దర్ వంటి ప్రజాకవిని తెలంగాణ ప్రభుత్వం గౌరవిస్తుంటే, ఆయనతో పాటు తెలంగాణ ప్రజలను అవమానించేలా పవన్ కళ్యాణ్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదల వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించే ధైర్యం చూపాలని సూచించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు కొనసాగితే ప్రజాస్వామ్యబద్ధంగా తీవ్రంగా ప్రతిఘటిస్తామని లింగం యాదవ్ హెచ్చరించారు.

## బిసి గురుకులాల్లో 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ రెండవదశ సీట్ల జాబితా విడుదల

ఎంజెపి ఇన్‌ఛార్జ్ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల విద్యా సంస్థల్లో 6, 7, 8 , 9 తరగతుల బ్యాక్లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల రెండో జాబితా బుధవారం విడుదల చేశామని సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బిసి గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఫలితాలను సొసైటీ అధికారిక వెబ్ సైట్ https://tgcet.cgg.gov.in/TGCETWEB/#/home https://mjptbcwre is.telangana.gov.in లో పరిశీలించవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంబంధిత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారని, విద్యార్థులు ఏ తేదీన పాఠశాలకు హాజరు కావాలి అనే వివరాలు తెలియ చేస్తారని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్ట్‌లో ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. సీట్ల కేటాయింపు, భర్తీ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు.

## చట్టం ప్రకారమే ఆలయాల పాలక మండళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏజెన్సీ ప్రాంతాల్లోని దేవాలయాల పాలక మండళ్లు, నిర్వహణ కమిటీల ఏర్పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం ప్రకారమే జరగాలని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. స్థానిక గిరిజనులతో మాత్రమే కమిటీలు ఏర్పాటు చేయాలన్న వాదనను తిరస్కరించింది. ములుగు జిల్లా మల్లూరులోని శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీ ఏర్పాటుకు దేవాదాయశాఖ కమిషనర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ సూరేపల్లి నంద కొట్టివేశారు. దేవాదాయశాఖ చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం కమిషనర్ చర్యలు చట్టబద్ధమేనని, భూ బదలాయింపులకు సంబంధించిన నిబంధనలు ఈ వివాదానికి వర్తించవని ధర్మాసనం పేర్కొంది.

# జర్మనీ థూరింగియా ప్రభుత్వంతో తెలంగాణ కీలక ఒప్పందం

నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సహకారానికి ఎంఒయు

హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డితో థూరింగియా మంత్రి-ప్రెసిడెంట్ మారియో ఫోకట్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ స్థాయి పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జర్మనీకి చెందిన థూరింగియా రాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం బుధవారం అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. శాస్త్ర సాంకేతిక రంగం, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారం, పెట్టుబడుల ప్రోత్సాహం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. భారత్ పర్యటనలో భాగంగా థూరింగియా రాష్ట్ర మంత్రి ప్రెసిడెంట్ మారియో ఫోకట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ఎంసిఆర్ హెచ్ఆర్‌డి సంస్థలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు ప్రభుత్వాల మధ్య అధికారికంగా ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా మారియో ఫోకట్ మాట్లాడుతూ, అభివృద్ధి, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. భారత్‌జర్మనీ ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమవుతున్న సమయంలో తెలంగాణతో భాగస్వామ్యం కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు (ఎఐ) యుగంలో మారుతున్న ప్రపంచ ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల అవసరాలను తీర్చగలిగే మానవ వనరులను తయారు చేయడమే తెలంగాణ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ విద్యాసంస్థల పాఠ్యాంశాల ఆధునీకరణలో థూరింగియా భాగస్వామ్యం కావాలని సిఎం కోరారు. దీనిపై స్పందించిన మారియో ఫోకట్, తెలంగాణ–థూరింగియా పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక స్కిల్లింగ్ వ్యవస్థను సంయుక్తంగా రూపొందించవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లో జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని సిఎం ప్రతిపాదించగా, జర్మనీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య సిబ్బందిని తయారు చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు థూరింగియా ప్రతినిధి బృందం హామీ ఇచ్చింది. భవిష్యత్ నగరంగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ, సెమీకండక్టర్ రంగం, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, ఫోటోనిక్స్, ప్రిసిషన్ ఇంజినీరింగ్ వంటి రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలను సీఎం ప్రతినిధి బృందానికి వివరించారు. ఫార్చ్యూన్500 కంపెనీలను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని చెప్పారు. సమావేశంలో థూరింగియా రాష్ట్ర ఉన్నతాధికారులు, చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైచెల్ హస్పెర్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు.తెలంగాణను గ్లోబల్ స్కిల్స్, ఇన్నోవేషన్, పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా జర్మనీతో కుదిరిన ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# బిజెపి–బిఆర్ఎస్ జుగల్బందీతో దెబ్బతిన్న తెలంగాణ ప్రయోజనాలు

ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి బిఆర్ఎస్ మధ్య జుగల్బందీ సంబంధం ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల పట్ల బాధ్యత లేని పార్టీ బిజెపి అని, బిజెపికి తెలంగాణలో ఓట్లు, సీట్లు కావాలే గానీ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తన వైఖరిని స్పష్టం చేయాలని, అదిలాబాద్ జిల్లా రైతులకు నీరు అందేలా మహారాష్ట్రతెలంగాణ ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ విచారణకు ఇచ్చినా చర్యలు కనిపించడం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటును ఆలస్యం చేయడంలో బిజెపి పాత్ర ఉందని, కాకినాడ తీర్మానాన్ని అమలు చేసి ఉంటే రాష్ట్రం ముందుగానే ఏర్పడేదని పేర్కొన్నారు. పార్టీకి రాజకీయ నష్టం జరిగినా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేసే నైతిక హక్కు బండి సంజయ్, కిషన్ రెడ్డి, బిజెపికి లేదని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహారాష్ట్రలో కూడా బిజెపి ప్రభుత్వమే ఉన్నందున తుమ్మిడిహెట్టి అంశంలో చర్చలకు ముందుండాలని సూచించారు. తెలంగాణ అమరవీరుల పట్ల నిజమైన గౌరవం ఉంటే అమరవీరుల స్థూపానికి కెసిఆర్ నివాళులర్పించేవారని అన్నారు. కెసిఆర్‌కు తెలంగాణ సెంటిమెంట్ రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల భావోద్వేగాల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. తప్పుడు హామీలతో తెలంగాణలో ఒక తరం భవిష్యత్తును బిఆర్ఎస్ దెబ్బతీసిందని విమర్శించారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలకు పారదర్శక, ప్రజారంజక పాలన అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వేముల వీరేశం స్పష్టం చేశారు.

## ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోంది : ఏలేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాస్తవాలను పక్కనబెట్టి, అబద్ధాలను,అతిశయోక్తులను,ప్రగల్భాలకే కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని, బిజెపిని లక్ష్యంగా చేసుకుని ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బహిరంగ చర్చించేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో సుమారు 1.41 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, కేవలం 64 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయి రైతులు ఎండలో కాపలా కాస్తున్న పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన రూ.4,644 కోట్ల నిధులతోనే ఇళ్లు నిర్మించి, వాటికి 'ఇందిరమ్మ ఇళ్లు' అని పేరు పెట్టుకోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అలాగే, ప్రాణహితతుమ్మిడిహెట్టి వంటి ప్రాజెక్టుల విషయంలో అంతర్ రాష్ట్ర ఒప్పందాలు, డిపిఆర్‌లు, కేంద్ర అనుమతుల ప్రక్రియ పూర్తి చేయకుండానే, కేంద్రంపై నెపం మోపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితి రూ. 58 వేల కోట్లు ఉంటే, కేవలం మొదటి నెలలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 11 వేల కోట్ల అప్పు చేసిందన్నారు.

## ఒబిసి వర్గాలను సంఘటితం చేసి, కాంగ్రెస్ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం

టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే రోజుల్లో ఎఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఒబిసి వర్గాలను సంఘటితం చేసి, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఒబిసి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఓబిసి అబ్జర్వర్ సమావేశం బుధవారం ఇందిరా భవన్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశానికి వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర వ్యాప్తంగా ఓబిసి విభాగాన్ని గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే దిశగా కీలక సూచనలు చేశారు. అలాగే కన్వీనర్లు డాక్టర్ కేతూరి వెంకటేష్, డాక్టర్ జూలూరు ధనలక్ష్మి సమావేశానికి అధ్యక్షత వహించి, జిల్లాల వారీగా అబ్జర్వర్ల నియామకం, పార్టీ బలోపేతం, సామాజిక న్యాయం సాధనలో ఓబిసిల పాత్ర చాలా కీలకం అని చెప్పారు. రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లాల వారీగా పార్టీ నిర్మాణాన్ని వేగవంతం చేయడం, గ్రామ స్థాయి వరకు ఓబిసి కాంగ్రెస్ శక్తిని విస్తరించడం, రాహుల్ గాంధీ సామాజిక న్యాయ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం సమన్వయంతో పని చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# శిక్షణా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

ఆధునిక పోలీసింగ్‌కు నాణ్యమైన శిక్షణే పునాది: డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థల్లో తెలంగాణ పోలీసు అకాడమీ ఒకటిగా గుర్తింపు పొందడం గర్వకారణమని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు. ఆయన రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీని బుధవారం సందర్శించారు. అకాడమీ పర్యటనలో భాగంగా యూనిట్ హాస్పిటల్, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్లు సహా శిక్షణా, మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అకాడమీ కార్యకలాపాలపై సమగ్ర అవగాహన పొందారు. సమీక్ష సమావేశంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, ప్రాథమిక, సేవాకాల శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, శిక్షణా ప్రణాళికలు, నిర్వహించిన వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సంక్షేమ కార్యక్రమాలు, సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ నాణ్యమైన పోలీసింగ్‌కు సమర్థవంతమైన శిక్షణే మూలస్థంభమని పేర్కొంటూ, అధికారులు, సిబ్బంది సమన్వయంతో జట్టుగా పనిచేసి అకాడమీ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. తాను గతంలో జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీలో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావించిన డీజీపీ, ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు శిక్షణను నిరంతరం నవీకరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు, జిల్లా శిక్షణా కేంద్రాలను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, అనుమతులు, ఇతర సంస్థాగత అవసరాల విషయంలో పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అన్ని హోదాల్లోని పోలీసు సిబ్బందికి తప్పనిసరి శిక్షణా కోర్సులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల దర్యాప్తు, మోటార్ వాహనాల చట్టం అమలు, రోడ్డు భద్రత, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానంపై పోలీసు సిబ్బందికి మరింత నైపుణ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా తెలంగాణ పోలీసు అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో నిర్వహిస్తామని వెల్లడించారు. మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమం, నాయకత్వ సామర్థ్యాల పెంపు, సమాన అవకాశాల కల్పన లక్ష్యంగా 'తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్' కార్యక్రమాన్ని కూడా ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు.

## అమెరికాలో మాజీ ఎంపి మధుయాష్కీ కుటుంబానికి ప్రమాదం

కారు అదుపుతప్పి పల్టీలు.. డాక్టర్ సుచి యాష్కీకి గాయాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ కుటుంబానికి అమెరికాలో ప్రమాదం జరిగింది. ఆయన సతీమణి, ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ సుచి యాష్కి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైనట్లు సమాచారం. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, తమ చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కిను బోస్టన్‌లోని హార్వార్డ్ యూనివర్సిటీ అనుబంధ ఆసుపత్రిలో ఎండి కోర్సులో చేర్పించి న్యూయార్క్‌కు తిరుగు ప్రయాణం అవుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వర్షం కారణంగా రహదారిపై కారు అదుపుతప్పి పల్టీలు కొట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో డాక్టర్ సుచి యాష్కీకి ఛాతీ భాగంలోని పక్కటెముకలు (రిబ్స్) విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు. ఇటీవల న్యూ యార్క్ మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన కుమార్తె గగన యాష్కీ కాన్వొకేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన అమెరికా వెళ్లారు.కుమార్తెను ఎండి కోర్సులో చేర్పించే సమయంలో లగేజీ ఎక్కువగా ఉండటంతో మధుయాష్కీ గౌడ్ డాక్టర్ సుచి యాష్కీ వేర్వేరు కార్లలో ప్రయాణించినట్లు తెలిసింది. తిరుగు ప్రయాణంలో డాక్టర్ సుచి యాష్కీ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. కాగా, మధుయాష్కీ గౌడ్ గురువారం భారత్‌కు తిరిగి రావాల్సి ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడం కుటుంబ సభ్యులు, సన్నిహితుల్లో ఆందోళన కలిగించింది. డాక్టర్ సుచి యాష్కీ త్వరగా కోలుకోవాలని పలువురు నాయకులు, మిత్రులు ఆకాంక్షిస్తున్నారు.

## యువత సమస్యలపై దేశవ్యాప్త పోరాటాలు ఉధృతం

ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేయాలని ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో జరిగిన ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగం, విద్యా సంక్షోభం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టు ఉద్యోగాల పెరుగుదల వల్ల యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు.ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీలు భర్తీ కాకపోవడం, రైల్వేలు, బ్యాంకులు, బీమా సంస్థలు, విద్యా రంగంలో ప్రైవేటీకరణ పెరగడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు. విద్యా రంగంలో కార్పొరేటీకరణ కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు.ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ హక్కు, విద్య హక్కు, సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, లింగం రవి, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలకృష్ణ, మొగిలి లక్ష్మణ్, పి. శివ కుమార్, ఎల్లంకి మహేష్, శేఖర్, రాజ్ కుమార్, మహేష్, ఆంజనేయులు, నయీమ్, హేమంత్, వెంకటేష్, మధుకర్, భాను తదితరులు పాల్గొన్నారు.



## టిజిబిసిఎల్‌లో 66 మంది ఉద్యోగుల బదిలీలు

పారదర్శకంగా ప్రక్రియ పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిబిసిఎల్)లో భారీ స్థాయిలో ఉద్యోగుల బదిలీలు చేపట్టారు. కార్పొరేట్ కార్యాలయంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 లిక్కర్ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న మొత్తం 66 మంది ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తూ సంస్థ యాజమాన్యం ప్రక్రియను పూర్తి చేసింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, టిజిబిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సి. హరికిరణ్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు బదిలీల ప్రక్రియను నిర్వహించారు. బదిలీల్లో 9 మంది అసిస్టెంట్ మేనేజర్లు, ఒక స్టోర్స్ ఆఫీసర్, 49 మంది అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్లు, ఐదుగురు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, డీపీఏ2 విభాగానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 70 శాతం వికలాంగత కలిగిన ఇద్దరు అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్లను ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కేంద్రాల్లోనే కొనసాగించినట్లు జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. బదిలీల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయి పారదర్శకత పాటించామని ఆయన పేర్కొన్నారు. టిజిబిసిఎల్ ఉద్యోగుల బదిలీలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించడం సానుకూల పరిణామమని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.



## పేదలకు సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** అర్హతగల ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని శిల్పా నగర్ కాలనీలో బుధవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. నిరుపేదల సొంతింటి కలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరిబాబు, ప్రవీణ్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.



## వర్షాల ఎఫెక్ట్‌కు చెక్ రంగంలోకి అధికారులు

### డిసి వాణి కీలక ఆదేశాలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ మిషనర్ వాణి ఆదేశించారు. ఆమె కార్యాలయంలో నిర్వహించిన వర్షాకాల సంసిద్ధత సమావేశంలో మున్సిపల్, ట్రాఫిక్, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాలాలు, డ్రైనేజీల పూడికతీత, కల్వర్టుల శుభ్రత, మూతలు ఏర్పాటు చేయడం, దోమల నివారణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయడంతో పాటు ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తప్పుడు ప్రచారాలను అరికట్టాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాజీవ్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ నరేష్, ట్రాఫిక్ సిఐ రవీందర్, లా అండ్ ఆర్డర్ సీఐ బాలస్వామి,తదితరులు పాల్గొన్నారు.



## ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్ కుమార్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్‌ను ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్ బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. శామీర్‌పేటలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్‌ను ఉమ్మడి శామీర్‌పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు క్యాతం రవి, సభ్యులు దేశం కృష్ణ, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇలాసాగరం గిరిప్రసాద్, రాజిగళ్ల భూపాల్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఎఎంసి సర్కిళ్లకు వెటర్నరీ అధికారుల నియామకం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మల్కాజిగిరి మహానగర్ కార్పొరేషన్ పరిధిలో జోనల్ కార్యాలయ పరిధిల్లో వెటర్నరీ అధికార్లను నియమించారు. ఆయా ప్రాంత పరిధిల్లో కుక్కలు, కోతులు, మృతి చెందిన పశువులను తొలగించటం లాంటి పశు సంబంధిత సమస్యలను సంబంధిత అధికారులకు తెలియచేసి పరిష్కారాన్ని కోరవచ్చని ఏఎంసి వెటర్నరీ విభాగ డిప్యూటి డైరెక్టర్ తెలిపారు. మల్కాజిగిరి జోనల్ పరిధిలోని కీసర, ఆల్వాల్, బోయినపల్లి, మౌలాలి, మల్కాజిగిరి సర్కిళ్లకు డా.సంజయ్ (9247540 129), ఉప్పల్ జోనల్ పరిధిలోని ఘట్‌కేసర్, నాచారం, కాప్రా సర్కిళ్లకు గాను డా. కె.శ్రీనివాసరావు (8712034408), ఉప్పల్ సర్కిల్‌కు గాను డా. ప్రసన్న (8712499203), బోడుప్పల్ సర్కిల్‌కు డా.కె.శ్రీనివాసరావు (8712034408), ఎల్‌బి నగర్ జోనల్ పరిధిలోని సరూర్‌నగర్, ఎల్‌బి నగర్ సర్కిళ్లకు డా.బీక్యా (906386131), హయత్‌నగర్ సర్కిల్‌కు డా.పి.శ్యామ్ సుందర్ (9063421353)లను నియమించారు.

## రాష్ట్ర సాధన కోసం 1200 మందికి పైగా అమరులు

### పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ దశరథ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వినాయక్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన రాష్ట్రావతరణ వేడుకల్లో పార్టీ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ దశరథ్‌లు జాతీయ జెండాను ఎగురవేసారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అన్ని వర్గాల ప్రజానీకం ఉద్యమించగా 1200 మందికి పైగా అమరులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు యాదయ్య గౌడ్, ఎ.అశోక్, రోయ్యల గిరిజ, ఎస్కె అజీజ్, బి.లింగం, సయ్యద్ యూసూఫ్, వెంకటరమణ, వెంకటేష్, పవన్, ఆనంద్‌రావు, సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలో ఓ కాలనీలో తమ 14 సంవత్సరాల కూతురు ఇంటి సమీపంలో ఉన్న కిరాణ షాప్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి బయటికి వెళ్లింది. తిరిగి కొద్ది సేపటికి మళ్లీ ఇంటికి వచ్చింది. చుట్టు పక్కన ఉండే వారు మీ కూతురిని ఇస్త్రీ షాపు యజమాని వ్యక్తి తన ఇంట్లోకి తీసుకెళ్లి షట్టర్‌ను మూసివేయడం చూసామని తల్లిదండ్రులకు తెలిపారు. ఏమైందని తమ కుమార్తెను అడగగా వారం రోజుల క్రితం షాప్ వద్దకు వెళ్లి వస్తుండగా లోపలికి పిలిచి షట్టర్‌ను మూసివేసి ఎక్కడ పడితే అక్కడ పట్టుకున్నాడని వారికి తెలిపింది. నిందితుడు ముడికొండ లింగంగా గుర్తించారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

### వ్యాపార ఆరంభానికి

# నైపుణ్యాభివృద్ధి, కార్మిక సంక్షేమం కీలకం

* సీడ్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ శిక్షణ ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
* విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపిఇ)లో మే 16 నుంచి ప్రారంభమైన సీడ్ ఎడ్యుకేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం వాలెడిక్టరీ సెషన్ మరియు కాన్వోకేషన్ బుధవారం అట్టహాసంగా ముగిసింది. నైజీరియాలోని టరాబా సీడ్స్ లిమిటెడ్, భారతదేశంలోని ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐపిఈ సంయుక్తంగా టరాభా రాష్ట్ర ప్రభుత్వం నైజీరియా, ప్రసాద్ ఆగ్రోటెక్ ఎఫ్‌జడ్‌సి దుబాయి సహకారంతో నిర్వహించారు. టరాభా రాష్ట్ర యువతకు సీడ్ ఎడ్యుకేషన్, ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ రంగాల్లో జ్ఞానం నైపుణ్యాలను అనువర్తనాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంతో భారత నైజీరియా స్నేహం ప్రతిబింబించిందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌లు మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి వ్యాపారంభం ఎంతో ముఖ్యమైందని వివరించారు. వ్యాపార ఆరంభానికి నైపుణ్యాభివృద్ధి, కార్మిక సంక్షేమం ఎంతో ముఖ్యమని వివరించారు. కార్మికులు జీవనోపాధులుగా మారాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజి యూనివర్శిటి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డి. రాజిరెడ్డి మాట్లాడుతూ వాతావరణానికి అనుకూలమైన పద్ధతులను ఉద్యానవన ఆవిష్కరణలు, జ్ఞానం మార్పిడి గ్రామీణ జీవనోపాధిని మార్చగలవని అన్నారు. ఐపిఈ బోర్డు అధ్యక్షుడు కాకి మాధవరావు మాట్లాడుతూ భారత నైజీరియా సంస్థాగత సహకారం వ్యవసాయ పరిపాలన సామర్థ్యం బలోపేతం చేస్తుందని తెలిపారు. ప్రసాద్ సీడ్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ మాట్లాడుతూ రైతులను ఖండాల మధ్య కలిపే తన దృష్టిని పంచుకున్నారు. టరాభా సీడ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ యువతకు ఆధునిక సీడ్ టెక్నాలజీపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించిన శిక్షణా విభాగాలను వివరించారు. అనంతరం శిక్షణ పొందిన నైజీరియా విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టరాభా రాష్ట్ర వ్యవసాయ శాఖ పర్మినెంట్ సెక్రటరి డాక్టర్ ఆలీసార సాబో దంజూమా, డాక్టర్ జోషువా మార్క్, టరాభా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బుకె పాస్, ఐపిఈ డైరక్టర్ ఎస్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ కె వీరాంజనేయులు, అంబాసదర్ రాజశేఖర్, నాగేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.




ఈ కార్యక్రమంలో ఐపిఈ ఆన్‌లైన్ అకాడమీ ప్రారంభించారు. ఇది డిజిటల్ లెర్నింగ్‌లో కొత్త యుగానికి సంకేతమని ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసమూర్తి ఐపిఈ డైరక్టర్ అన్నారు. ఈ ఆవిష్కరణ సంస్థ జ్ఞానాన్ని సాంకేతికత ద్వార విస్తరించడంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో విద్యా ప్రాముఖ్యతను బలపరచడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నా రు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### కాలుష్య మండలి పర్యావరణ ఇంజనీర్ బి.రాజేందర్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/మల్కాజిగిరి:** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం కూకట్‌పల్లి సమతానగర్‌లోని రిషి యూబిఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణ, మరియు పర్యావరణహిత జీవన విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలోని భాగంగా విద్యార్థినులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాస రచన, పోస్టర్ తయారీ, నినాదాల రచన వంటి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల నుఅందచేసారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, సుస్థిర అభివృద్ధి అంశాల్లో అవగాహన కల్పించటమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని కాలుష్య మండలి పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి.రాజేందర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేస్తూ భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు కృషి చేయాలంటూ సూచించారు. **మౌలాలిలో...**మౌలాలి ఏపిఐఐసి కాలనీ పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా యుబిడి డిప్యూటి డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో మెక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ పార్కుల్లో రహదారులకు ఇరువైపులా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మెక్కలు నాటటంలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుబిడి అసిస్టెంట్ డిప్యూటి డైరెక్టర్ శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, వెంకటేష్, రవీందర్, రాజు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.





## మోత్కపల్లి గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో3వ ర్యాంక్

### సర్పంచు అమృతమ్మ స్వీకరణ

**ప్రజాపక్షం/వికారాబాద్:** నియోజకరవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కపల్లి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ రావడం జరిగింది.

బుధవారం న్యూఢిల్లీలోని కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ ,కేంద్రసహాయమంత్రి ఎస్‌పి సింగ్ బఘెల్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డు జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, గ్రామ సర్పంచు అమృతమ్మ అవార్డు ను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచు గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు అందించిన అమూల్యమైన సహకారం ,ప్రోత్సాహానికి పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ శాఖ ప్రధాన కార్యదర్శి దానాకిషోర్, దివ్యారాజన్ , జిల్లా యంత్రాంగానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచు, గ్రామ ప్రజలు, ఈ సందర్భంగా గ్రామాన్ని మరింత అభివృద్ధిలో తీసుకుపోవడం జరుగుతుందన్నా రు.




## నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** పోలీసులమని నమ్మించి ఓ వ్యాపారవేత్తను కిడ్నాప్ చేసి, బెదిరింపులకు పాల్పడి రూ.6.26లక్షలు దోచుకున్న నకిలీ పోలీసుల ముఠాను బుధవారం జగద్గిరి గుట్ట పోలీసులు, కూకట్‌పల్లి సీసీఎస్ బృందం సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ కేసులో 5గురుని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లికి చెందిన కావూరి పూర్ణచంద్రరావు (42) ఈ నెల 18న ప్రశాంత్‌నగర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, జగద్గిరిగుట్టలోని శుభోదయ కాలనీ సమీపంలో కారులో వచ్చిన నిందితులు అడ్డగించారు. తమను పోలీసులమని చేసుకుని, హర్యానాలో మీపై కేసు నమోదైందని చెప్పి విచారణ పేరుతో బలవంతంగా కారులోకి ఎక్కించారు. అనంతరం బాధితుడి మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డు, నగదు స్వాధీనం చేసుకుని బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు తెలుసుకున్నారు. హర్యానా పోలీసు అధికారిగా నటిస్తూ నకిలీ వీడియో కాల్ ఏర్పా టు చేసి మరింత నమ్మించారు. బాధితుడిని సూర్యాపేటకు తీసుకెళ్లి ఏటీఎంల ద్వారా రూ.1లక్ష నగదు డ్రా చేయడంతో పాటు ఫోన్‌పే, నెట్ బ్యాంకింగ్ ద్వారా మరో రూ. 5.26లక్షలు బదిలీ చేయించుకున్నారు. డబ్బు వసూలు చేసిన అనంతరం బాధితుడిపై దాడి చేసి, సిమ్ కార్డు తొలగించి, సాధారణ మొబైల్ ఫోన్ ఇచ్చి నిర్మానుష్య ప్రాంతంలో వదిలేసి పరారయ్యారు.



సాంకేతిక ఆధారాలు, ప్రత్యేక దర్యాప్తు ద్వారా నిందితులు నాగరాజు రఘువర్మ అలియాస్ కార్తికేయ యశ్వంత్ సింగ్, సత్యభాన్ సింగ్, తంగెళ్లపల్లి నాగేంద్ర వర్మ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్‌లు, ఎయిర్ పిస్టల్, దేశీయ తయారీ తుపాకీ, నకిలీ పోలీసు యూనిఫాంలు, ఐడీ కార్డులు, హ్యాండ్‌కప్స్, పోలీ సు స్టాంపులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జైల్లో పరిచయమైన వీరు విడుదల అనంతరం ముఠా గా ఏర్పడి, ఆర్థికంగా బలమైన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. పరారీలో ఉన్న నిందితుల అరెస్టు కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి తెలిపారు.

## అధికారుల ఉదాసీన వైఖరితో జోరుగా అక్రమ నిర్మాణాలు

### పరోక్ష సహకారం అందిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



**ప్రజాపక్షం/దుండిగల్:** బాధ్యతలేని అధికారుల తీరుతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి, నిర్మాణదారులు బరితెగిస్తూ అక్రమ నిర్మాణాలు సాగిస్తున్న అధికారులు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం దుండిగల్ సర్కిల్ లో పరిపాటిగా మారింది. దుండిగల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మారడంలేదు అధికారులు కొన్ని నిర్మాణాలు కూల్చివేసి మిగతా నిర్మాణదారులకు పరోక్ష సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని దుండిగల్ సర్కిల్ లో అక్రమ నిర్మాణాలు పరంపర కొనసాగుతుంది. అక్రమ నిర్మాణాలు చెపడితే కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తున్నా అక్రమ నిర్మాణదారులకు పరోక్ష సహకారం అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డి.పోచంపల్లి చర్చి గాగిలాపూర్ అనుమతిలేని కమర్షియల్ షట్టర్స్, షెడ్లు నిర్మిస్తున్నా కాసులకు కక్కుర్తిపడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తిచూడం లేదు,అధికారుల వైఖరితో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు ఏసీపీ శ్రీనివాస్ దుండిగల్ సర్కిల్ పరిధిలోని చర్చి గగిలాపూర్ డి.పోచంపల్లి వద్ద అనుమతిలేకుండా నిర్మిస్తున్న భారీ షెడ్డు, గగిలాపూర్ కమర్షియల్ షట్టర్స్ పై టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ న వివరణ కోరగా సదరు నిర్మాణాన్ని,నోటీస్ లు జారీ చేశామని విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయన్నారు.



## తాండూరులో విషాదం...

### కాగ్నా నీటిలో మునిగి ఒకరు మృతి..మరొకరి గల్లంతు

**ప్రజాక్షం/తాండూరు:** తాండూరులో విషాద ఛాయలు నెలకున్నాయి. సరదా గా ఈత కొట్టేందుకు వెళ్ళిన ఇద్దరు వ్యక్తులు నీటి మునిగారు. ఈ ఘటన బుధవారం కోకట్ సమీపంలోని కాగ్నా నదిలో చేటు చేసుకుంది. కాగ్నా నీటిలో మునిగిన ఇరువురిలో ఒకరు మృతి చెందగా, మరొకరి ఆచూకీ గల్లంతైంది. నీటిలో మునిగి గల్లంతైన వారికోసం యాలాల పోలీసులు ముమ్మురంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాండూరు పట్టణంలో పాత తాండూరు చెందిన మోహిజ్(28), సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధి పస్తేపూర్ గ్రామానికి చెందిన అతని బంధువు రహమత్ అనే వ్యక్తిలు వారి కుటుంబ సభ్యులతో కలసి కోకట్ గ్రామ సమీపంలోని కాగ్నా నది వద్దకు సరదా కోసం వెళ్ళారు. అక్కడ మోహిజ్ , రహమత్‌లు ఈత కొట్టేందుకు నదిలోకి దిగారు. కొద్ది సేపటికే వారు ఇద్దరు నీట మునిగిపోయారు. ఇట్టి విషయం తెలుసుకున్న స్థానికులు, యాలాల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. గల్లంతైన రహమత్ ఆచూకి కోసం ఈతగాళ్ళ సహయంతో మమ్మురంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నీటి మునిగి మృతి చెందినట్లు విషయం తెలుసుకున్న అదే కుటంబానికి చెందిన బంధువు మృత దేహాలను చూడటానికి వచ్చిన సాజీద్ జిల్లా ఆసుపత్రికి వచ్చి గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో ముగ్గురు వ్యక్తుల మృతితో విషాద ఛాయలు అలుము కున్నాయి.



## ప్రజల ఆంకాంక్షలను నెరవేర్చాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్ బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** తెలంగాణా రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం, ప్రాణ త్యాగాలు కేవలం భౌగోళిక విభజన కోసం మాత్రమే కాదని, నీళ్లు, నిధులు, నియామకాల ద్వారా తమ ఆంకాంక్షల సాధన కోసమన్న విషయాన్ని గుర్తుంచుకొని పాలకులు వాటిని నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి. దామోదర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించగా నారా నర్సింహ సిపిఐ పతాకాన్ని ఎగురవేసారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం ఏర్పడి 12ఏళ్లు పూర్తవుతున్నా స్వరాష్ట్ర ఆంకాంక్షలు ఎందుకు నెరవేరటం లేదన్న విషయం ప్రతి ఒక్కరి మదిలో మిగిలిన ప్రశ్నగా ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ఆదాయం పెరుగుతున్నా ప్రజలపై అప్పుల భారం పెరిగిపోతోందన్నారు. అధికారంలో ఉన్న పాలకులు తెలంగాణా ఉద్యమ స్ఫూర్తిని మరువరాదని, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవటం అంటే కేవలం నివాళులర్పించటం మాత్రమే కాదని, వారు కలలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, నారా నర్సింహ, లక్ష్మీ నారాయణ, అశోక్, సుదర్శన్, వంశీ కృష్ణ, ప్రతాప్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల ఆలయాలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక

### దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్:**వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని కొలుకుంద గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్పీకర్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. దుర్గామాత చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు, స్థానికనాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలుకు రైతుల ధర్నా

### మద్దతు పలికిన ఎఐకెఎస్ నాయకులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని తూకం వేయడం లేదని రైతులు బుధవారం రోడ్డెక్కారు. శామీర్‌పేట మండలంలోని వ్యవసాయ సహకారం సంఘానికి రైతులు తీసుకవచ్చిన ధాన్యం రోజుల తరబడి ట్రాక్టర్‌లలోనే ఉంటుందని దీంతో వెయిటింగ్ చార్జీలు పెరుగుతున్నాయని రైతులు ఆరోపించారు. ఈ ధర్నాకు ఎఐకెఎస్ రాష్ట్ర, జిల్లా నాయకు లు డిజి నరేంద్రప్రసాద్, రాజిరెడ్డి, ఇతరులు మద్దతు పలికారు. రోడ్డుపై బైఠాయించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు నాయకులతో కలిసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ రైతులను, నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైతులు సామరస్యంగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని రోడ్డుపై ధర్నాలు చేస్తే సమస్యలు పరిష్కారం కావని రైతులకు ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ సూచించారు. అనంతరం డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయిలతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలును సక్రమంగా చేయాలని రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరించాలని గతంలో సంబంధిత అధికారులకు మెమోరాండాలు ఇచ్చామని చెప్పారు. అయినా ఐకెపి కేంద్రాల్లో రైతులు పండించిన దాన్యం తీసుకోవడానికి గన్నీ బ్యాగులు లేకపోవడం, మిల్లర్ల సమస్యలు, ట్రాన్స్‌పోర్ట్ లాంటి సమస్యలతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ఎఐకెఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలన్నగారి రాజిరెడ్డి, నర్ల రమేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, నీరుడి బాలు, పశుపతి, మహేష్‌యాదవ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

### కాంగ్రెస్ నాయకుడు ఎన్.ప్రభాకర్

**ప్రజాపక్షం/దుండిగల్:**దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని దుండిగల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్.ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సరైన స్థలం అధికారులు చూపాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరైన ఫలితం లేదని అధికారులు దృష్టి సారించి రాజ్యాంగ నిర్మాత విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని అన్నారు.

హీరో నందమూరి బాలకృష్ణ, మాస్ యాక్షన్ స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం ఎన్‌బికె 111 ఇప్పటికే మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

రీల్

# చిరంజీవి ఫోన్ రాగానే భయపడ్డా

## 'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబు



రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా విడుదల అవుతున్న సినిమా పెద్ది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో డైరెక్టర్ బుచ్చిబాబు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సినిమా షూటింగ్‌లో చరణ్‌కి చాలా గాయాలయ్యాయి. ముఖ్యంగా రెజ్లింగ్ సన్నివేశాల్లో దెబ్బలు తగిలాయి. కంటికి గాయం అయ్యి రక్తం కారినప్పుడు మాత్రం నాకు చాలా భయమేసింది. చిరంజీవి తిడతారేమో అని భయమేసింది. అది కెమెరాలో కూడా రికార్డ్ అయింది. ఒక ఫైట్ సీన్‌లో పొరపాటున తగిలింది. అయితే చిరంజీవి 'బుచ్చి వీడియో పంపించు' అన్నారు పెద్ది జర్నీని మూడు దశలుగా విభజించాం. ప్రతి దశకు లుక్ ఎలా ఉండాలో ఏఐలో డిజైన్ చేసి ఆయన దగ్గరకు తీసుకెళ్లాను. నేను డిజైన్ చేసిన దానికంటే ఇంకా అద్భుతంగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ మైండ్‌బ్లోయింగ్‌గా అనిపించింది. క్లైమాక్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు.ఒక కమర్షియల్ హీరోను ఆర్గానిక్‌గా చూపించడం కత్తి మీద సాము లాంటిది. క్లైమాక్స్ ఎలా ఉంటుందో మీరు బిగ్ స్క్రీన్‌పై అనుభవించాలి. ఒకప్పుడు పాటల క్యాసెట్లు కొనుక్కొని సినిమాలకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు కంటెంట్ అంతా ముందే ఇచ్చేస్తే థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ ఏముంటుంది? ఈ సినిమాలో స్పోర్టస్ ఎమోషన్‌తో పాటు బ్యాక్‌డ్రాప్‌లో చాలా పెద్ద కథ ఉంటుంది. ఒక 15 నిమిషాల మెయిన్ ఎమోషనల్ బ్లాక్ ఉంది. దాన్ని ట్రైలర్‌లో రివీల్ చేయలేదు. సుకుమార్ ఒక సినిమా చేస్తున్నప్పుడు పూర్తిగా అదే సినిమా గురించి మాత్రమే ఆలోచిస్తారు. మరో కథ వైపు ఆయన మనసు వెళ్లదు. పెద్ది చూసిన తర్వాత సెకండాఫ్ తన ఫేవరెట్ అని చెప్పారు. ఇది విజయనగరం బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఫిక్షనల్ స్టోరీ. 1985 నాటి పరిస్థితులను రీక్రియేట్ చేయడానికి అవినాష్ అద్భుతమైన ఆర్ట్ వర్క్ చేశారు. ప్రతిదీ చాలా నేచురల్‌గా ఉంటుంది.ఫ్యామిలీతో కలిసి వెళ్లి హ్యాపీగా చూడండి. సూపర్‌గా ఉంటుంది. చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. కమర్షియల్‌గా ఉంటుంది. ఇందులో చరణ్ కనిపించరు... పెద్ది మాత్రమే కనిపిస్తాడు. పెద్ది ఆట నుంచి ఏం నేర్చుకున్నాడు, ఆ ఆట అతనికి ఏమిచ్చింది అనేది ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. ఒక మంచి కథ సిద్ధంగా ఉంది. ఎవరితో చేస్తానేది తర్వాత చూద్దాం. ఎన్‌టిఆర్ పిలిస్తే మాత్రం పరిగెత్తుకుంటూ వెళ్లి కథ చెబుతాను.

### తమ్మారెడ్డి భరద్వాజ చేతుల మీదుగా

# 'సర్కారు బాయి' పోస్టర్ విడుదల

తెలంగాణ సామాజిక నేపథ్యంలో నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటాలను ప్రతిబింబించే కథాంశంతో తెరకెక్కుతున్న 'సర్కారు బాయి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వివిఎన్ ఆదిత్య ముఖ్య అతిథులుగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ్ నిమ్మల, వర్షిక జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి లారా దర్శకత్వం వహిస్తుండగా, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో 80 దశకంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ నీటి సమస్య అనేది కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి కీలకమైన అంశాన్ని కథాంశంగా తీసుకుని సినిమా రూపొందించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఈ సినిమాలో నటించిన హీరోయిన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని నమ్ముతున్నాను. చిత్ర యూనిట్‌కు నా హృదయపూర్వక అభినందనలు అని అన్నారు. తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ సర్కారు బాయి కథాంశం చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుతం ప్రేక్షకులు కంటెంట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. మంచి కథతో వచ్చే సినిమాలను ఆదరిస్తున్నారు. ఇలాంటి సబ్జెక్టులతో సినిమాలు నిర్మించే నిర్మాతలు ఉండటం పరిశ్రమకు గొప్ప విషయం. నా అభిమాన క్రికెటర్ లారా లాగానే దర్శకుడు లారా కూడా పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం, సామాజిక అంశాలతో కూడిన కథలంటే నాకు ఎంతో ఇష్టం. అలాంటి కథలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. హీరోయిన్ వర్షిక మాట్లాడుతూ నేను తెలుగమ్మాయిని. ఇలాంటి మంచి కథలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ కథ విన్న వెంటనే ఇది జాతీయ అవార్డు స్థాయి సినిమా అవుతుందనే నమ్మకం కలిగింది. ప్రేక్షకులందరూ ఈ చిత్రానికి మద్దతు ఇవ్వాలని అన్నా రు. దర్శకుడు లారా మాట్లాడుతూ చరిత్రలో ఈ చిత్రానికి మూలకథ. 1985లో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనలు, కుల వివక్ష, సామాజిక అసమానతలను ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. తెలంగాణలో జరిగిన ఓ హృదయ విదారక సంఘటనను తెరపై ఆవిష్కరిస్తున్నాం. ప్రేక్షకుల ఆదరణ కోరుకుంటున్నాం అని తెలిపారు. నిర్మాత తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ నిజంగా జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. సమాజానికి సందేశాన్ని అందించే ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను తాకుతుందని నమ్ముతున్నాను. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తాం. ప్రముఖ నటీనటులతో ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా నిర్మిస్తున్నాం. అవార్డులు సాధించే స్థాయి చిత్రంగా నిలుస్తుంది. అలాగే ఈ చిత్రంలో ప్రేక్షకులు కోరుకునే అన్ని కమర్షియల్ అంశాలు ఉన్నాయి. మా చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను అన్నారు. కోప్రొడ్యూసర్ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



# ముంబైలో బాలకృష్ణ '111' షూటింగ్



హీరో నందమూరి బాలకృష్ణ, మాస్ యాక్షన్ స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ఎన్‌బికె 111' ఇప్పటికే మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. పవర్‌ఫుల్ యాక్షన్, భారీ స్థాయి మేకింగ్ తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా జూన్ 10న ఈ చిత్రానికి సంబంధించిన ఓ భారీ అప్డేట్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. భారీ ఎన్‌బికె అక్షరాలు ఇనుప గొలుసులతో బంధించినట్లుగా కనిపిస్తూ, బాలయ్య పవర్‌ను ప్రజెంట్ చేస్తున్నాయి. ట్యాగ్‌లైన్ బాలకృష్ణను సరికొత్త అవతారంలో చూపించబోతున్న సంకేతాలు ఇస్తోంది. పోస్టర్‌లో కనిపిస్తున్న బుల్లెట్ విజువల్స్, జూన్ 10 తేదీతో కలిపి అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ప్రధాన తారాగణం పాల్గొంటుండగా, కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇటీవల మంచు మనోజ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన కూడా ఈ చిత్రంలో భాగమవుతున్నట్లు ప్రకటించారు. కథలో కీలకమైన, పవర్‌ఫుల్ పాత్రలో మనోజ్ కనిపించనున్నారు.మాస్ ఎంటర్‌టైనర్లను తెరకెక్కించడంలో తనదైన ముద్ర వేసిన గోపీచంద్ మలినేని, మరోసారి హైవోల్టేజ్ యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలతో కూడిన కథను సిద్ధం చేశారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: గోపీచంద్ మలినేని, నిర్మాత: వెంకట సతీష్ కిలారు.

## ఎస్తేర్ ప్రధాన పాత్రలో 'ఎల్.జి.బి.టి.ఎ లీగల్ బ్యాటిల్'



సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిలిమ్స్ బ్యానర్‌పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా 'ఎల్.జి.బి.టి.ఎ లీగల్ బ్యాటిల్' ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రైడ్ మంత్ సందర్భంగా జూన్ నెలలో ఈ చిత్రాన్ని విడుదల చెయ్యదలచామని, ఎల్.బి శ్రీరామ్, ఎస్తర్ నొరోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి, ప్రీతీ నిగమ్ లాంటి ప్రముఖ నటీనటులతో పాటు చాలా మంది రియల్ ట్రాన్స్‌జెండర్ యాక్టర్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారని హిమ రాథోడ్ హీరోయిన్‌గా, చంద్రముఖి, లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు, గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణతితో నటించారని, దర్శకుడు చిత్ర టీజర్ విడుదల సందర్భంగా తెలియచేసారు. తమ జీవితాలని హృద్యంగా మలిచారని, ఈ చిత్రం ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందన్న ఆశాభావం చిత్రంలో నటించిన నటీనటులు వ్యక్తపరిచారు.

# 19న వస్తున్న 'వంద దేవుళ్ళు'

బిచ్చగాడు సినిమా తరువాత విజయ్ ఆంటోని, శశి దర్శకత్వంలోవస్తున్న తాజా చిత్రం వంద దేవుళ్ళు. ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో జరిగే ఒక వైవిధ్యమైన కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కించారు. ఇప్పటికీ ఈ సినిమాకు సంబంధించిన అమ్మ పాటకు ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. ఎమోషనల్ మదర్ సాంగ్‌తో విజయ్ ఆంటోని, శశి ఆడియెన్స్ ముందుకు వచ్చారు. వీరి కాంబో లో 'బిచ్చగాడు' తరువాత 'వంద దేవుళ్ళు' అనే సినిమా రాబోతోంది. తాజాగా 'వంద దేవుళ్ళు సినిమా నుంచి 'అమ్మ అమ్మేగా' అంటూ అమ్మ గొప్పదనం గురించి చెప్పే పాటను విడుదల చేశారు. వంద దేవుళ్లే దిగివచ్చినా అని భాష్యశ్రీ ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేశారో.. మళ్లీ ఇప్పుడు 'అమ్మ అమ్మేగా' అని అందరినీ మెప్పించేందుకు వచ్చారు. 'అమ్మ అమ్మేగా' అనే ఈ పాటకి భాష్యశ్రీ సాహిత్యం, బాలాజీ శ్రీరామ్ బాణీ, శ్రీకాంత్ హరిహరణ్ గాత్రం అన్నీ అద్భుతంగా కుదిరాయి. ఈ పాటను వింటే అమ్మ విలువ ఏంటో మరోసారి అర్థం అయ్యేలా వివరించారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరీష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు.




# తెలంగాణ సచివాలయంలో హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన

## మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదంటూ నిరసన..
## బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న హౌస్ కీపింగ్ సిబ్బంది బుధవారం ఆందోళనకు దిగారు. గత మూడు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదంటూ సచివాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర పాలనకు కేంద్ర బిందువైన ప్రతిష్టాత్మక సచివాలయంలో పనిచేస్తున్న తమకు ఈ పరిస్థితి ఎదురుకావడం బాధాకరమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.జీతాలు అందకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందని వారు తెలిపారు. కొందరు అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. తమకు రావాల్సిన మూడు నెలల జీత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను సిబ్బంది డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి, భవిష్యత్తులో జీతాల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన సచివాలయంలోనే కార్మికులు జీతాల కోసం ఆందోళన చేయాల్సి రావడం ప్రస్తుతం ప్రభుత్వ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



## వామపక్షాన్ని పునర్నిర్మిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

రాజా ప్రతిపాదించారు. ఈ చర్చ సకాలంలో జరగాల్సినది, అవసరమైనదని ఆయన అభివర్ణించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దేశం 'సవాలుతో కూడిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితి' గుండా సాగుతోందని రాజా లేఖలో పేర్కొన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కార్మిక అభద్రత, పెరుగుతున్న అసమానతలపై విస్తృత ఆందోళనలు ఉన్నప్పటికీ, వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం ఆవశ్యకత గురించి పెద్ద ఎత్తున ప్రజలకు వామపక్ష పార్టీలు సమర్థవంతంగా ఒప్పించలేకపోయాయన్నారు. ఇటీవలి సంవత్సరాలలో వామపక్ష పార్టీలు ఎన్నికలలో ఎదుర్కొన్న ఎదురుదెబ్బల పట్ల, అలాగే నిరంతర ప్రజా పోరాటాలు సాపేక్షంగా క్షీణించడం, యువ తరాలను ఆకర్షించడంలో, రాజకీయంగా ప్రేరేపించడంలో ఎదురవుతున్న ఇబ్బందుల పట్ల రాజా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలకు అన్ని వామపక్ష శక్తులు 'తీవ్రమైన ఆత్మపరిశీలన, ఉమ్మడి చర్చ' చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితికి ఐక్యంగా ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఉందని పేర్కొంటూ నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ, కార్మికులు, రైతులపై దాడులు, 'ఆశ్రిత పెట్టుబడి'కి అనుకూలమైన విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించగల విశ్వసనీయమైన, పోరాట ప్రత్యామ్నాయంగా వామపక్షాలు తమను తాము నిరూపించుకోవాలని రాజా ఉద్ఘాటించారు. ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికలలో, సిపిఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)ను కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) ఓడించడంతో వామపక్షాలకు ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేరళ ఎన్నికల ఫలితాలు ఆత్మపరిశీలన, సంస్థాగత పునరుద్ధరణ ఆవశ్యకతపై వామపక్ష వర్గాల్లో చర్చలను రేకెత్తించాయి. సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు ఇద్దరూ కేరళ ఎన్నికల ఫలితాన్ని ఒక తీవ్రమైన ఎదురుదెబ్బగా అభివర్ణించారు. ఓటమికి గల కారణాలపై సమీక్ష చేపడతామని వారు పేర్కొన్నారు.

## ఎసిబి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో భారీ స్థాయిలో స్థిర, చరాస్తులు వెలుగులోకి వచ్చినట్లు ఎసిబి వెల్లడించింది. సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూములు, ఐదు ఓపెన్ ప్లాట్లు, రెండు ఇళ్లు, హైదరాబాద్‌లో ఒక వాణిజ్య భవనానికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.3.83 లక్షల నగదు, రూ.8 లక్షల బ్యాంకు నిల్వలు, సుమారు కిలో బంగారు ఆభరణాలు, ఒక మారుతి స్విఫ్ట్ కా రు, ఒక కియా సెల్టోస్ వాహనాన్ని గుర్తించారు. ఎ సిబి ప్రాథమిక అంచనా ప్రకారం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.5.92 కోట్లకు పైగా ఉం డగా, మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. భుజంగరావు నివాసంలో 29 మద్యం సీసాలు కూడా లభ్యమైనట్లు వెల్లడించారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించినట్లు తెలిపారు. అ వినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కిం ద కేసు నమోదు చేసిన ఏసీబీ, మరిన్ని ఆస్తులపై విచారణ కొనసాగుతోందని పేర్కొంది. నిందిత అ ధికారి నాయిని భుజంగరావును నాంపల్లిలోని ప్ర త్యేక ఎసిబి కోర్టులో హాజరుపరచి న్యాయ రిమాండ్‌కు పంపనున్నట్లు వెల్లడించింది.ఈ కేసు రాష్ట్ర పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, అక్రమాస్తుల వ్యవహారంపై ఎసిబి దర్యాప్తు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న భుజంగరావు జైలుకు వెళ్లి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

## 60 మంది తిరుగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్ అంగీకరించారన్నారు. పార్టీ శాసనసభ్యులలో స్పష్టమైన మె జారిటీ ఇప్పుడు తన వెనుక ఉన్నారని పేర్కొంటూ, సభలో అసమ్మ తి వర్గం చట్టబద్ధమైన ప్రతిపక్షానికి ప్రాతినిధ్యం వహిస్తోందని ఆ యన ఉద్ఘాటించారు. 'టిఎంసి శాసనసభ పక్షం అనేది టిఎంసి గు ర్తుపై గెలిచిన 58 మంది ఎమ్మెల్యేల బృందం' అని ఆయన అన్నా రు. ప్రస్తుతం రాష్ట్రం వెలుపల ఉన్న మరో ఇద్దరు శాసనసభ్యులు కూడా తమ మద్దతు తెలియజేసినట్లు బెనర్జీ చెప్పారు. వారు కూ డా తమతో చేరే అవకాశం ఉందని, వారు లాంఛనంగా తమకు మద్దతును ప్రకటించిన తర్వాత, తమ బలం మరింత పెరుగుతుందని రీటాబ్రత బెనర్జీ అన్నారు. శాసనసభ పక్షం కొత్త కూర్పును స్పీకర్ ఆమోదించారని, ప్రతిపక్ష నాయకుడి కోసం ఉద్దేశించిన కార్యాలయాన్ని తన కోసం తెరిచారని ఆయన చెప్పారు. తిరుగుబాటు శిబిరం శాసనసభ పక్షానికి కొత్త నాయకత్వ నిర్మాణాన్ని కూడా ఆవిష్కరించింది. అఖుజ్జమాన్‌ను చీఫ్ విప్‌గా నియమించగా, సీనియర్ శాసనసభ్యులు జావేద్ అహ్మద్ ఖాన్, సందీపన్ సాహా, సబీనా యాస్మిన్, షియులీ సాహాలు ఉప నాయకులుగా ప ని చేస్తారని బెనర్జీ ప్రకటించారు. ఈ నియామకాలకు సంబంధించి న లేఖలను స్పీకర్‌కు ఇప్పటికే సమర్పించామని చెప్పారు. ఒక కీలకమైన రాజకీయ చర్యగా, కొనసాగుతున్న తిరుగుబాటు ఉన్నప్పటికీ శాసనసభ పక్షానికి మార్గనిర్దేశం చేయాలని రీటాబ్రత బెనర్జీ టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకి విజ్ఞప్తి చేశారు. శాసనసభ పక్షానికి ముఖ్య సలహాదారు పాత్ర పోషించాలని తాము మమతా బెనర్జీని అభ్యర్థిస్తున్నామన్నారు. అదే సమయంలో మమతా బెనర్జీ మేనల్లుడు, టిఎంసి నాయకుడు అయిన అభిషేక్ బెనర్జీతో అసమ్మతి వర్గానికి పెద్దగా రాజకీయ సంబంధాలు లేవని ఆయన సూచించారు. ఈ హటాత్ పరిణామంతో పశ్చిమబెంగాల్‌లోని అన్ని సంస్థాగత కమిటీలు ప్రతి అనుబంధ సంస్థలను రద్దు చేస్తున్నట్లు మమతాబెనర్జీ వర్గం టిఎంసి ప్రకటించింది.

## డికె శివకుమార్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సభకు నమస్కరించి, అజ్జయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని, శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ శాసనసభ్యులు కె.హెచ్. మునియప్ప, కె.జె. జార్జ్, ఎం .బి. పాటిల్, రామలింగారెడ్డి, సతీష్ జార్కిహో ళి, కృష్ణ బైరెగౌడ, ప్రియాంక్ ఖర్గే, యు.టి. ఖాదర్, ఈశ్వర్ ఖండ్రే, డాక్టర్ యతీంద్ర సిద్ధరామయ్య, బైరతి సురేష్, శరణ్ ప్రకాష్ పాటి ల్ కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. యు.టి. ఖాదర్, డాక్టర్ యతీంద్ర కొత్తగా మంత్రివర్గంలో చేరగా, మిగిలినవారు గతంలో సిద్ధరామయ్య మంత్రివర్గంలో మం త్రులుగా పనిచేశారు. వీరిలో నలుగురు శాసనసభ్యులు బెంగళూరు నగరానికి చెందినవా రే. కర్ణాటక జెండా రంగులను ప్రతిబింబించేలా 'గ్లాస్ హౌస్' ఎరుపు, పసుపు రంగులతో అలంకరించబడింది. జ్యోతిష్యుల సలహా మేర కు, శుభప్రదంగా భావించే తూర్పు దిశగా వే దికను ఏర్పాటు చేశారు. వేదిక వెనుక భాగంలో 'విధాన సౌధ' చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేదికపైకి వెళ్ళే ముందు, ప్ర మాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన వివిధ మత గురువుల ఆశీర్వాదాలను శివకుమార్ కోరారు. వారిలో కొందరు ఆయనపై పూలరేకులు చల్లి ఆశీర్వదించగా, మరికొందరు ఆశీర్వాదానికి, సద్భావనకు చిహ్నంగా 'రుద్రాక్ష మాలలను' బహూకరించారు. శివకుమార్ లేత గోధుమ రంగు పట్టు జుబ్బాను, కాంగ్రెస్ పార్టీ త్రివర్ణ రంగులు కలిగిన శాలువాను ధరించారు. ఆయన మెడలో రుద్రాక్ష మాలను ధరించి, నుదుట విభూతిని ధరించారు. ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు, శివకుమార్ ప్రముఖులకు అభివాదం చేస్తూ కనిపించారు. శివకుమార్ సతీమణి ఉష, కుమార్తె ఐశ్వర్య డి.కె.ఎస్. హెగ్డే, ఇతర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పదవీ విరమణ చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శులు (కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి) రణదీప్ సింగ్ సూర్జేవాలా, కె.సి. వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన ప్రముఖులలో కర్ణాటక ప్ర ధాన న్యాయమూర్తి విభు బఖ్రు, ఇన్ఫోసిస్ స హ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, ఆయ న సతీమణి, రాజ్యసభ సభ్యురాలు సుధా మూర్తి; ఆదిచుంచనగిరి మహా సంస్థాన మఠాధిపతి నిర్మలానందనాథ స్వామి, కర్ణాటక రా ష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ప్ర సాద్, భారత మాజీ క్రికెటర్లు మహ్మద్ అజారుద్దీన్, అనిల్ కుంబ్లే, ప్రముఖ నటుడు ధనంజయ, సంగీత దర్శకులు అర్జున్ జన్య, గురుకిరణ్, నటిగా మారి రాజకీయాల్లోకి ప్రవేశించిన రమ్య ఉన్నారు.

**మోదీ అభినందనలు!**

ముఖ్యమంత్రిగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డికె శివకుమార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంతో కలి సి పని చేస్తుందని అన్నారు. ఈ మేరకు ఎక్స్ లో ట్వీట్ చేశారు. 'కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన డికె శివకుమార్‌కు అభినందనలు. ప్రజల సంక్షేమం కోసం కేం ద్రం కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుం ది' అని మోదీ పోస్ట్‌లో పేర్కొన్నారు.

## పెత్తనం ఒప్పుకోం

(మొదటి పేజీ తరువాయి)

సమాధానమిచ్చారు. తమకు పోరాటాలు, త్యాగాలు కొత్తకాదన్నారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదమని చెబుతున్న పవన్‌కల్యాణ్, గతంలో మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలని పొట్టి శ్రీరాములు 58 రోజులు పాటు నిరాహార దీక్ష చేశారని, దీనిని కూడా ప్రాంతీయవాదం అంటారా అని నిలదీశారు. ప్రధాని మోదీ ప్రాంతీయ వాదంతో తెలంగాణకు వచ్చిన ఇండస్ట్రీలను పట్టుకొని పోయారని, జాతీయవాదం ముసుగులో మోదీ చేసే ఆర్థిక ప్రాంతీయవాదం సరైందేనా?,మోదీ గుజరాత్‌కే ప్రధానమంత్రిగా వ్యవహరించడం సరైందా..? అని ప్రశ్నించారు. పవన్‌ను డిప్యూటీ సిఎంగా గౌరవిస్తామని, ఒక నటుడిగా అభిమానిస్తామని, కానీ సచివాలయంలో కూర్చొని పెత్తనం చేస్తామంటే ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. గత 2023 ఎన్నికల్లో కూడా పవన్ పోటీ చేసిన విషయాన్ని కెటిఆర్ గుర్తు చేశారు. తెలంగాణ కచ్చితంగా తెలంగాణ భూమి పుత్రుల జాగీరే అని, ఇందులో ఎవరికీ అనుమానం అవసరం లేదని కెటిఆర్ స్పష్టం చేశారు. ఎన్‌టిఆర్ పట్ల తమకు గౌరవం ఉందని ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఉద్దేశించి కెటిఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సాధించిన ప్రగతిని దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా జరిగినట్టు నిరూపిస్తే తాను శాశ్వితంగా రాజకీయల నుంచి తప్పుకుంటానని కెటిఆర్ కాంగ్రెస్, బిజెపిలకు సవాల్ విసిరారు. బిఆర్‌ఎస్ తొమ్మిదన్నరేళ్ల పాలనలో కేవలం రూ.2.8 లక్షల కోట్ల అప్పులు చేస్తే, ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 4 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పును కాంట్రాక్టర్లకు, కమీషన్లకు మాత్రమే ఇచ్చారన్నారు. తెలంగాణలో మోదీ,రేవంత్ జోడీ ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్‌ఎస్ 90 స్థానాల్లో విజయం సాధిస్తుందని, సిఎం రేవంత్ రెడ్డిని ఆయన సొంత నియోజవర్గమైన కొడంగల్ లో ఓడిస్తామని చెప్పారు. అవసరమైనప్పుడు కెసిఆర్ బయటకువస్తారని, తాను 2027 సంవత్సరంలో రాష్ట్రంలో పాదయాత్ర చేపడుతానని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, ఒక్క రూపాయి కూడా అదనంగా కేటాయించలేదని ఆరోపించారు. సెక్షన్ 8ని అడ్డం పెట్టుకుని హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలని కుట్ర జరిగిందని, మరోసారి అలాంటి ప్రయోగం చేస్తే తెలంగాణలో మరొక బలమైన ఉద్యమం వస్తుందని, దీనికి బిఆర్‌ఎస్ నాయకత్వం వహిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రం తిరోగమనంలోకి జారుకున్నదని, ఇప్పటికే కాంగ్రెస్ సినిమా ఫెయిల్యూర్, అట్టర్ ఫ్లాప్ అని, ఒక డిజాస్టర్ సెకండ్ హాఫ్‌గా మిగిలిందని ఎద్దేవా చేశారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టుకు విషయంలో సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ముంబై వెళ్లి మహారాష్ట్ర సిఎం ఇంటి ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలోనే 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కడితేనే ఎన్నికలలో ఓట్లు అడుగుతామని ప్రకటించారని, ముందుగా ఆ ప్రకటనకు కట్టుబడి ఉండాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు.

**ఫ్యూచర్ సిటీనే లేదు..**

ఫ్యూచర్ సిటీ అనేదే లేదని, తాము అధికారంలోకి రాగానే ముమ్మాటికీ ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కెటిఆర్ అన్నారు. అక్కడ జూ పార్కుకు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మంచిరేవుల, బుద్వేల్ ప్రాంతాల్లో వంద ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, అందుకు అవసరమైతే తమ పార్టీ తరపున లేఖ కూడా ఇస్తామన్నారు. రానున్న బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాస్తామని, దీనికి సంబంధించి మీడియా అకాడమీ, ప్రెస్ క్లబ్, జర్నలిస్టులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ సూచించిన వద్దనే స్థలాన్ని కేటాయిస్తామని హామీనిచ్చారు. ఈ సమావేశానికి 'ది హిందూ' పొలిటికల్ ఎడిటర్ ఆర్. రవికాంత్ రెడ్డి సమన్వయ కర్తగా వ్యవహరించగా, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల వేదికపైన ఆసీనులయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com